




ESTD: 1999

www.voodayam.com

# వుదయం






వరంగల్ 12-08-2026 బుధవారం | సంపుటి : 11 | సంచిక : 245 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on

# 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

## తెలంగాణకు భారీగా పెట్టుబడులే లక్ష్యం : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 11 (వుదయం) :**

రాష్ట్రానికి విదేశీ, స్వదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబర్ నెలలో నిర్వహించతలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సన్నాహాలు ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమ్మిట్ సన్నద్ధత, ముందస్తు ఏర్పాట్లపై ఆయన ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విశేష సేవలు అందించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖులను ఈ గ్లోబల్ సమ్మిట్ వేదికగా ఘనంగా సన్మానించేందుకు వీలుగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని అధికారులకు సూచించారు. గత సదస్సు ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వివరాలతో పాటు, ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి మరింతగా పెట్టుబడులను రాబట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావులతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదాలు
## తొమ్మిది మంది దుర్మరణం



**సంగారెడ్డి, ఆగస్టు 11 (వుదయం) :**

సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ ప్రమాదాల్లో మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తొలి ఘటన జహీరాబాద్ మండలం సత్వార్ సమీపంలో జరిగింది. వేగంగా వచ్చిన ఒక ట్యాంకర్, ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ భయానక ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.మరో ఘటన కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఎదురైంది. వేగంగా వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి, రోడ్డు డివైడర్‌పై నుంచి అవతలి వైపునకు ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, రహదారిపై వెళ్తున్న మరో నాలుగు వాహనాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.


## విద్యార్థుల ఆందోళనలపై
## హోంమంత్రి వివరణ ఇవ్వాలి



**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఎఎంస్) :**

విద్యార్థుల నిరసనలు, వారిపై పోలీసుల చర్యల వ్యవహారంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో స్పష్టమైన వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కూడా ఆయన లోక్‌సభకు హాజరు కాకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఇతరులను బెదిరించేవారే అసలైన పిరికివారని ఆయన ప్రవర్తన మరోసారి రుజువు చేసిందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విరుచుకుపడ్డారు. వాస్తవాలను పక్కనపెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదని, అయినప్పటికీ కేంద్ర హోం మంత్రి లోక్‌సభకు హాజరు కాకపోవడం దారుణమని జైరాం రమేశ్ పేర్కొన్నారు. గడిచిన 17 రోజులుగా ఆయన లోక్‌సభతో పాటు రాజ్యసభకు కూడా గైర్హాజరు కావడం అనూహ్యంగా ఉందన్నారు. "అమిత్ షా క్షేమంగానే ఉన్నారా? అసలు ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా (#1, #2)ల మధ్య అంతా సవ్యంగానే ఉందా?" అంటూ ఆయన పరోక్షంగా ప్రశ్నలు సంధించారు.మరోవైపు, విద్యార్థుల ఆందోళనలు, పోలీసుల చర్యల అంశంపై లోక్‌సభలో సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే స్పష్టం చేశారు. సభలో జరిగే సదరు చర్చకు హోంమంత్రినే స్వయంగా సమాధానం ఇస్తారని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఇప్పటివరకు 17 రోజుల పాటు సాగిన లోక్‌సభ సమావేశాల్లో ప్రభుత్వం మొత్తం 11 బిల్లులను ఆమోదింపజేసుకుంది. అయితే వీటిలో కేవలం రెండింటిపై మాత్రమే సభలో చర్చ జరగగా, ప్రతిపక్షాల తీవ్ర ఆందోళనల నడుమ మిగిలిన బిల్లులన్నీ ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందడం గమనార్హం.

## బీజేపీ నిరాశకు నిదర్శనమంటూ 'హస్తం' ధ్వజం



**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఎఎంస్) :**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాలిడే ఫొటోపై కేంద్ర మంత్రి, భాజపా నేత గిరిరాజ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ కలకలానికి దారితీశాయి. గిరిరాజ్ సింగ్ పోస్ట్‌ను కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో ఖండించింది. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఆ ఫొటోలో రాహుల్ గాంధీ ఒక బోట్‌లో కూర్చొని ఉండగా, ఆయన పక్కన ఒక మహిళ, బాలుడు కనిపిస్తున్నారు. ఈ చిత్రాన్ని తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పంచుకున్న కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్.. ''రాహుల్‌జీ, ఈ ఫొటో ఎప్పుడు, ఎక్కడ తీసుకున్నారు? మీతో ఉన్న ఆ వ్యక్తులు ఎవరు? వారెవరో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది'' అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. ఆ ఫొటో అమెరికాలోని టెక్సాస్‌లో రాహుల్ గాంధీ తన మిత్రుడి కుటుంబ సభ్యులతో గడిపిన సమయానికి సంబంధించినదని స్పష్టం చేశారు. "మీలో దాగి ఉన్న నిరాశా నిస్పృహలే ఇలాంటి దిగజారుడు స్పందనలకు కారణమవుతున్నాయి. నిజా నిజాలు తెలుసుకోకుండా వ్యక్తిగత ఫొటోలపై ఇలాంటి ఆలోచనలు చేయడం ఏమాత్రం తగదు" అని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. రాహుల్ గాంధీ రాజకీయ కార్యకలాపాల నుంచి విరామం తీసుకుని వెళ్లే విదేశీ పర్యటనలపై భాజపా నాయకులు తరచూ విమర్శలు గుప్పిస్తూనే ఉంటారు. కొన్ని రోజుల క్రితం కూడా భాజపా ఐటీ సెల్ ఇన్చార్జ్ అమిత్ మాలవీయ స్పందిస్తూ.. జూన్ 22 నుంచి జులై 13 మధ్య రాహుల్ విదేశీ పర్యటన రహస్యంగా సాగిందని, ఆయన ఎక్కడికి వెళ్లారో, ఎవరిని కలిశారో, ఆ ప్రయాణ ఖర్చులను ఎవరు భరించారో చెప్పాలంటూ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

## పాతబస్తీ మెట్రో విస్తరణ



**హైదరాబాద్, ఆగస్టు 11 (వుదయం) :**

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా పాతబస్తీ మెట్రో రైలు పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ పురోగతిపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం పాల్గొని, ప్రాజెక్టు విస్తరణపై పలు కీలక ఆదేశాలిచ్చారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న 7.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ మార్గానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని, దానికి అవసరమైన భూ సేకరణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రస్తుతం నడుస్తున్న మెట్రో రైళ్లకు అదనపు కోచ్‌లను జత చేయాలని, అందుకోసం అవసరమైన కొత్త కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఎంజీబీఎస్‌చాంద్రాయణగుట్ట కారిడార్‌లో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించేందుకు ఢిల్లీ మెట్రో నిపుణులను సంప్రదించి, వారి సలహాలు తీసుకోవాలని హెచ్ఎంఆర్ఎల్ యాజమాన్యానికి సూచించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కుటుంబ సభ్యులకు
## కాంట్రాక్టులు కట్టబెడుతున్నారు



**హైదరాబాద్, ఆగస్టు 11 (వుదయం) :**

సింగరేణి కాలరీస్ సంస్థ చరిత్రలో మరొక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. ఒడిశా రాష్ట్రంలోని సింగరేణికి చెందిన 'నైనీ' బొగ్గు గని నుంచి ఉత్పత్తి అయిన తొలి బొగ్గు రైలు విజయవంతంగా తెలంగాణ భూభాగానికి చేరుకుంది. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఉన్న సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఈ తొలి బొగ్గు రైలు చేరుకోవడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సింగరేణి ఉన్నతాధికారులు రైలుకు, సిబ్బందికి ఘనంగా స్వాగతం పలికారు. 59 వ్యాగన్లలో 4 వేల టన్నుల బొగ్గు రవాణా ఒడిశాలోని నైనీ గని నుంచి బయలుదేరిన ఈ గూడ్స్ రైలు మొత్తం 59 వ్యాగన్ల ద్వారా సుమారు 4,000 టన్నుల జీ10 (G10) గ్రేడ్ బొగ్గును జైపూర్ థర్మల్ ప్లాంట్‌కు సురక్షితంగా చేర్చింది. సొంత గని నుంచి విద్యుత్ కేంద్రానికి బొగ్గు రవాణా ప్రారంభం కావడం వల్ల ప్లాంట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, సంస్థ లాభదాయకత మరింత పెరగనున్నాయి.

**సింగరేణి కుటుంబానికి డిప్యూటీ సీఎం భట్టి శుభాకాంక్షలు**

నైనీ బొగ్గు తొలి రైలు తెలంగాణకు చేరుకోవడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది సింగరేణి చరిత్రలోనే అద్భుతమైన ఘట్టమని కొనియాడారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో నైనీ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న ఆయన.. ఈ ఘనత సాధించిన సింగరేణి యాజమాన్యానికి, శ్రమించిన కార్మిక సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.


## కేటీఆర్ ఆరోపణలు అసత్యం



**హైదరాబాద్, ఆగస్టు 11 (వుదయం) :**

టెసరాట్ సంస్థకు భూ కేటాయింపుల వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవాలని, అందులో ఎలాంటి నిజం లేదని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. కేటీఆర్ ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆక్షేపించారు.గత బీఆర్ఎస్ పాలనలో ఎకరం రూ.90 లక్షలకు కేటాయిస్తే, తమ ప్రభుత్వం బోర్డు నిర్ణయించిన ధరకు అనుగుణంగా ఎకరం రూ.కోటిన్నరకు ఇచ్చిందని శ్రీధర్‌బాబు వివరించారు. సదరు భూముల కోసం దరఖాస్తు చేసుకున్న 32 సంస్థల్లో టెసరాట్ ఒకటని, కేటాయింపులన్నీ నియమనిబంధనల ప్రకారమే జరిగాయని చెప్పారు. ఈ కంపెనీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులకు ఎలాంటి సంబంధమూ లేదని తేల్చి చెప్పారు. ఐదు ఎకరాల్లో రూ.34 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే సంస్థను రూ.200 కోట్ల విలువైనదిగా చూపిస్తూ, కేవలం సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కేటీఆర్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో తక్కువ ధరకు భూములు ఎందుకు కేటాయించారో, అందులో ఏవైనా ముడుపులు తీసుకున్నారేమో కేటీఆరే సమాధానం చెప్పాలని మంత్రి నిలదీశారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకూడదనే దురుద్దేశంతోనే కేటీఆర్ ఈ ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పీఎం ఏక్తామాల్ టెండర్లు కూడా పూర్తి పారదర్శకంగా జరిగాయని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు భూములను రెగ్యులరైజ్ చేసినప్పుడు కేటీఆర్‌కు తప్పుగా అనిపించలేదా అని ప్రశ్నించిన శ్రీధర్‌బాబు.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కలలో మాట అని ఎద్దేవా చేశారు.

## ఇంతే కదా...!




## ఘనంగా 19వ జాతీయ ప్రజాసంబంధ విద్యా దినోత్సవం

- **పిఆర్ పితామహుడికి మంత్రి వివేక్ నివాళులు**



**హైదరాబాద్, ఆగస్టు 11 (వుదయం) :**

సి.వి.ఎన్. పిఆర్ ఫౌండేషన్, పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో 19వ జాతీయ ప్రజా సంబంధాల విద్యా దినోత్సవాన్ని హైదరాబాద్‌లోని ఎఫ్‌టిసిసిఐ వేదికగా ఘనంగా నిర్వహించారు. పిఆర్ రంగ పితామహుడు డాక్టర్ సి.వి. నరసింహారెడ్డి 93వ జయంతి సందర్భంగా "నమ్మకం, సత్యం, పారదర్శకత" అనే ఇతివృత్తంతో సాగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐ, డీప్‌ఫేక్‌లు సవాళ్లు విసురుతున్న ప్రస్తుత తరుణంలో పీఆర్ నిపుణులు నిజాయితీ, పారదర్శకతతో వ్యవహరిస్తూ వాస్తవ సమాచారాన్ని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్, సైబర్ సెక్యూరిటీ నిపుణులు డాక్టర్ శ్రీరామ్ బిరుదవోలు తదితరులు పాల్గొన్న ఈ వేడుకలో పిఆర్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులకు జాతీయ స్థాయి పురస్కారాలను అందజేశారు.





# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

■ సర్పంచ్ కానుగుల విజయస్వామి పరామర్శ

దౌల్తాబాద్ ఆగస్టు 11(వుదయం):

మండలంలోని ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన శేర్‌పల్లి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కానుగుల విజయస్వామి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. యాదగిరి మృతి కుటుంబానికి తీరని లోటని,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.మృతుని కుటుంబ పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్, గ్రామస్తులు కోరారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో గ్రామస్తులు,నాయకులు పాల్గొన్నారు.

# పశువైద్య సేవలు మెరుగుపరచాలి కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

■ పశుపోషణతో అదనపు ఆదాయం పొందాలని రైతులకు సూచన

తిమ్మాజీపేట, ఆగస్టు 11 వుదయం ప్రతినిధి:

పశుసంపద పరిరక్షణతో పాటు పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది విధులను పరిశీలించారు. పశువులకు వైద్యం కోసం వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ సేవలు అందించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి కేసును నమోదు చేసి సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. పశువుల యజమానుల ఆధార్, పశువుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, గ్రామాల వారీగా నమోదు కాని రైతుల వివరాలు సేకరించి నమోదు చేయాలని పశు వైద్యాధికారిని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు చేరాలంటే పూర్తి వివరాలు ఉండాలని తెలిపారు.అనంతరం తిమ్మాజీపేట మండలం మరికల్ గ్రామంలో రైతు పెర్కంపల్లి లింగం పొలాన్ని సందర్శించారు.వ్యవసాయంతో పాటు పశుపోషణను అనుబంధ రంగంగా చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు.రైతు వద్ద ఉన్న పశువుల సంఖ్య, పాల ఉత్పత్తి, నెలవారీ ఆదాయం, దాణా, మేత, టీకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పశువుల ఆరోగ్యం,  పోషకాహారం, పరిశుభ్రత, సకాలంలో వైద్యం కీలకమని పేర్కొన్నారు. నాణ్యమైన మేతతో పాల ఉత్పత్తి పెంచుకోవచ్చని, శాస్త్రీయ పద్ధతుల్లో పశుపోషణ చేయాలని సూచించారు. పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు, టీకాలు వేయించాలని, సమస్యలు ఉంటే వెంటనే వెటర్నరీ కేంద్రాన్ని సంప్రదించాలని రైతులకు సూచించారు. పశుపోషణపై ఆసక్తి ఉన్న రైతులకు సాంకేతిక సహకారం, అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పాండు, తిమ్మాజిపేట సర్పంచ్ కవిత, మరికల్ సర్పంచ్ రమాదేవి, మండల అధికారులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు

# మున్సిపాలిటీ లో బి.ఎల్.ఓ లకు సన్మానం

కోహీర్ ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి):



కోహీర్ మున్సిపల్ పరిధిలో స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ ఆర్) కార్యక్రమంలో బి.ఎల్.ఓ లు విశేష సేవలు అందించారు విధుల్లో బి.ఎల్.ఓ లు కనబరిచిన కష్టపడే తత్వానికి గుర్తింపుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితా రూపకల్పన అత్యంత కీలకమైన బాధ్యత.బి.ఎల్.ఓ లు చూపిన అంకితభావం, సమర్థవంతమైన పనితీరును నాయకులు కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమం కోహీర్ మున్సిపల్ టౌన్ ప్రెసిడెంట్ మహమ్మద్ ముజఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగింది. విధులను దిగ్విజయంగా పూర్తి చేసినందుకు బి.ఎల్.ఓ లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.సాంప్రదాయ పద్ధతిలో బి.ఎల్.ఓ లను శాలువాలు కప్పి గౌరవించారు.వారి సేవలను అభినందిస్తూ పూలమాలలతో సత్కరించారు ప్రతిభ చూపిన బి.ఎల్.ఓ లకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కోహీర్ మున్సిపల్ చైర్పన్ ఎమ్.ఎ. అలీ ఖాదర్ హాజరయ్యారు.మున్సిపల్ వైస్ చైర్మన్ ఎమ్.ఎ. హన్నాన్ జావేద్ పాల్గొని ప్రసంగించారు.మాజీ ఎంపీపీ మరియు బి.ఎల్.ఓ సూపర్వైజర్ మహమ్మద్ షాకీర్ అలీ ప్రత్యేకంగా పాల్గొన్నారు.కౌన్సిలర్ శిరీష రాణి హాజరై బి.ఎల్.ఓ లను అభినందించారు.పలువురు ముఖ్య నాయకులు, ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. బి.ఎల్.ఓ ల సేవలు మిగతా సిబ్బందికి మార్గదర్శకంగా నిలుస్తాయని నాయకులు పేర్కొన్నారు.స్థానిక నాయకులు ప్రజాప్రతినిధుల సమక్షంలో సత్కార గ్రహీతలు సంతోషం వ్యక్తం చేశారు.అందరి కలయికతో ఈ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.

# గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



■ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

అచ్చంపేట, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి):

పట్టణంలోని 12వ వార్డులో మంగళవారం జరిగిన మార్నింగ్ వాక్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.మార్నింగ్ వాక్ అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న వారసులు కళాకారులు

■ TUWJ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ

(వుదయం, హైదరాబాద్):





తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, తెలంగాణ అంటే ఒక జీవన సంస్కృతి... తెలంగాణ అంటే ఆట, పాటల పుట్ట... తెలంగాణ అంటే విభిన్న సంస్కృతుల, సంప్రదాయాల గడ్డ... తెలంగాణ అంటే పల్లె మట్టి పరిమళమని, ఆ మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న గొప్ప వారసులు మన జానపద కళాకారులని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. మంగళవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, గాజుల రామారంలోని పద్మావతి కన్వెన్షన్ లో, "కలాలు, గలాల వేదిక" నిర్వహించిన బోనాల కళా జాతరకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు. గాయకుడు దరువు అంజన్న ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, పుస్తకాల్లో లేని చరిత్రను పాటల ద్వారా వారిని చైతన్య పరిచేవాళ్ళే ప్రజా కళాకారులని, రైతుల కష్టాలను, కూలీల మహిళల భావాలను, పల్లె జీవనాన్ని ప్రతిబింబించిన ఘనత కళాకారులకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. కళాకారుడి చేతిలోని డప్పు కేవలం ఒక వాయిద్యం మాత్రమే కాదని, అది ప్రజల గుండె చప్పుడని, అతని గొంతులో వినిపించే పాట కేవలం వినోదం మాత్రమే కాదని, అది సమాజానికి ఒక సందేశం, ఒక చైతన్యమని ఆయన పేర్కొన్నారు. అందుకే కళాకారుడిని కేవలం వినోదం అందించే వ్యక్తిగ కాకుండా, ఒక చరిత్రకారుడిగా, ఒక సామాజిక కార్యకర్తగా, ఒక చైతన్యవంతుడిగా, ప్రజల గొంతుక చూడాలని విరాహత్ అలీ అన్నారు.కళ బతికితే సంస్కృతి బతుకుతుందని,

**సంస్కృతి బతికితే సమాజం బతుకుతుందని,**

సమాజం బతికితే మన అస్తిత్వం బతుకుతుందని ఆయన స్పష్టం చేసారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జి. బాల్ రాజ్ గౌడ్ తో పాటు కళాకారులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఈ నెల 13న ఉమామహేశ్వర క్షేత్రంలో మహా వరుణ యాగం

■ సమృద్ధి వర్షా ల కోసం ప్రత్యేక పూజలు

అచ్చంపేట, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి):



తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రాజెక్టులు జలకళ సంతరించుకోవడంతో పాటు రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని ప్రముఖ ఉమామహేశ్వర క్షేత్రంలో మహా వరుణ యాగం నిర్వహిస్తున్నట్లుదేవస్థానం చైర్మన్ బీరం మాధవరెడ్డి మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు ఈ వరుణ యాగం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, సీబీఎం ట్రస్ట్ చైర్పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ దంపతుల ఆధ్వర్యంలో ఈ నెల 13న గురువారం యాగాన్ని నిర్వహించనున్నారు. యాగం కోసం దేవస్థానం చైర్మన్, పాలకమండలి సభ్యులు, అర్చకులు, దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ పవిత్ర కార్యక్రమానికి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చైర్మన్ బీరం మాధవరెడ్డితో పాటు ఆలయ ఈవో శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు కోరారు.

# ఈవీఎం గోడౌన్‌పై కలెక్టర్ తనిఖీ

■ భద్రతలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలి

గద్వాల ఆగస్టు 11 (వుదయం బ్యూరో)



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం పరిశీలించారు. ఈవీఎంల నెలవారీ సాధారణ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్.. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ల భద్రత, పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈవీఎంల నిల్వ, భద్రతా ఏర్పాట్లు, నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఆయన.. ఎన్నికల యంత్రాల విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచిం చారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి చిన్నపాటి నిర్లక్ష్యానికి కూడా తావివ్వకుండా నిబంధనల ప్రకారం పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గోడౌన్‌లోని నిర్వహణ తీరును పరిశీలించిన అనంతరం తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి కలెక్టర్ సంతకాలు చేశారు. ఈవీఎంల భద్రత, సంరక్షణకు సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా ఎన్నికల విభాగం పర్యవేక్షకు రాలు మంజుల, ఎన్నికల ఉప తహసిల్దార్ ఉదయ్ కిరణ్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ జీవిత బీమా తీసుకోవాలి

■ మిషన్ భగీరథ మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేష్

కల్వకుర్తి ఆగస్టు 10 (వుదయం ప్రతినిధి):



మనిషి జీవితంలో ప్రతి ఒక్కరూ జీవిత బీమా తీసుకోవాలని మిషన్ భగీరథ మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పిలుపునిచ్చారు.నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం, తలకొండపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన తిరుమని శ్రీనివాస్ గౌడ్ గత రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు మరణించారు. శ్రీనివాస్ గౌడ్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో ప్రమాద బీమా ప్రీమియం చెల్లించి ఉండడంతో, 35 లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి మంగళవారం నాడు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "బీమా ఉండడం వల్ల అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుంది. కుటుంబ యజమాని లేని సమయంలో ఇది పెద్ద అండగా నిలుస్తుంది. భవిష్యత్తు అవసరాల కోసం డబ్బు కూడబెట్టడానికి, ఆదాయపు పన్ను చట్టాల ప్రకారం పన్ను మినహాయింపులు పొందడానికి, వృద్ధాప్యంలో క్రమబద్ధమైన ఆదాయం కోసం జీవిత బీమా ఉపయోగపడుతుంది. ప్రమాదం జరిగినప్పుడు రుణాల భారం కుటుంబంపై పడకుండా బీమా ఓ భరోసాగా ఉంటుంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# రేషన్ పంపిణీ..కూలీలకు నిత్య శ్రమకోత!

■ మూడు నెలల బియ్యానికి ముప్పుతిప్పలు | సమాచారం లేక సుదీర్ఘ నిరీక్షణ

■ కరువైన నిబంధనలు, కనుమరుగైన పర్యవేక్షణ | అధికారుల నిర్లక్ష్యంతో పేదల ఆశలు అడియాసలు

గద్వాల ఆగస్టు 11 (వుదయం బ్యూరో)

ఒక్క రోజు పనికి వెళ్లకపోతే ఇంట్లో పొయ్యి వెలగదు. పోనీ ఆ కూలీ పని మానుకుని రేషన్ దుకాణానికి వెళ్తే అది ఎప్పుడు తెరుస్తారో తెలియదు. అక్కడ క్యూలైన్‌లో నిలబడితే రోజంతా కూలీ పోతుంది.. వెళ్లకపోతే బియ్యం దక్కవు. జోగులాంబ గద్వాల జిల్లాలోని రోజువారీ కూలీలకు ఇప్పుడు ఎటు చూసినా కష్టాలే ఎదురవుతున్నాయి. దాదాపు మూడు నెలల విరామం తర్వాత రేషన్ బియ్యం పంపిణీ మొదలైనా, అధికారుల ప్రణాళికారాహిత్యం, పర్యవేక్షణ లోపంతో పేదల పంపిణీ వ్యవస్థ తీవ్ర గందరగోళంగా మారింది. మూడు నెలల కోటాను ఒకేసారి ఇస్తుండటంతో జిల్లాలోని గ్రామగ్రామాన న్యాయధరల దుకాణాల వద్ద లబ్ధిదారులు పెద్ద ఎత్తున పోటెత్తుతున్నారు. అయితే దుకాణం ఏ సమయంలో తెరుస్తారు? పంపిణీ ఎంతవరకు కొనసాగుతుంది? అన్న వివరాలను ముందుగా ప్రకటించకపోవడంతో లబ్ధిదారులు ఉదయాన్నే వచ్చి గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఉపాధి కోసం వెళ్లాల్సిన సమయంలో దుకాణాల వద్ద నిరీక్షించాల్సి రావడంతో కూలీ డబ్బులు కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నామని నిరుపేదలు కన్నీటిపర్యంతమవుతున్నారు. బోగస్‌గా మారిన బోర్డులు.. పత్తాలేని నిబంధనలు!ప్రజా పంపిణీ వ్యవస్థ నిబంధనల ప్రకారం ప్రతి రేషన్ దుకాణం వద్ద పనివేళలు, సరుకుల స్టాకు, ధరల వివరాలు, ఫిర్యాదుల సంప్రదింపు అధికారుల ఫోన్ నంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలి. కానీ జిల్లాలో ఏ ఒక్క దుకాణం వద్ద ఈ వివరాలు సరిగా కనిపించడం లేదు. డీలర్లు తమ ఇష్టారాజ్యంగా దుకాణాలు తెరవడం, మూసివేయడం చేస్తుండటంతో లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కనుమరుగైన పర్యవేక్షణ..వృద్ధులు, దివ్యాంగుల యాతన క్షేత్రస్థాయిలో సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ బొత్తిగా కరువైంది. ఎండ తీవ్రతను సైతం తట్టుకుంటూ వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. తక్షణం అధికారులు స్పందించి ప్రతి దుకాణం వద్ద పంపిణీ వేళలను స్పష్టంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక సమయం కేటాయించి రద్దీని నియంత్రించాలని జిల్లా ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# గర్భిణుల ప్రాణాలతో చెలగాటం!

■ ఐజ ఆసుపత్రి వద్ద 'మృత్యు' గోతి.. పట్టించుకోని అధికార యంత్రాంగం

■ ప్రాణం పోతే తప్ప కళ్లు తెరవరా? అధికారుల నిర్లక్ష్యంపై జనాగ్రహం

■ వైద్యం మాట దేవుడెరుగు.. కాళ్లు చేతులు విరిగే పరిస్థితి!

ఐజ (జోగులాంబ గద్వాల):

నవమాసాలు మోసి, బిడ్డకు జన్మనిచ్చేందుకు వస్తున్న గర్భిణులకు ఐజ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృత్యుభయం దాపురించింది. ప్రాణాలు నిలపాల్సిన వైద్యాధికారులు, పట్టణ పారిశుద్ధ్యాన్ని చూడాల్సిన మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ గర్భిణుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆసుపత్రి ప్రాంగణానికి కూతవేటు దూరంలో తవ్విన ఓ భారీ ప్రమాదకర గోతిని రోజుల తరబడి పూడ్చకుండా వదిలేసి, రోగులను మృత్యుముఖంలోకి నెడుతున్నారు.

కళ్లముందే 'మృత్యుకుహరం'.. అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరి:

ఆసుపత్రికి రోజువారీ పరీక్షల కోసం నిత్యం పదుల సంఖ్యలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు వస్తుంటారు. సరిగ్గా వీరు నడిచే ప్రధాన మార్గానికి ఆనుకునే ఈ రాకాసి గోతి నిలువునా నోళ్లు తెరుచుకుని ఉంది. కనీసం ప్రమాదాన్ని సూచించే హెచ్చరిక బోర్డు గానీ, రక్షణ కంచె గానీ ఏర్పాటు చేయకపోవడం అధికారుల పరాకాష్ఠ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. పగటి పూటే అడుగు తీసి అడుగు వేయలేని ఈ దారిలో.. రాత్రివేళల్లో చీకటి అలుముకుంటే ఏ క్షణాన ఏ గర్భిణీ ఆ గోతిలో పడిపోతుందోనని స్థానికులు వణికిపోతున్నారు.



**ఏదైనా బలి కోరిన తర్వాతే మేల్కొంటారా?**


రోజూ ఆ మార్గం నుంచే వెళ్లే ఆసుపత్రి సిబ్బందికి గానీ, మున్సిపల్ అధికారులకు గానీ ఈ ముప్పు కనిపించకపోవడం విడ్డూరంగా మారింది. "ఎవరైనా గర్భిణీ గోతిలో పడి కడుపులోని బిడ్డకు ముప్పు వాటిల్లితే బాధ్యులెవరు? ప్రాణనష్టం జరిగే వరకు వేచి చూసి, ఆ తర్వాత వచ్చి పరామర్శల నాటకాలాడతారా?" అని బాధితులు, వారి బంధువులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

**వెంటనే పూడ్చకపోతే ఆందోళనలు తప్పవు!**

అధికారులు తక్షణమే నిద్రమత్తు వీడి స్పందించాలి. గర్భిణుల, రోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆ ప్రమాదకర గోతిని వెంటనే పూడ్చివేయాలి. నిర్లక్ష్యం వీడి తక్షణమే చర్యలు తీసుకోకపోతే అధికారుల తీరుకు నిరసనగా ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు మృతి





■ కోకట్ పాలిష్ యూనిట్లో ఘటన

యాలాల ఆగస్టు 11 వుదయం ప్రతినిధి :-

ఒంటిపై ఎలాంటి గాయాలు లేకుండా అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు పాలిష్ యూనిట్ల వద్ద మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. యాలాల ఎస్సై విటల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం యాలాల మండలం కొకట్ గ్రామానికి చెందిన లియాకత్ 45, గోరెప్ప 30 వరుసకు మామ అల్లుళ్లు ఇద్దరు సమీపంలోని సుమిత్ స్టోన్ పాలిష్ పనిచేస్తున్నారు. సోమవారం ఎదవిధిగా పని చేసుకుని పాలిష్ యూనిట్ వద్ద ఉన్న గదిలో నిద్రించారు. మంగళవారం ఉదయం లియాకత్, గౌరప్ప మృతి చెంది ఉన్నారని స్థానికులు తెలపడంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. విషయాన్ని తాండూరుడి.ఎస్.పి నర్సింగ్ యాదయ్యకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య ఎక్కడికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. మృతుల ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని పోలీసులు గుర్తించారు. వారు ఎలా మృతి చెందిన విషయాలు తెలవకపోవడంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విట్టాల్ రెడ్డి తెలిపారు.

# రైతన్న మెడపై దళారీ కత్తి!

■ గట్టు రెవెన్యూలో 'మీ సేవ' దోపిడీ రాజ్యాంగం!

■ 'కాసులు' ఇస్తేనే స్లాట్.. లేదంటే చుక్కలే!

■ తహసీల్దార్ గుమ్మంలోనే బరితెగించిన దళారులు.. పారదర్శకతకు పాతర!

గట్టు ఆగస్టు 11 (వుదయం బ్యూరో)

ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలన్న ఆశయం గట్టు తహసీల్దార్ కార్యాలయంలో దళారుల కాసుల దాహానికి బలైపోతోంది! రెవెన్యూ యంత్రాంగం అండదండలతో కొందరు 'మీ సేవ' నిర్వాహకులు, మధ్యవర్తులు ఏకంగా ఒక సమాంతర దోపిడీ వ్యవస్థనే నడుపుతు న్నారు. భూ రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ నుంచి దస్త్రం చేతికి వచ్చే వరకు ప్రతి దశలోనూ అందినకాడికి పిండుకుంటు న్నారు. హక్కుల కోసం నేరుగా వచ్చే సామాన్య రైతులకు నిబంధనల పేరిట నరకం చూపిస్తున్న అధికారులు.. అదే దళారుల చేతులు తడిపి వస్తే నిమిషాల్లో పనులు ముగించి 'రెడ్ కార్పెట్' పరుస్తుండటంపై గట్టు మండలంలో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి.

**స్లాట్' మాయాజాలం.. లంచాల దందా!**

అత్యవసరంగా భూమి రిజిస్ట్రేషన్లు, మార్పిడులు చేసుకోవాల్సిన రైతుల బలహీనతనే ఈ ముఠా పెట్టుబడిగా మార్చుకుంది. సర్వర్లు పనిచేయడం లేదంటూ, స్లాట్లు ఖాళీ లేవంటూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. "సమయానికి పని కావాలంటే మా రేటు ఇంత!" అంటూ బహిరంగంగానే బెదిరింపు బేరసారాలకు దిగుతున్నారు. నిబంధనల ప్రకారం జరగాల్సిన ఆన్‌లైన్ ప్రక్రియలో దళారుల చేతివాటం ఏ స్థాయిలో ఉందో.. వారు వసూలు చేస్తున్న వేలాది రూపాయల అక్రమ సంపాదనే నిదర్శనం. ప్రభుత్వం నిర్ణయించిన రుసుముల కంటే అదనంగా గుంజుతున్న ఈ 'కమీషన్ల' డబ్బులు ఎవరెవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అధికారులకు తెలియంది కాదనే విమర్శలు తీవ్రమవుతున్నాయి. కార్యాలయం ప్రాంగణంలోనే 'మకాం'.. యంత్రాంగం ఏం చేస్తోంది? మీ సేవా కేంద్రాల్లో కూర్చోవాల్సిన నిర్వాహకులు, మధ్యవర్తులు ఏకంగా తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోనే తిష్ఠ వేసి దందాలు నడుపుతుండటం గమనార్హం. అధికారులతో తమకున్న 'ప్రత్యేక అనుబంధాన్ని' ప్రదర్శిస్తూ, "మా ద్వారా వస్తేనే పని అవుతుంది" అని రైతులకు తేల్చి చెబుతున్నారు. కళ్లముందే ఇంతటి బహిరంగ దోపిడీ సాగుతున్నా సంబంధిత అధికారులు 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరించడం వెనుక మామూళ్ల 'మతలబు' ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రైతుకు శ్రమ.. దళారీకి లబ్ధి! ఒకవైపు ఎండనకా వాననకా రెక్కలు ముక్కలు చేసుకునే సామాన్య రైతు, మరోవైపు భూమి హక్కుల కోసం వచ్చి ఈ దళారీ మాఫియా చేతిలో నిలువునా దోపిడీకి గురవుతున్నాడు. ఉన్నతాధి కారులారా.. ఈ ఆగడాలకు చరమగీతం పాడేదెప్పుడు? గట్టు తహసీల్దార్ కార్యాలయంలో సాగుతున్న ఈ అక్రమాలపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణమే ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. స్లాట్ బుకింగ్ మొదలుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియ వరకు ఆడిట్ జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న మీ సేవా నిర్వాహకుల లైసెన్సులను రద్దు చేయాలి. వారికి కొమ్ముకాస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. సామాన్య రైతును పీల్చి పిప్పి చేస్తున్న ఈ దోపిడీ రాజ్యాంగానికి యంత్రాంగం ఎప్పుడు ముగింపు ప పలుకుతుందో వేచి చూడాలి!



# పాముకాటుకు గురైన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి

■ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ ఆగస్టు11 (వుదయం ప్రతినిధి)



పాము కాటుకు గురైన విద్యార్థికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వైద్యులను ఆదేశించారు.దేవరకద్రలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో పాము కాటుకు గురైన విద్యార్థి మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ ఆసుపత్రిని మంగళవారం సందర్శించారు.విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, అందుతున్న చికిత్స వివరాలను సమీక్షించారు.విద్యార్థి చికిత్సకు స్పందిస్తున్నాడని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు అదనపు కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థిని నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, అవసరమైన వైద్య సేవలు అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు.విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు.

# స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

మహబూబ్ నగర్ ఆగస్టు11 (వుదయం ప్రతినిధి)



హన్వాడ మండల కేంద్రంలోని 2బీహెచ్‌కే ఇళ్లకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కేటాయించేందుకు ప్రతిపాదించిన స్థలాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా హన్వాడ తహసీల్దార్, మండల సర్వేయర్‌తో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఏర్పాటుకు స్థలం అనువుగా ఉందా, భూమి విస్తీర్ణం, సరిహద్దులు తదితర అంశాలపై వివరాలను సేకరించారు.ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి, పాఠశాల ఏర్పాటుకు అనువైన స్థలంగా ఉందా అనే అంశంపై అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# విద్యానగర్‌లో గోరింటాకు వేడుకలు

■ ఆషాడం చివరి రోజున మహిళల సంబరాలు

కల్వకుర్తి ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి):

కల్వకుర్తి పట్టణంలోని లైన్స్ క్లబ్ భవనంలో విద్యానగర్ కాలనీ మహిళలు ఆషాడం చివరి రోజు గోరింటాకు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్వయంగా గోరింటాకు వృక్షం నుండి సేకరించిన పత్రాలతో రోలు రోకలితో నూరి, ప్రకృతి సిద్ధంగా వచ్చిన గోరింటాకుతో వారి అరిచేతులకు శోభాయమానంగా అలంకరించుకొని మహిళలంతా వేడుక జరుపుకున్నారు. కాగా నేటి సంవత్సర ఆషాడ మాసం బుధవారం ఆషాడ అమావాస్య చివరి రోజుతో ముగియనుంది. 12వ వార్డు కౌన్సిలర్ గుర్రాల జ్యోతి, బీచని స్వప్న, శ్వేత, శ్యామల, భారతి, కల్పన, కాలనీ మహిళలు పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



### స్వాతంత్ర్య దినోత్సవానికి
## అన్ని ఏర్పాటు చేయాలి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఆగస్టు 11(ఉదయం ప్రతినిధి) :** స్వాతంత్ర్య దినోత్సవానికి అన్ని ఏర్పాటు చేయాలి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు,మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి , బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ లో, ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను తిలకించేందుకు వచ్చే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వచ్చే అతిథికి పోలీస్ గౌరవ వందనం తోపాటు, బందోబస్తుల ఏర్పాట్లను చూడాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. వేదిక, కుర్చీలు, బారికేడింగ్ సీటింగ్ వంటి ఏర్పాట్లు ఆర్ అండ్ బి శాఖ, వేదిక వద్దరంగురంగు పూలతో అలంకరణకు ఉద్యానవన శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. మైక్ సౌండ్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఐఅండ్ పిఆర్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులచే దేశభక్తి ని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందచేసేందుకు అన్ని శాఖల అధికారుల వివరాలు సిద్దంగా ఉండేలా చూడాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో
# గ్రామాల సమగ్ర అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు

- ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ఉండాలి – GP SAP, GPDP, BPDP, DPDPలను సమర్థవంతంగా రూపొందించాలి
- జలశ్రీ కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత – వనమహోత్సవం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- అధికారులతో సమన్వయ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి



**రంగారెడ్డి జిల్లా,ఆగస్టు 11 (ఉదయం ప్రతినిధి) :** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కేవలం ఒక శాఖ బాధ్యత కాదని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి అన్నారు. ప్రతి గ్రామానికి ఉన్న వాస్తవ అవసరాలను గుర్తించి, వివిధ శాఖల పథకాలు, నిధులు, మానవ వనరులను సమర్థవంతంగా అనుసంధానం చేసి ఫలితాలు సాధించాలని అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జలశ్రీ, GP SAP, 2026-27 GPDP, BPDP, DPDP, వనమహోత్సవం, పారిశుద్యం, శాఖల కన్వర్జెన్స్ తదితర అంశాలను అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ప్రతి గ్రామానికి ఒక స్పష్టమైన అభివృద్ధి దిశ ఉండాలి. ఏ గ్రామంలో ఏ సమస్య ఉంది, దానికి ఏ శాఖ ద్వారా పరిష్కారం చూపవచ్చు, ఏ పథకం కింద నిధులు సమకూర్చవచ్చు, ఎప్పుడు పని పూర్తి చేయవచ్చు అనే అంశాలపై అధికారులు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలి" అని సూచించారు.

ప్రతి శాఖ తన కార్యక్రమాలను గ్రామ అభివృద్ధి ప్రణాళికతో అనుసంధానం చేయాలి గ్రామ పంచాయతీ స్థాయిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఒక్కో శాఖకు పరిమితం కాకుండా, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల కార్యక్రమాలను ఒకే సమగ్ర ప్రణాళికలోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు."ఒకే గ్రామంలో వివిధ శాఖలు వేర్వేరుగా పనులు చేపట్టకుండా, పరస్పరం సమాచారాన్ని పంచుకొని ఒకే లక్ష్యంతో పనిచేయాలి. ఒక శాఖకు ఉన్న వనరులను మరో శాఖ కార్యక్రమంతో అనుసంధానం చేసి, ప్రభుత్వ నిధులను గరిష్టంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించాలి" అని అధికారులకు సూచించారు. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిని ప్రాధాన్యతా క్రమంలో నమోదు చేసి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించాలని అన్నారు.GP SAP ప్రతి గ్రామానికి అభివృద్ధి సమాచార పత్రంగా ఉండాలి ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే చోట అందుబాటులో ఉంచే విధంగా GP SAP - Gram Panchayat Samagra Abhivrudhi Pranalikaను రూపొందించాలని ఆదేశించారు. గ్రామంలోని జనాభా, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్యం, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సంక్షేమం, నీటి వనరులు, పర్యావరణం తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పొందుపరచాలని సూచించారు. "ప్రతి గ్రామానికి ఒక సమగ్ర బుక్‌లెట్ ఉండాలి. ఆ గ్రామంలో ఏముంది, ఏమి అవసరం, ఇప్పటికే ఏ కార్యక్రమాలు అమలవుతున్నాయి, ఇంకా ఏ పనులు చేపట్టాలి అనే పూర్తి సమాచారం అధికారుల చేతిలో ఉండాలి.

అదే గ్రామ అభివృద్ధికి ప్రాథమిక పత్రంగా ఉపయోగపడాలి" అని ఆమె తెలిపారు.2026-27 GPDPలో అన్ని శాఖల కార్యక్రమాలు ప్రతిబింబించాలి

2026-27 సంవత్సరానికి రూపొందించే *గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (GPDP)*లో అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల కార్యక్రమాలు, పథకాలు, నిధులను సమన్వయం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.గ్రామ సభలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రజల అవసరాల ఆధారంగా ప్రాధాన్యతా పనులను గుర్తించి GPDPలో చేర్చాలని సూచించారు. గ్రామ స్థాయి ప్రణాళిక మండల స్థాయి BPDP, జిల్లా స్థాయి DPDPతో అనుసంధానమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. "GPDP కేవలం ఒక పత్రంగా తయారై ఫైల్‌లో ఉండకూడదు. అందులో పేర్కొన్న పనులు భూమిపై కనిపించాలి. ప్రణాళిక నుంచి అమలు వరకు ప్రతి దశలో అధికారులు బాధ్యత వహించాలి" అని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.జలశ్రీ కింద నీటి సంరక్షణకు ప్రాధాన్యత వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, గ్రామాల్లో నీటి లభ్యతను మెరుగుపరచడం కోసం జలశ్రీ కార్యక్రమం కింద ఫార్మ్ పాండ్స్, సోక్ పిట్స్, పెర్కొలేషన్ ట్యాంకులు తదితర నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతిగ్రామంలోనీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా పనులను చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ పథకాలు, నిధులను కన్వర్జెన్స్ విధానంలో వినియోగించాలని అన్నారు. "వర్షపు నీటిలో ఒక్క చుక్క కూడా వృథా కాకుండా సంరక్షించే విధంగా గ్రామస్థాయిలో శాశ్వత నిర్మాణాలను ప్రోత్సహించాలి. నీటి సంరక్షణ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఆస్తులుగా నిలిచేలా ప్రణాళిక రూపొందించాలి" అని అధికారులకు సూచించారు. వనమహోత్సవంలో మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మొక్కలు నాటడం మాత్రమే లక్ష్యంగా కాకుండా, వాటి సంరక్షణకు స్పష్టమైన బాధ్యతను సంబంధిత శాఖలకు అప్పగించాలని సూచించారు. నాటిన మొక్కలకు నీటి సదుపాయం, రక్షణ, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి శాఖ తన పరిధిలో నాటిన మొక్కల వివరాలను నమోదు చేసుకొని, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మురుగు కాలువలు, నీటి నిల్వలు, చెత్త పేరుకుపోయే ప్రాంతాలు, ప్రజా ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచాలని సూచించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు, తాగునీటి వనరుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. "పారిశుధ్యం అనేది కేవలం ఒక రోజు కార్యక్రమం కాకూడదు. గ్రామాల్లో నిరంతర పారిశుధ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామాలను నిర్మించాలి" అని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా సమన్వయంతో పనిచేయాలి

ప్రతి శాఖ తమకు కేటాయించిన కార్యక్రమాలను సమయపాలనతో పూర్తి చేయడంతో పాటు, ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని "కన్వర్జెన్స్ ద్వారా గరిష్ట ఫలితాలు - ప్రజలకు గరిష్ట ప్రయోజనం" అనే లక్ష్యంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి సూచించారు. అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలని, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ZPCEO/DRDO, కృష్ణారెడ్డి, DPO సురేష్ మోహన్, పంచాయతీరాజ్, RWS, R&B, ఇరిగేషన్ శాఖల EEలు, DWO, సంక్షేమ శాఖల అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, DM&HO స్వర్ణకుమారి, MPDOలు, MPOలు, APOలు, APMలు, Dy.EEలు తదితర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## TUWJ (IJU) పటాన్‌చెరు నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్ (రాజు)

**పటాన్‌చెరు ఆగస్టు 11 (ఉదయం ప్రతినిధి) :** TUWJ (IJU) పటాన్‌చెరు నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా ఉదయం రిపోర్టర్ చంద్రశేఖర్ (రాజు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు ఆయనకు అభినందనలు తెలిపారు.సంస్థలో జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమ అంశాలపై పనిచేయడంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని చంద్రశేఖర్ (రాజు) తెలిపారు.తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంస్థ ప్రతినిధులు, జర్నలిస్టులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## స్థానిక సమస్యలపై డిప్యూటీ కమిషనర్ పర్యటన...

- సమస్యల పరిష్కారానికి బిజెపి నాయకుల డిమాండ్



**ప్రగతి నగర్, ఆగష్టు 11, (ఉదయం ప్రతినిధి ),** నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ప్రగతి నగర్ భారతీయ జనతా అధ్యక్షులు నరేంద్ర చౌదరి సూచన మేరకు భాజపా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులతో కలిసి డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీకి తమ ప్రాంతంలో నెలకొన్న వివిధ సమస్యలను ప్రత్యక్షంగా చూపించి వివరించారు. ఈ పర్యటనలో నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు భారతీయ జనతా పార్టీ శ్రేణులు, స్థానిక కాలనీవాసులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను క్షేత్ర స్థాయిలో పర్యటించి, వాటి తీవ్రతను స్పష్టంగా తెలియజేశారు. తాగునీటి సరఫరాలో అంతరాయాలు, మురుగునీటి పారుదల వ్యవస్థలో లోపాలు, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య లోపాలు వంటి అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల తీవ్రతను వాటి వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత కార్పొరేషన్ సిబ్బందిని ఆదేశించారు. ప్రజల సమస్యలను ఆలకించి, వాటి పరిష్కారానికి తక్షణ రక్షణ చర్యలకు ఆదేశించిన డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీకి భారతీయ జనతా పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ప్రగతి నగర్ డివిజన్ కార్యదర్శి వేణుమాధవ్, బీజేవైఎం అధ్యక్షులు దొడ్డ పవన్, సెక్రటరీ రామరాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు తుమాటి శంకర్రావు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సింగప్పగూడెం లో ఘనంగా ఎల్లమ్మ బోనాల పండుగ



**చేవెళ్ల,ఆగస్టు11(ఉదయం)** చేవెళ్ల మండల పరిధిలోని సింగప్పగూడెం గ్రామంలో ఎల్లమ్మ బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఇటికేపల్లి రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.బోనాల పండుగ సందర్భంగా మహిళలు బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు ,మొక్కులు చెల్లించుకుని గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఇటికేపల్లి రవి మాట్లాడుతూ..ఎల్లమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలంతా ఐక్యంగా, నిర్వహించడం జరిగింది అని తెలిపారు.గ్రామంలో ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలనిగ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉంచాలని కోరినట్లు తెలిపారు.

## జీడిమెట్ల ఆర్టీసీ డిపోలో ఘోర ప్రమాదం

హైదరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా : బస్సు బ్రేకులు బాగుచేస్తుండగా ఘటనసంతోష్ కుమార్ అనే మెకానిక్ అక్కడికక్కడే మృతిబస్సును డ్రైవర్ ముందుకు కదపడంతో దుర్ఘటనకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులుహైదరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా జీడిమెట్ల ఆర్టీసీ బస్ డిపోలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు కింద ఉండి మరమ్మతులు చేస్తున్న ఓ ఉద్యోగి, అదే బస్సు చక్రాల కింద నలిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటనతో డిపోలో విషాదఛాయలు అలముకున్నాయి. బస్సును ముందుకు కదిపారు. దీంతో సంతోష్ కుమార్ బస్సు చక్రాల కింద నలిగి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

## ప్రభుత్వ పాఠశాలల నిధుల వినియోగంపై ఆడిట్



**జిన్నారం ఆగష్టు 11 (ఉదయం ప్రతినిధి)** 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ పాఠశాలలు స్కూల్ కాంప్లెక్సు, ఎమ్మార్సీ నిధుల వినియోగంపై మంగళవారం పటాన్చెరువు మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఆడిట్ నిర్వహించారు. జిన్నారం మండలానికి సంబంధించి 48 పాఠశాలల రికార్డులు పత్రాలపై ఆడిటర్ రమేష్ సంపూర్ణంగా పరిశీలించి ఆడిట్ పూర్తి చేశారు. కార్యక్రమంలో మండల ఇంచార్జ్ విద్యాధికారి విజయ్ కుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఆడిటర్లు పాల్గొన్నారు.

## సీసీ నిర్మించారు..క్యూరింగ్ మరిచారు

- పనుల్లో నిర్లక్ష్యం... పట్టించుకోని యంత్రాంగం

**జిన్నారం ఆగష్టు 11 (ఉదయం ప్రతినిధి )** గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ధ్వంసమైన రోడ్డును బాగు చేసేందుకు అధికారులు చేపట్టిన చర్యలు విమర్శల పాలవుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారడంతో రాకపోకలకు వాహనదారులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు ఓవైపున సిసి రోడ్డును నిర్మించారు. నిర్మించిన సిసి రోడ్డుకు క్యూరింగ్ చేసే చర్యలు తీసుకోక



పోవడంతో సిమెంటు తొలగిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వ ధనం బురద పాలు అవుతుందని దీనిపై వెంటనే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు..

## తిరుమలలో భారీ రద్దీ..
## శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు

**తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం నిన్న స్వామివారిని దర్శించుకున్న 81 వేల మంది భక్తులుఒక్కరోజే రూ.5.36 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయంక్యూలైన్లలోని భక్తులకు పాలు, అన్నప్రసాదాల పంపిణీ శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో తిరుగిరులు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోగా, వేలాది మంది భక్తులు వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్నారు.**

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం నిన్న స్వామివారిని దర్శించుకున్న 81 వేల మంది భక్తులుఒక్కరోజే రూ.5.36 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయంక్యూలైన్లలోని భక్తులకు పాలు, అన్నప్రసాదాల పంపిణీశ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో తిరుగిరులు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోగా, వేలాది మంది భక్తులు వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న విపరీతమైన రద్దీ దృష్ట్యా, ఎలాంటి దర్శన టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం లభించడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ యంత్రాంగం నిరంతరాయంగా పాలు, తాగునీరు మరియు అన్నప్రసాదాలను పంపిణీ చేస్తోంది.నిన్న (ఆగస్టు 10న) ఒక్కరోజే 81,064 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 33,136 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. ఇక భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 5.36 కోట్లుగా నమోదైందని టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ అధికంగా ఉన్నందున, దర్శన ప్రక్రియ సజావుగా సాగేందుకు భక్తులందరూ యంత్రాంగానికి సహకరించాలని, ఆలయ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS :: AT HYDERABAD
O.S.NO. 1713 OF 2026
Between :
Smt.Sunanda Nandyala and two others ...Plaintiffs
AND
Mandal Revenue Officer and another ...Defendants
To
All Concerned
Take notice that the above said Plaintiffs for declaration, to declare them as the legal heirs of late Nandyala Lakshmi Reddy, who died on 07-01-2019, on the above-mentioned court and the matter stood posted to 21-08-2026 for objections from anybody. If no objection is received, it will be decided in accordance with law.
(By the order of the Hon'ble V Junior Civil Judge)
Hyderabad
11-07-2026
Sd/-
B.Ravishankar
Advocate
# 305-C, Pancom Business Centre, Ameerpet X Roads
Hyderabad-500 073.
Cell NO.9849131453

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS: AT: SECUNDERABAD
O.S.No. 521 of 2026
Between :
1) Yedla Saraswathi @ Madhusudhan Saraswathi W/o Madhusudhan santhana D/o late Yedla Jayanth Kumar @ Jayanth Kumar Yedla Dharmaraju Aged 42 years, occupation: Private Sector Employee, R/o. Plot No. 12, SURVEY No. 17 TO 23, Krishnapuri, West Marredpally, Secunderabad, Telangana-500026
2) Yedla Shravya @ Shravya Nitta, W/o Anirudh Nitta D/o late Yedla Jayanth kumar @ Jayanth Kumar Yedla Dharmaraju Aged 38 years, occupation: Private Sector Employee, R/o. Plot No. 12, SURVEY No. 17 TO 23, Krishnapuri, West Marredpally, Secunderabad, Telangana-500026. ...Plaintiffs
AND
1. The Tashildar, Secunderabad Mandal, Marredpally, Hyderabad-500016.
2. All concerned. ...Defendants
PUBLIC NOTICE
Please take Notice to all concerned that the above Plaintiffs have filed a O.S.NO. 521 of 2026 to be declared that the Plaintiffs herein are the legal heirs of deceased Yedla Jayanth Kumar @ Jayanth Kumar Yedla Dharmaraju S/o. Late Yedla Dharmaraju Naidu, who died on 13-09-2012 and Yedla Shashikala, W/o. Late Yedla Jayanth Kumar, who died on 24-02-2021 Against the Defendants pending on the File of HON'BLE XI JUNIOR CIVIL JUDGE COURT, CITY CIVIL COURTS: AT SECUNDERABAD. Please take Notice further the above O.S.NO. 521 of 2026 is posted on 1-9-2026 and Defendant No-2 is hereby directed to appear before the HONBLE XI JUNIOR CIVIL JUDGE COURT, CITY CIVIL COURT: AT SECUNDERABAD, either in Person or through advocate failing which the matter will be determined as per Law.
(BY ORDER OF THE COURT)
Sd/-
R.Rama Krishna
Advocate
Secunderabad

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT: RAJENDRANAGAR
O.S.NO. 158 OF 2024
Between :
M/s Canara Bank
Manikonda Branch ...Plaintiff Bank
AND
Ms. Bathini Akshara ...Defendant
To,
1.Smt Bathini Akshara W/o Sri Satish Kumar Aged : 34 years Occ: Business R/o Plot No 50 and 51, Heritage Harmony Alkapur Township, Puppalaguda, Hyderabad-500089
Also at R/o H No 1-74, Mallapur, Thimmapur Mandal, Mallapur, Karimnagar-505469 ...Defendant
Whereas, the Plaintiff Bank has instituted the above suit against the Defendants for recovery of a sum of Rs. 7,33,579/- (Rupees Seven Lakhs Thirty Three Thousand Five Hundred and Seventy Nine Only) together with current and future interest, costs of the suit and other consequential reliefs. And whereas, the Hon'ble Court has been pleased to direct service of summons upon the Defendants by way of paper publication. Accordingly, notice is hereby given to the Defendants that the above suit has been instituted and is pending before the Hon'ble Court. The matter stands posted to 23.09.2026 at 10:30 A.M. Therefore, the Defendants are hereby called upon to appear before the Hon'ble Court either in person or through a duly instructed Pleader/ Advocate on the aforesaid date and time, and show cause as to why the reliefs prayed for in the suit should not be granted. Take notice that in case of the default the suit will be heard and determined ex-parte in your absence.
// BY ORDER OF THE COURT//
Sd/-
M.SRINIVAS
COUNSEL FOR PLAINTIFF
Flat No. 104, First Floor
A Block, Sri Dattasai Commercial Complex
RTC X Roads, Musheerabad
Hyderabad – 500 020

IN THE COURT OF THE HON'BLE V ADDL., JUNIOR CIVIL JUDGE-CUM- V ADDL., METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT, AT: L.B. NAGAR.
O.S.NO. 584 OF 2026
Between :
1. Agnihotram Laxmi Chakravarty, W/o late. Srirama Chakravarthi, Age 79 Years, Occ: Household, R/o Plot No.211, Raghavendra Nagar, Jillelaguda, Saroornagar, Ranga Reddy District, Telangana-500097.
2. Agnihotram Rajagopal, S/o late. Sri Rama Chakravarthi, Age 58 Years, Occ: Business, R/o H.No.9-375, Gayatri Nagar, Jillelaguda, Meerpet, Ranga Reddy District, Telangana -500097
3. Smt. Deevi Rajani, W/o D A Satrughna Kumar, D/o late. Srirama Chakravarthi, Age 56 Years, Occ: Housewife, R/o Plot No.211, Raghavendra Nagar, Jillelaguda, Saroornagar, Ranga Reddy District, Telangana - 500097. ...Plaintiffs
AND
1. Tahsildar - Balapur Mandal, Balaji Nagar, Badangpet, Ranga Reddy District, Telangana -500112.
2. Whom so ever it May All Concerned. ...Defendants
NOTICE
To,
Whom soever it may all concerned, Take notice that above named Plaintiffs Nos. 1 to 3 have filed present Suit for Declaration of Legal Heirs of Late. Agnihotram Sreerama Chakravarthy, S/o A Sreenivasa Charyulu who was passed away on 26.05.2021 vide OS No.584 of 2026 pending on the file of Hon'ble V Additional Junior Civil Judge -cum- V Addl., Metropolitan Magistrate, Ranga Reddy District at: L.B. Nagar in respect Suit Schedule Property.
The said Suit is posted to 01.09.2026 for appearance. If, any person(s) is/are having any claim, interest, right, title or objection/s, whatsoever in respect of Suit Schedule Property are hereby summoned to appear either in person or through an advocate with your defense at 10.30 a.m., on said date i.e. on 01.09.2026 before the Hon'ble V Additional Junior Civil Judge-cum- V Addl., Metropolitan Magistrate, Ranga Reddy District, at: L.B. Nagar, failing which the Suit will be heard and determined ex-parte.
SUIT SCHEDULE PROPERTY
All that the piece and parcel of Land bearing Plot No. 159 Southern Part and 160 Northern Part, in Survey No.151, total admeasuring 175 Sq. Yards., or equivalent to 146.31 Sq. Mtrs., situated at Rest of Area of BADANGPET Village, Balapur Mandal, Ranga Reddy District, District, Under Badangpet Municipality, Registration at Sub- Registrar Office, L,B, Nagar, Ranga Reddy District and bounded by:
North : Plot No.159 Northern Part.
South : Plot No.160 Southern Part,
East: :30' Wide Road.
West: : Plot Nos. 165 and 164.
// BY ORDER OF THE COURT//
Sd/-
LAKSHMI KANTH (TS/4492/1999)
G. SREEVENI
Advocates for the Plaintiffs
502, 5th Floor, Raghava Ratna Towers, # 5-8-354/502, Chirag Ali Lane, Abids,Hyderabad, Telangana-500001.
Mobile: 9391008913.
tlaxmikanth@yahoo.co.in




నా ఓటు కూడా పోయింది

"సర్ తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. చదువంతా ఇక్కడే పూర్తయింది. నటన నేర్చుకుంది కూడా ఇక్కడే. అన్నిటికంటే ముఖ్యంగా.. నేను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను. అయినా నా ఓటును తొలగించారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏ డాక్యుమెంట్లు అడుగుతారో... అయినా నేను అన్నిటికీ సిద్ధంగా ఉన్నాను."

- ప్రకాశ్ రాజ్, ప్రముఖ సినీ నటుడు

## వే'మన' పద్యం

పాల నీడిగింట గ్రోలుచునుండెనా
మనుజులెల్లగూడి మద్యమండ్రు
నిలువ(దగని చోట నిలువ నిందలు వచ్చు
విశ్వదాభిరామ! వినుర వేమ!!



# సంపాదకీయం

## పార్లమెంటు.. ఇలాగైతే ఎలా...?

చట్టాలు చేయాల్సిన పార్లమెంటు...చర్చలకు వేదిక కావాల్సిన సభ...నినాదాలు, నిరసనలు, వాయిదాల మధ్య సాగుతోంది. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బిల్లులు సభ ముందుకొస్తున్నా సరైన చర్చ జరగడం లేదనే విమర్శ వినిపిస్తోంది. బిల్లులపై విపక్షాలు అభ్యంతరాలుంటే ప్రశ్నిస్తాయి. ప్రజలకు నష్టం జరుతుందనుకుంటే సవరించాలని సూచిస్తాయి. ప్రభుత్వం వాటికి సమాధానం చెప్పాలి, అనుమానాల్ని నివృత్తి చేయాలి. ఆ తర్వాతే ఓటింగ్ జరగాలి. కానీ ప్రస్తుత వర్షాకాల సమావేశాల్లో దీనికి భిన్నమైన దృశ్యం కనిపిస్తోంది. సభ్యుల ఆందోళనల మధ్యే కొన్ని బిల్లులు నిమిషాల్లో ఆమోదం పొందడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది.

జూలై ఇరవైన ప్రారంభమైన సమావేశాలు ఆగస్టు పదమూడు వరకు జరగాల్సి ఉండగా, ఇప్పటివరకు సభలు పదేపదే వాయిదా పడుతూ వస్తున్నాయి. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీకి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభలో ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబడు తున్నాయి. అయోధ్య రామమందిర ట్రస్టు విరాళాల వ్యవహారంపై కూడా చర్చ చేపట్టాలని కోరుతున్నాయి. ఆ రెండు అంశాలపై ప్రభుత్వం ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఆగస్టు పదిన ప్రభుత్వం విద్యార్థుల నిరసనలపై పూర్తిస్థాయి చర్చకు సిద్ధమని ప్రకటించినా, అయోధ్య ట్రస్టు అంశంపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ప్రతిష్టంభన తొలగలేదు. ఈ అంశాలపై చర్చ జరగాలన్న డిమాండ్‌కు ప్రజాస్వామ్య ప్రాధా న్యత ఉంది. కానీ, ప్రభుత్వం మందబలంతో ప్రతిపక్షాలను పక్కనపెట్టి శాసన ప్రక్రియను ముగించాలనుకోవడం రాజ్యాంగ విరుద్ధం. ప్రభుత్వం చర్చకు ఎందుకు జంకుతోంది? ప్రధాని, హోంమంత్రి సమావేశాలకు ఎందుకు హాజరు కావడం లేదు? సభ పలుమార్లు ఎందుకు వాయిదా పడుతోంది ఈ ప్రశ్నలన్నింటికి అధికారపక్షం వైఖరినే కారణం. చర్చ జరగకుండా ఉండేందుకే కొన్ని అంశాలను దాటవేస్తోంది. సభ్యులు ప్రశ్నిస్తే సభను వాయిదాలతో ముగిస్తోంది. అందుకు తాజా ఉదా హరణ 'అయోధ్య హుండీ చోరీ'. అక్కడ తప్పు జరగనప్పుడు చర్చించడానికి ఏముంది? అది అలా ఉంచితే, ఈ సమావేశాల్లో లోక్‌సభ, రాజ్య సభలో ఇప్పటివరకు ఆరు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే చర్చ లేకుండా బిల్లులను ఆమోదించుకోవడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఆందోళనకర పరిణామం. జనన, మరణాల నమోదు సవరణ బిల్లుపై లోక్‌సభలో కేవలం నాలుగు నిమిషాలు, రాజ్యసభలో యాభై నిమిషాల చర్చ జరిగింది. ఈ బిల్లు సాధారణ పరిపాలనా మార్పుగా కనిపించినా, పౌరుల జనన, మరణ వివరాల డిజిటల్ నమోదు, వివిధ ప్రభుత్వ డేటా బేస్‌లతో వాటి అనుసంధానం వంటి అంశాలతో ముడిపడి ఉంది. భవిష్యత్తులో పౌరుల వ్యక్తిగత సమాచార భద్రత, డేటా వినియోగం, గోప్యత వంటి ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉన్నందున దీనిపై విస్తృత చర్చ అవసరం. ఎంఎస్‌ఎంఈ బిల్లుపై రెండు సభల్లో కలిపి గంటా ఇరవై రెండు నిమిషాల చర్చ మాత్రమే జరిగింది. ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి సవరణ బిల్లు దేశంలోని కోట్లాది చిన్న, సూక్ష్మ, మధ్యతరహా వ్యాపార సంస్థలతో ముడిపడి ఉంది. ఉపాధి కల్పనలో, ఉత్పత్తిలో, ఎగుమతుల్లో కీలక పాత్ర పోషించే ఈ రంగానికి సంబంధించిన చట్టంలో మార్పులు చేస్తున్నప్పుడు చిన్న పరిశ్రమల వాస్తవ సమస్యలు, బ్యాంకు రుణాలు, బకాయిల చెల్లింపులు, మార్కెట్ అవకాశాలు వంటి అంశాలపై సభ్యులు సమగ్రంగా మాట్లాడాల్సిన అవసరం ఉంది.

మరీ ఆందోళన కలిగించే విషయం బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు. ఆగస్టు ఐదున లోక్‌సభలో ఇది ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. 1891 నాటి చట్టాన్ని మార్చే ఈ బిల్లు డిజిటల్, ఎలక్ట్రానిక్, క్లౌడ్ ఆధారిత బ్యాంకు రికార్డులకు చట్టపరమైన గుర్తింపు కల్పిస్తుంది. ఇంత ప్రాధాన్యమైన మార్పుపై కనీసం సభ్యుల అభిప్రా యాలను నమోదు చేయాల్సిన అవసరం లేదా? ట్యాక్సేషన్ అండ్ అదర్ లాస్ సవరణ బిల్లు విషయంలోనూ ఇదే ప్రశ్న తలెత్తింది. లోక్‌సభలో కేవలం మూడు నిమిషాల్లో అది ఆమోదం పొందింది. ఇదే సమయంలో నిన్న ప్రతిపక్షాలు నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సవరణ బిల్లు, మైన్స్ అండ్ మినరల్స్ సవరణ బిల్లులను స్టాండింగ్ కమిటీలకు పంపాలని డిమాండ్ చేశాయి. వీటిలోని ప్రతి అంశాన్ని ప్రభుత్వం చర్చించాల్సిన అవసరం ఉంది. అందువల్ల అధికార పక్షం సంఖ్యాబలంతో ప్రతిపక్ష స్వరాన్ని మౌనం చేయకూడదు. సభను నడపాల్సిన బాధ్యత స్పీకర్, చైర్మన్‌లపై కూడా ఉంది. ప్రజల డబ్బుతో నడిచే పార్లమెంటులో ప్రతి నిమిషం విలువైనదే. ఆ సమయాన్ని వాయిదాల పర్వానికీ, చర్చలేని ఆమోదాలకు బలిచేయడం తగదు. చట్టాలు చేయడంకంటే ముందు వాటిపై మాట్లాడాలి. సంఖ్యాబలం ఉందనే ధీమాతో చర్చను పక్కనపెట్టి బిల్లులను ఆమోదించుకోవడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ప్రజల తరపున ప్రశ్నలు వినిపించే పార్లమెంటును కేవలం బిల్లులకు ముద్రవేసే వేదికగా మార్చకుండా, చర్చకు సముచిత స్థానం ఇవ్వాల్సిన బాధ్యత అధికార పక్షానిదే.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఇతర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## విశేష ఫల దాయిని చుక్కల అమావాస్య



ఆషాఢమాసంలోని చివరి రోజైన చుక్కల అమావాస్య రోజున పితృదేవతలను తల్చుకున్నా, గౌరీవ్రతం చేసినా, దీపపూజ నిర్వహించినా గొప్ప ఫలితం దక్కుతుందని నమ్మకం. హిందూ పంచాంగంలో జనవరిలో వచ్చే మకర సంక్రాంతికి ఎంత ప్రాముఖ్యత ఉందో, జులై మాసంలో వచ్చే కర్కాటక సంక్రాంతికి కూడా అంతే ప్రాధాన్యత ఉంది. మకర సంక్రాంతి సమయంలో ఉత్తరాయణం మొదలైతే, కర్కాటక సంక్రాంతికి దక్షిణాయనం మొదలవుతుంది. దక్షిణాయన కాలంలో పితృదేవతలు మనకు సమీపంలోనే ఉంటారని నోచుకుంటారు. ఇందుకోసం గౌరీపూజని చేసి, సందెవేళ వరకు నిష్ఠగా ఉపవాసాన్ని ఆచరిస్తారు. అమ్మవారి ముందు నిర్ణీత చుక్కలు పెట్టి వాటి మీద దారపు పోగులను ఉంచుతారు. ఆ దారపు పోగులను ఒక దండగా అల్లి మరునాడు ధరిస్తారు. స్తోమత ఉన్నవారు నోము సందర్భంగా బంగారపు చుక్కలను కూడా దానం చేసేవారట.

అషాఢమాసంతో సూర్యుడు దక్షిణాయనానికి మరలుతాడు. రాత్రివేళలు పెరుగుతాయి, చలి మొదలవుతుంది. చలి, చీకటి అనేవి అజ్ఞానానికి, బద్ధకానికీ, అనారోగ్యానికీ చిహ్నాలు. వాటిని పారద్రోలి వెలుగుని,

చెబుతారు. అందుకనే దక్షిణాయంలో వచ్చే తొలి అమావాస్య రోజున వారికి ఆహ్వానం పలుకుతూ తర్పణాలను విడిస్తే మంచిదని సూచిస్తారు. అదే చుక్కల అమావాస్య. ఇక ఆషాఢ మాసంలో చేసే జప తపాలకు, దాన ధర్మాలకు విశేషమైన ఫలితం లభిస్తుందని పెద్దల మాట. కాబట్టి ఈ రోజున పెద్దలని తల్చుకుంటూ పితృ కర్మలు నిర్వహించినా, వారి పేరున దాన ధర్మాలు చేసినా పెద్దల ఆత్మ శాంతిస్తుందని విశ్వాసం. ఆషాఢ అమావాస్య రోజున గౌరీ పూజ చేయడం కూడా మంచిది. ఆషాఢ అమావాస్య మర్నాటి నుంచి శ్రావణ మాసం మొదలవుతుంది. శ్రావణ మాసం అంటే పెళ్లి ముహూర్తాలు మొదలయ్యే కాలం. కాబట్టి ఈ శ్రావణంలో అయినా మంచి పెళ్లి సంబంధం కుదరాలని కోరుకుంటూ, మాసానికి ముందు రోజున కన్నెపిల్లలు గౌరీదేవిని పూజిస్తారు. ఇందుకోసం పసుపు ముద్దని గౌరీదేవిగా భావించి, ఆమెను కొలుచుకుంటారు. బియ్యపు పిండితో చేసిన కుడుములను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ రోజు గౌరీపూజ చేసుకుని ఆమె రక్షను ధరించిన అవివాహితులకు త్వరలోనే వివాహం జరుగుతుందని నమ్ముతారు. ఈ అమావాస్య రోజున అవివాహితలే కాదు... కొత్త కోడళ్లు, వివాహితులు కూడా 'చుక్కల అమావాస్య' పేరుతో ఒక నోముని వేడిని ఇచ్చేవి దీపాలు. అందుకు సూచనగా దీపపూజని చేస్తారు. లక్ష్మిప్రదమైన శ్రావణ మాస ప్రారంభానికి ముందు వచ్చే అమావాస్య కనుక ఈ రోజు అధికసంఖ్యలో దీపాలను పెట్టి లక్ష్మీదేవిని పూజించడం మంగళ ప్రదమని ధర్మశాస్త్ర వచనం. ఇలా దీప ప్రజ్వలనము చేయడం వలన పితృదేవతలు సంతోషించి వారి ఆశీస్సులు మనకు అందిస్తారని విశ్వాసం. ఆషాడ అమావాస్యను మహారాష్ట్రలో 'గటారి అమావాస్య' అని కూడా అంటారు. రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి భారతదేశ ఉత్తర పరిస్థితులలో హరియాలీ అమావాస్య ఆనందం చాలా గొప్పది. ఇది వివిధ ప్రాంతాలలో ప్రసిద్ధి చెందింది, ఆషాఢ అమావాస్యను కర్ణాటకలో 'భీమన అమావాస్య', ఆంధ్ర ప్రదేశ్‌లో 'చుక్కల అమావాస్య', ఒరిస్సాలో 'చిటలగి అమావాస్య', గుజరాత్ రాష్ట్రంలో 'హరియాలి అమావాస్య'గా కూడా జరుపుకుంటారు. వివాహిత మహిళలు సంతోషకరమైన వైవాహిక జీవితం కోసం గౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. మంచి జీవిత భాగస్వాముల కోసం కొన్ని చోట్ల అవివాహిత మహిళల వ్రతాచరణ ఉంది.

దక్షిణాయనం ఖగోళానికి సంబంధించిన పండుగ కాబట్టి, ఆకాశంలో చుక్కలను సూచిస్తూ ఈ నోము మొదలై ఉండవచ్చని భావిస్తారు. తమ మాంగళ్యం కల'కాలం' ఉండాలన్నదే ముత్తయిదువుల కోరిక.

## ఆమెకి సెలవెప్పుడు?

సూర్యుడి కంటే ముందే మేల్కొని
కళ్లాపితో ఇంటి ముంగిట
ముగ్గుల్ని నింపి,
భూమాతకు చుక్కల చీర కట్టే ఆమెకి
సెలవెప్పుడు..?
నిత్యం అందరికీ సేవలందించే ఆమెకి
సెలవెప్పుడు..?
అందరి ఆకలికి
అన్నపూర్ణ అవుతూ,
అందరి అలసటకు
ఆప్యాయత అవుతూ,
అందరి అవసరాలకు
ఆధారమవుతూ,
తన ఉనికినే మరిచే ఆమెకి
సెలవెప్పుడు..?
ఎవరికైనా జ్వరమొస్తే
నుదుటిపై చేయివేసి
జ్వరాన్ని మరిచిపోయేలా చేసే
వైద్యురాలు ఆమె...
ఎవరికైనా కన్నీళ్లు వస్తే
కళ్లలోని తడిని తుడిచే
ఓదార్పు ఆమె...
ఎవరికైనా ఆకలేస్తే
కడుపు నింపే
అమ్మ ఆమె...
మరి...
ఆమెకి జ్వరం వస్తే..?
ఆమె కళ్లలోనే కన్నీరు చేరితే..?
ఆమెకే ఆకలి వేస్తే..?
అయినా...
తన బాధను మడత పెట్టి,
తన అలసటను దాచుకుని,
మళ్లీ ఇంటి పనిలోకి నడిచే ఆమెకి
సెలవెప్పుడు..?
ఉదయం నుంచి రాత్రి వరకు
ఆమె అడుగులే ఇంటి గడియారం...
ఆమె చేతులే ఇంటి చలనం...
ఆమె నవ్వే ఇంటి వెలుగు...
అయినా చివరికి
అన్నీ చేసిన ఆమెనే అడుగుతాం..
"నువ్వేం చేశావు?"
ఆ ఒక్క ప్రశ్నకే
ఆమె జీవితమంతా
నిశ్శబ్దంగా కన్నీటిగా మారుతుంది...
అందరికీ సెలవులుంటాయి...
పండుగలుంటాయి...
విశ్రాంతి రోజులుంటాయి...
కానీ
ఇంటిని నడిపించే ఆమెకి
సెలవెప్పుడు..?

రామిశెట్టి కావ్య

# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి



భారత దేశంలో అకడమిక్ లైబ్రరీలతోపాటు, పబ్లిక్ లైబ్రరీలలో అభివృద్ధికి, గ్రంథాలయ వ్యవస్థ వికాసానికి విశేషంగా కృషి చేసిన ఎస్.ఆర్ రంగనాథన్ పుట్టినరోజైన ఆగస్టు 12న జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా ప్రకటించి దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు.

లెక్కల ప్రొఫెసరైన డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ 1923లో మద్రాసు యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా చేరాడు. తనకు దొరికిన ఈ అవకాశాన్ని అనుకూలంగా మలుచుకొని గ్రంథాలయ వ్యవస్థకు సంబంధించిన ప్రపంచవ్యాప్త ధోరణులను పరిశీలించి, 1924లో క్లాసిఫికేషన్, 1933లో గ్రంథాలయ కేటలాగుల్ని తయారు చేయడానికి ఒక కొత్త కోడ్‌ను రూపొందించాడు. కోలన్ క్లాసిఫికేషన్ అని పిలిచే ఈ వర్గీకరణ పద్ధతిని దేశంలోని అనేక గ్రంథాలయాలు అనుసరిస్తున్నాయి. పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, పెంపొందించడం, పిల్లలతో బాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యం వైపు ఆకర్షించడం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.

చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారు మ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం.

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలం లోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణం గానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నా ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది.

అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.




రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# కరెన్సీకి ప్లాస్టిక్ ముసుగు.. అసలు కథ ఏంటి?




డబ్బు కేవలం కాగితం కాదు.. అది ప్రజల నమ్మకానికి ప్రతీక. చేతిలోని రూ.10 నోటు టీ దుకాణం నుంచి కిరాణా షాపు వరకు, కూలీ నుంచి చిన్న వ్యాపారి వరకు ఎన్నో చేతులు మారుతుంది. అందుకే కరెన్సీలో మార్పును కేవలం ముద్రణా సాంకేతికతగా చూడలేం. అది సామాన్యుడి ఆర్థిక జీవితాన్ని తాకే పరిణామం. ఒకప్పుడు వస్తు మార్పిడి. ఆ తర్వాత మెసపటోమియా నాగరికతలో లావాదేవీల లెక్కల కోసం మట్టి టోకెన్లు. అనంతరం బంగారం, వెండి, రాగి నాణేలు.. ఆపై కాగితపు నోట్లు. ఇప్పుడు పాలిమర్ కరెన్సీ. వేల ఏళ్ల డబ్బు ప్రయాణంలో ఇది మరో కీలక మలుపు. ఇది ఇక ఊహల దశలో లేదు. పాలిమర్ కరెన్సీపై ప్రయోగానికి ఆమోదం లభించింది. తొలి దశలో రూ.10, రూ.20 నోట్లతో ఫీల్డ్ ట్రయల్స్ చేపట్టనున్నారు. ఒక్కో విలువకు 100 కోట్ల చొప్పున మొత్తం 200 కోట్ల నోట్లు ప్రయోగంలోకి రానున్నాయి. వాటి మొత్తం విలువ సుమారు రూ.3,000 కోట్లు. పాలిమర్ సబ్‌స్ట్రేట్ తయారీ, సరఫరా కోసం ప్రపంచ తయారీ సంస్థల నుంచి గ్లోబల్ ఈఓఐ ఆహ్వానించడం ఈ ప్రయోగం ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.



అయితే అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. నోటు మార్చడమే లక్ష్యమా.. లేక కరెన్సీ నిర్వహణను మార్చడమే అసలు ఉద్దేశమా?

రూ.10, రూ.20 నోట్లు అత్యధికంగా చేతులు మారే చిన్న విలువ కరెన్సీలో కీలకమైనవి. టీ దుకాణాలు, బస్సులు, కిరాణా వ్యాపారాలు, గ్రామీణ మార్కెట్లలో నిరంతరం చలామణిలో ఉంటాయి. అందుకే త్వరగా మాసిపోవడం, చిరగడం జరుగుతుంది. ఎక్కువకాలం మన్నే పాలిమర్ నోట్లు వస్తే తరచూ కొత్త నోట్లు ముద్రించాల్సిన అవసరం తగ్గవచ్చు. దీర్ఘకాలంలో ప్రభుత్వ వ్యయభారం కూడా తగ్గే అవకాశం ఉంది.

భద్రత మరో ముఖ్యమైన కోణం. పారదర్శక భద్రతా విండోలు, సూక్ష్మ గుర్తులు, ప్రత్యేక భద్రతా లక్షణాలు నకిలీ నోట్ల తయారీని కష్టతరం చేయవచ్చు. కానీ సాంకేతికత ఒక్కటే నకిలీ కరెన్సీని అంతం చేయదు. సమర్థమైన బ్యాంకింగ్ వ్యవస్థ, నిఘా, ప్రజల అవగాహన కూడా అవసరం.

పర్యావరణ ప్రశ్నను కూడా పక్కన పెట్టలేం. పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నినా, వాటి జీవితాంతం తర్వాత సేకరణ, పునర్వినియోగం ఎలా? తయారీ నుంచి రీసైక్లింగ్ వరకు మొత్తం పర్యావరణ ప్రభావం ఎంత? మన్నిక ఒక్కటే విజయానికి కొలమానం కాకూడదు.

డిజిటల్ చెల్లింపులు, యూపీఐ విస్తరిస్తున్నా భారతదేశంలో నగదుకు ఇంకా ప్రత్యేక స్థానం ఉంది. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాలు, రోజువారీ కూలీ వర్గాల్లో చేతి నగదు కీలకం. అందువల్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పెరుగుతున్నా భౌతిక కరెన్సీని ఒక్కసారిగా పక్కన పెట్టలేం.

పాలిమర్ నోట్లు వస్తున్నాయంటే ప్రస్తుత కాగితపు నోట్లు రద్దవుతాయని కాదు. ప్రస్తుతం కాగితపు కరెన్సీని పూర్తిగా పాలిమర్‌తో భర్తీ చేసే ప్రతిపాదన లేదనే స్పష్టత ఉంది. ముందుగా ప్రయోగం.. ఆ తర్వాత ఫలితాల ఆధారంగా నిర్ణయం. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతే 2027-28 ఆర్థిక సంవత్సరం

**పర్యావరణ ప్రశ్నను కూడా పక్కన పెట్టలేం. పాలిమర్ నోట్లు ఎక్కువకాలం మన్నినా, వాటి జీవితాంతం తర్వాత సేకరణ, పునర్వినియోగం ఎలా? తయారీ నుంచి రీసైక్లింగ్ వరకు మొత్తం పర్యావరణ ప్రభావం ఎంత? మన్నిక ఒక్కటే విజయానికి కొలమానం కాకూడదు.**

ప్రారంభంలో పాలిమర్ నోట్లు చలామణిలోకి వచ్చే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్, సింగపూర్ వంటి దేశాలు పాలిమర్ కరెన్సీని ఉపయోగిస్తున్నాయి. వారి అనుభవం భారత్‌కు ఉపయోగపడొచ్చు. కానీ మన జనాభా, వాతావరణం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, నోట్ల లెక్కింపు యంత్రాల అనుకూలత, దృష్టి లోపం ఉన్నవారికి గుర్తించే సౌలభ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.



సోషల్ మీడియాలో గాంధీజీ చిత్రం తొలగుతుందని, అన్ని నోట్లు పాలిమర్‌గా మారతాయని, పాత నోట్లు రద్దవుతాయని వచ్చే ప్రచారాలను నమ్మకూడదు. కరెన్సీ విషయంలో అధికారిక ప్రకటనకే ప్రామాణికత. ఇక్కడ ప్రభుత్వ పారదర్శకత కూడా కీలకం. ఎన్ని నోట్లు ముద్రిస్తారు, ఎక్కడ ప్రయోగిస్తారు, పరీక్షలు ఎంతకాలం సాగుతాయి, ఫలితాలను ఎలా అంచనా వేస్తారు వంటి అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. లేకపోతే చిన్న మార్పే పెద్ద అపోహలకు దారితీస్తుంది. కరెన్సీ విషయంలో ప్రజల విశ్వాసాన్ని కాపాడటం కూడా ఆర్థిక నిర్వహణలో భాగమే.

మరోవైపు పాలిమర్ నోట్ల తయారీ వ్యయం, సరఫరా వ్యవస్థ, పాత నోట్ల ఉపసంహరణ, రీసైక్లింగ్ ప్రక్రియలపై కూడా ముందస్తు ప్రణాళిక అవసరం. చిన్న నోట్లే ఎక్కువగా చేతులు మారుతున్నందున వాటి నాణ్యత ప్రజల అనుభవాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది. కొత్త నోటు తడిసినా, మురికైనా, మడిచినా గుర్తింపు సులభంగా ఉండాలి. దుకాణదారుడు, బ్యాంకు సిబ్బంది, యంత్రాలు ఒకే విధంగా స్వీకరించగలగాలి. అప్పుడే మన్నిక అనే ప్రయోజనం సామాన్యుడికి నిజమైన సౌకర్యంగా మారుతుంది. లేకపోతే మెరుగైన సాంకేతికత కూడా మరో నిర్వహణ సమస్యగా మారే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రయోగం వేగం కంటే, దాని ఫలితాలపై శాస్త్రీయ మూల్యాంకనం, ప్రజల అనుభవం, నిపుణుల సూచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సరైన మార్గం. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతేనే తదుపరి విలువల నోట్లపై ఆలోచన జరగాలి. ప్రయోగం విఫలమైతే వెనక్కి తగ్గే ధైర్యం కూడా వ్యవస్థకు ఉండాలి. ఎందుకంటే ప్రజాధనం, ప్రజా విశ్వాసం రెండూ ప్రయోగాల కంటే విలువైనవి.

మట్టి టోకెన్ల నుంచి లోహపు నాణేలకు.. కాగితం నుంచి పాలిమర్‌కు.. మరోవైపు డిజిటల్ రూపానికి డబ్బు ప్రయాణిస్తోంది. రూపం మారడం సహజం. కానీ ప్రజల విశ్వాసం మాత్రం మారకూడదు.

అందుకే పాలిమర్ నోట్ల విజయాన్ని అవి ఎంతకాలం మన్నాయన్న దానితో మాత్రమే కొలవకూడదు. భద్రత, మన్నిక, ఖర్చు, పర్యావరణ బాధ్యత, అందుబాటు, పారదర్శకత——ఈ ఆరు ప్రమాణాలపై కొలవాలి.

చివరికి ఇది కాగితాన్ని ప్లాస్టిక్‌తో మార్చే కథ కాదు. భారతీయ కరెన్సీ భవిష్యత్తు ఎలా ఉండాలి? అన్న పెద్ద ప్రశ్నకు మొదలైన ప్రయోగం. నోటు ఏ పదార్థంతో తయారైనా.. దాని వెనుక ఉన్న అసలు విలువ మాత్రం ప్రజల నమ్మకం. ఆ నమ్మకాన్ని కాపాడితేనే పాలిమర్ నోట్ల మార్పు నిజమైన ఆర్థిక పురోగతిగా నిలుస్తుంది.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
జగిత్యాల
9133947176

# జాతీయం-అంతర్జాతీయం

## పంద్రాగస్టు వేళ.. ఉగ్రముప్పు..

- నిఘా వర్గాల హెచ్చరిక
- హైఅలర్ట్ ప్రకటించిన కేంద్రం



**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఎ.ఎం.ఎస్) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడవచ్చన్న సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేస్తూ కీలక చర్యలు చేపట్టింది.

ఆగస్టు 15న ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో భద్రతా బలగాల దృష్టి వేడుకలపై కేంద్రీకృతమై ఉంటుందని, ఇదే అదనుగా దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ భావిస్తున్నట్లు 'ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఐబీ) అధికారి ఒకరు తెలిపారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే), బలూచిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఐఎస్ఐ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను చొరబడేలా చేయడం, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా పంపడం వంటి ప్రయత్నాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా, భద్రత తక్కువగా ఉండే టైర్ 2 నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉంది. కొన్నిసార్లు భద్రతా ఏజెన్సీల దృష్టిని పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ లేదా కశ్మీర్‌లో దాడులంటూ తప్పుడు సమాచారం సృష్టించి, మరోచోట దాడికి దిగే వ్యూహం కూడా ఐఎస్ఐ అనుసరించవచ్చని ఓ అధికారి వివరించారు.

ఈ హెచ్చరికల నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) 'ఆపరేషన్ అలర్ట్'ను ప్రారంభించింది. ఆగస్టు 10 నుంచి 17 వరకు కొనసాగే ఈ ఆపరేషన్‌లో భాగంగా బీఎస్ఎఫ్ సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తూ, నిఘా మరియు పెట్రోలింగ్‌ను గణనీయంగా పెంచారు. మరోవైపు, బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రతను పటిష్టం చేసేందుకు పశ్చిమ బెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో సుమారు 40 'సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఎస్ఐబీ) యూనిట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సరిహద్దు అత్యంత సున్నితమైనది కావడంతో శాశ్వత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి చొరబాట్లు, స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అడ్డుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.



## సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు మరణశిక్ష

- ఆయన సోదరుడికి కూడా
- ఉన్నత న్యాయ స్థానం తీర్పు

**డమాస్కస్, ఆగస్టు 11:** సిరియా దేశంలో 14 ఏళ్లుగా కొనసాగిన అంతర్యుద్ధానికి సంబంధించిన కేసులో మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్, ఆయన సోదరుడు మహేర్ అసద్‌కు సిరియా కోర్టు గైర్హాజరీలో మరణశిక్ష విధించింది. ఇదే కేసులో అసద్ బంధువు అతేఫ్ నజీబ్‌కు కూడా మరణశిక్ష విధించారు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు, యుద్ధ నేరాలకు పాల్పడ్డారని నిర్ధారణ కావడంతో ఆ దేశ ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. తీర్పు వెలువడే సమయంలో కోర్టు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.2014 డిసెంబర్‌లో తిరుగుబాటుదారులు డమాస్కస్‌లోకి ప్రవేశించిన తర్వాత బషర్ అసద్, ఆయన సోదరుడు మహేర్ రష్యాకు పారిపోయారు. ఆ తర్వాత అతేఫ్ నజీబ్‌ను అరెస్టు చేశారు. అనంతరం ఆయనపై విచారణ చేపట్టారు. అసద్ ప్రభుత్వంలో విచారణకు గురైన అత్యున్నత స్థాయి అధికారుల్లో నజీబ్ ఒకరిగా ఉన్నారు.నజీబ్ సిరియా సైన్యంలో మాజీ బ్రిగేడియర్ జనరల్. 2011లో బషర్ అసద్ పాలనలో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి ఆయన అధిపతిగా పని చేశారు. అక్కడ తిరుగుబాటును అణచివేసిన చర్యల్లో ఆయన కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## లక్షా 75 వేలకు పైగా వీసాల రద్దు

- అమెరికా ప్రభుత్వం సంచలన నిర్ణయం
- ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడి
- నేరపూరిత కార్యకలాపాలే కారణమంటూ వివరణ
- సొంత పౌరుల రక్షణకు కఠిన చర్యలు తప్పవంటూ వ్యాఖ్య




**వాషింగ్టన్, ఆగస్టు 11 :** అమెరికా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. జాతీయ భద్రత, చట్టాల ఉల్లంఘన వంటి కారణాలతో విదేశీయులకు జారీ చేసిన సుమారు 1,75,000కు పైగా వీసాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన నిరంతర సమీక్ష ప్రక్రియలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ సోమవారం విడుదల చేసిన 'ఫ్యాక్ట్ షీట్'లో వెల్లడించింది. నేరపూరిత కార్యకలాపాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనల ఉల్లంఘన, మోసపూరిత వ్యవహారాలు, జాతీయ భద్రతకు విఘాతం కలిగించడం, అమెరికన్లపై హింసకు ప్రేరేపించడం వంటి కారణాలతో ఈ వీసాలను రద్దు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. దర్యాప్తు సంస్థలు అందించిన సమాచారం ప్రాతిపదికన అత్యధిక వీసాల రద్దు ప్రక్రియ చోటుచేసుకుంది. వీటిలో ప్రధానంగా డ్రైవింగ్ అండర్ ఇన్ఫ్లుయెన్స్, దాడులు, చోరీలు, మాదక ద్రవ్యాల విక్రయాలు వంటి నేరాలు ఉన్నాయి.

ఈ ఫ్యాక్ట్ షీట్‌లో మరికొన్ని తీవ్రమైన కేసులను సైతం ప్రస్తావించారు. అత్యాచారం, కిడ్నాపింగ్, మానవ అక్రమ రవాణా, చిన్నారులపై లైంగిక వేధింపులు వంటి తీవ్ర నేరాలకు పాల్పడిన వారి వీసాలను తక్షణమే రద్దు చేశారు. అలాగే కేవలం తమ సంతానానికి అమెరికా పౌరసత్వం లభించేలా చూసేందుకు వచ్చే 'బర్త్ టూరిజం' బాధితుల వీసాలను కూడా రద్దు చేశారు. విదేశాంగ విధానాల దృష్ట్యా క్యూబా, ఇరాన్, లావోస్, కువైట్‌కు చెందిన పలువురి వీసాలను రద్దు చేసినట్లు విదేశాంగ మంత్రి మార్కో రూబియో వివరించారు.

"అమెరికా వీసా అనేది హక్కు కాదు, అది కేవలం ఒక విశేష అవకాశం మాత్రమే" అని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను దుర్వినియోగం చేసే వారి నుంచి అమెరికా సమాజానికి రక్షణ కల్పించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వీసా కేవలం అమెరికా భూభాగంలోకి ప్రవేశించేందుకు ఇచ్చే అనుమతి పత్రం మాత్రమేనని, దేశంలోకి అనుమతించాలా లేదా అనే తుది నిర్ణయం ఇమ్మిగ్రేషన్ అధికారులకే ఉంటుందని స్పష్టం చేసింది.

## నీట్ పరీక్షకు మేం వ్యతిరేకం



- తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం
- బీజేపీ ఎమ్మెల్యే వాకౌట్

**చెన్నై, ఆగస్టు 11 (ఎ.ఎం.ఎస్):** తమిళనాడు అసెంబ్లీ నీట్ పరీక్షకు వ్యతిరేకంగా ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. నీట్ పరీక్ష సామాజిక న్యాయానికి, సమానత్వానికి, రాష్ట్రాల హక్కులకు విరుద్ధమని పేర్కొంటూ, జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)ను రద్దు చేయాలని కోరుతూ తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి కె. అరుణ్‌రాజ్ శాసనసభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి డీఎంకే, ఏఐఏడీఎంకే, కాంగ్రెస్, పీఎంకే, డీఎండీకే, వామపక్షాలు, ఇతర చిన్న పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ చర్యను వ్యతిరేకిస్తూ బీజేపీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే వాకౌట్ చేశారు.

"నీట్ సామాజిక న్యాయానికి, సమానత్వానికి, రాష్ట్రాల హక్కులకు వ్యతిరేకం" అని అసెంబ్లీలో అరుణ్‌రాజ్ అన్నారు.అదే విధంగా ఇటీవల కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు 2026ను వ్యతిరేకిస్తూ తమిళనాడు శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ప్రతిపాదిత చట్టాన్ని ప్రస్తుత రూపంలో ఉపసంహరించుకోవాలని మంత్రి రాజ్‌మోహన్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అసెంబ్లీలో మాట్లాడుతూ, అంతర్జాతీయ సహాయాన్ని నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టిందని, అయితే దీనిలోని నిబంధనలు మైనారిటీ సంస్థలు నడుపుతున్న విద్యాసంస్థలు, ఇతర స్వచ్ఛంద సంస్థలపై ప్రతికూల ప్రభావం చూపనుందని రాజ్‌మోహన్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టంకు ప్రతిపాదిత సవరణల వల్ల, విదేశీ విరాళాలు అందుకుంటున్న విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వృద్ధుల సంరక్షణ గృహాలు, ఇతర సంస్థలపై ప్రభావం చూపనుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## స్తంభించిన రవాణా...రద్దయిన విమానాలు

- 10 లక్షల మందిని ఖాళీ చేయించిన అధికారులు
- చైనాలో డాల్ఫిన్ తుపాను విలయం





**బీజింగ్, ఆగస్టు 11 :** ఆర్థిక రాజధాని షాంఘై సహా తూర్పు చైనాలో ఈదురుగాలులు, భారీ వర్షాలతో బీభత్సం సృష్టించిన డాల్ఫిన్ తుపాను జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. పది లక్షల మందికి పైగా ప్రజలను అధికారులు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుపాను కారణంగా రవాణా సౌకర్యాలు స్తంభించిపోయాయి. షాంఘైలో ఒక్క సోమవారం నాడే సుమారు వెయ్యి విమానాలు రద్దయ్యాయి. తుపాను ఉత్తర దిశగా కదులుతున్నందున బుధవారం వరకూ కుండపోత వర్షాలు కురుస్తాయని, వరదలు సంభవిస్తాయని, కొండచరియలు విరిగిపడతాయని అధికారులు హెచ్చరించారు. ఈ ఏడాది చైనాను తాకిన అతి బలమైన డాల్ఫిన్ తుపానును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ముందుగానే అత్యున్నత స్థాయి రెడ్ అలర్ట్ జారీ చేసింది. జెజియాంగ్ రాష్ట్రంలోని యుహువాన్‌ను ఆదివారం తుపాను తాకినప్పుడు గరిష్టంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఆ తర్వాత వెన్‌ఝౌ నగరంలో తుపాను రెండోసారి తీరాన్ని తాకింది.

షాన్డాంగ్, హెనాన్, హుబే, అన్హుయ్, జియంగ్సూ, జెజియాంగ్ రాష్ట్రాలలో, షాంఘై నగరంలో సోమవారం భారీ వర్షాలు పడ్డాయి. తుపాను కారణంగా అనేక పర్యాటక ప్రాంతాలను అధికారులు మూసివేశారు. కొన్ని ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలలో పార్కింగ్ ఫీజును రద్దు చేశారు. అత్యవసర ఆవాసాలను ఏర్పాటు చేశారు. ఫుజియన్ రాష్ట్రంలో పడవ ప్రయాణాలను నిలిపివేశారు. వందకు పైగా ఆఫ్‌షోర్ నిర్మాణ ప్రాజెక్టులను ఆపేశారు. తీరాన్ని తాకడానికి ముందు తుపాను ఆరు వేల కిలోమీటర్ల దూరానికి పైగా ప్రయాణించింది. కాగా తుపాను ప్రభావంతో ఫిలిప్పీన్స్‌లో, తైవాన్ ఉత్తర ప్రాంతంలో, జపాన్‌లోని ఒకినావా దీవిలో వర్షాలు పడ్డాయి. డాల్ఫిన్స్ తుపాను కారణంగా ఫిలిప్పీన్స్‌లో కురిసిన భారీ వర్షాలకు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు.



## రాష్ట్రంలో డ్రగ్స్ అనేదే ఉండొద్దు..

- తమిళనాడు సీఎం విజయ్ పిలుపు

చెన్నై, ఆగస్టు 11 (ఎ.ఎం.ఎస్): తమిళనాడును డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు సీఎం విజయ్ పిలుపునిచ్చారు. మంగళవారం 'డ్రగ్ ఫ్రీ తమిళనాడు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. చెన్నైలో విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. సమాజం నుంచి డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సీఎం విజయ్ ప్రజలకు పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని సూచించారు.

## నేతాజీ అస్థికలపై కేంద్రానికి సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఎ.ఎం.ఎస్) :** నేతాజీ సుభాష్ చంద్రబోస్ అస్థికలను జపాన్‌లోని రెంకోజీ ఆలయం నుండి భారతదేశానికి తరలించే విషయంపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. నేతాజీ కుమార్తె అనితా బోస్ ఫ్లాఫ్ తన తండ్రి అస్థికలను మాతృభూమికి తీసుకురావాలని, గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించే అవకాశం కల్పించాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు, కేంద్ర ప్రభుత్వ స్పందన కోరింది. నేతాజీ మరణం ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది, వివిధ కమిషన్లు వేర్వేరు నిర్ధారణలకు వచ్చాయి.



## అక్కడా.. ఇక్కడా ఒక్కటే తీరు

- జార్ఖండ్ ఘటనపై అభిజిత్ దీప్కే
- విద్యార్థులపై లాఠీఛార్జికి ఖండన

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఎ.ఎం.ఎస్) : కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కే జార్ఖండ్ విద్యార్థులపై లాఠీచార్జ్ సంఘటనను తీవ్రంగా ఖండించారు. పోటీ పరీక్షల ప్రశ్నపత్రం లీక్ లను వ్యతిరేకిస్తూ రాంచీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై టీయర్ గ్యాస్, లాఠీచార్జ్ ఎందుకు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

రాజకీయేతర నిరసనలపై ఈ తరహా పద్ధతులు అనుసరించడమేంటని మండిపడ్డారు."నిన్న జార్ఖండ్‌లో జరిగిన ఘటన చాలా దురదృష్టకరం. 20వ తేదీన జంతర్ మంతర్ వద్ద మనం చూసిన దృశ్యాలే జార్ఖండ్‌లోనూ కనిపించాయి, అక్కడ విద్యార్థులపై బాష్పవాయువును ప్రయోగించారు. లాఠీలతో విచక్షణారహితంగా దాడి చేశారు.
రాజకీయ పార్టీలు నిరసనలు చేపట్టినప్పుడు లాఠీచార్జీలు లేదా బాష్పవాయువు ప్రయోగం వంటి చర్యలు ఎందుకు చేపట్టరో నాకు అర్థం కావడం లేదు
. కేవలం విద్యార్థులపైనే బాష్పవాయువును, లాఠీలతో ఎందుకు దాడి చేస్తున్నారు?" అని దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు.

## సోషల్ మీడియాపై అమెరికా నిఘా

- అంతర్జాతీయ పాత్రికేయులకు అడ్డంకి
- రాయిటర్స్ వార్తా సంస్థ ఆందోళన



వాషింగ్టన్, ఆగస్టు 11 : వీసాల కోసం దరఖాస్తు చేసుకునే విదేశీ జర్నలిస్టుల సోషల్ మీడియా ఖాతాలపై నిఘా వేసి ఉంచాలని అమెరికా విదేశాంగ శాఖ యోచిస్తోంది. ఇమ్మిగ్రేషన్, వీసా నిబంధనలను మరింత కఠినతరం చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఇది కూడా ఓ భాగమే. దేశంలో ప్రవేశించాలని కోరుకునే అంతర్జాతీయ పాత్రికేయులకు ఇది మరో అడ్డంకి కాబోతోంది. పలు వీసా కేటగిరీల కింద దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించేందుకు ఇప్పటికే ఓ కార్యక్రమం అమలులో ఉంది. విదేశీ మీడియా ప్రతినిధులను కూడా చేర్చి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం విస్తరిస్తోందని రాయిటర్స్ వార్తా సంస్థ తెలియజేసింది. కెనడా, మెక్సికో ఉద్యోగులు ఉపయోగిస్తున్న మరో వీసా కేటగిరీ దరఖాస్తుదారులకు కూడా ఈ కార్యక్రమం వర్తిస్తుంది. ఈ ప్రక్రియను విదేశాంగ శాఖ 'ఆన్‌లైన్ ఉనికి పరిశీలన'గా చెబుతోంది. ప్రవేశం కోరుతున్న విదేశీయులు అమెరికా వీసా అవసరాలను నెరవేరుస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించడమే దీని ఉద్దేశమని వాదించింది. ప్రవేశాలకు సంబంధించిన అమెరికా చట్టాలు, షరతులకు దరఖాస్తుదారులు కట్టుబడి ఉన్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకునేందుకు సాధ్యమైనంత గరిష్ట స్థాయిలో విదేశీయులను అధికారులు తనిఖీ చేస్తారని విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. అమెరికా భద్రత, ప్రజల రక్షణ, దేశ ప్రయోజనాలకు ముప్పు కలిగించే వారిని గుర్తించడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని విదేశాంగ శాఖ తెలిపింది.

## గంగూలీ దంపతులకు బెదిరింపులు



- పోలీసులను ఆశ్రయించిన కుటుంబ సభ్యులు
- దర్యాప్తు ప్రారంభం

**కలకత్తా, ఆగస్టు 11 (ఎ.ఎం.ఎస్) :** భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ, ఆయన సతీమణి డోనా గంగూలీని చంపేస్తామంటూ బెదిరింపు లేఖలు రావడం కలకలం రేపింది. ఆరు నెలలుగా ఇలాంటి లేఖలు వస్తున్నాయని గంగూలీ కుటుంబసభ్యులు తెలిపారు. ఎవరో ఆకతాయిలు ఇలా చేస్తున్నారని వారు మొదట్లో పెద్దగా పట్టించుకోలేదు. కానీ బెదిరింపు లేఖలు పదే పదే వస్తుండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఇటీవల వచ్చిన లేఖలో గంగూలీ, ఆయన భార్యతోపాటు వారి సన్నిహితులకు హాని చేస్తామని బెదిరించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ బెదిరింపులపై వెంటనే చర్యలు తీసుకోవాలని..

తమకు భద్రత కల్పించాలని గంగూలీ కుటుంబసభ్యులు కోరారు. ఆ బెదిరింపు లేఖలను కొరియర్ ద్వారా పంపినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. లేఖలో లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గంగూలీ, ఆయన కుటుంబ సభ్యులకు భద్రత కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

## హసీనాను మాకు అప్పగించండి



*భారత్‌ను మరోసారి కోరిన బంగ్లాదేశ్

**ఢాకా, ఆగస్టు 11 :** మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాల్సిందిగా బంగ్లాదేశ్ మరోసారి భారత్‌ను కోరింది. భారత హై కమిషనర్ దినేష్ త్రివేదీ సోమవారం ఢాకాలో బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహ్మాన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హసీనాను అప్పగించాల్సిందిగా భారత్‌కు బంగ్లాదేశ్ విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో అనేక ముఖ్యమైన ద్వైపాక్షిక అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయని బంగ్లాదేశ్ ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది. కాగా ప్రధాని నరేంద్ర మోడీ పంపిన అభినందన సందేశాన్ని త్రివేది అందజేశారని, బంగ్లాదేశ్ ప్రధానితో, ప్రజలతో సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంలో పనిచేయాలని మోడీ ఆకాంక్షించారని భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో వివరించింది.

## కాంగోలో ఎబోలా వైరస్

- 2 వేల మందికిపైగా మరణం



**బ్రజావిల్లీ, ఆగస్టు 11 :** కాంగోలో ఎబోలా వైరస్ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఈ వైరస్ బారిన పడి ఇప్పటివరకు 2,000 మందికి పైగా మరణించారు. మంగళవారం నాటికి వెల్లడైన గణాంకాల ప్రకారం.. ఈ వైరస్ వ్యాప్తితో మొత్తం 4,381 నిర్ధారిత కేసులు నమోదయ్యాయి. ఇందులో 2,011 మరణాలు ఉన్నాయి. ప్రస్తుతం మొత్తం 704 మంది రోగులు ఆసుపత్రిలో చేరి, ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.
జంతువులు,
గబ్బిలాల (బుష్మీట్) ద్వారా మనుషులకు వ్యాపించే ఈ వైరస్ నివారణకు ప్రస్తుతం టీకాగాని, చికిత్సగాని లేదు.

## ఇక నుంచి కేరళ పేరు కేరళం...

- పేరు మార్పు బిల్లుకు లోక్‌సభ ఆమోదం




**కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో**

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 :** కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. అయితే, బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీస్ చర్యలకు గాను పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## రాజ్యాంగ హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి!- పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత



**హనుమకొండ, ఆగస్టు 11 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (KDC)లో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన 'సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్' (CBC) వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' రెండు రోజుల ఔట్రీచ్ ప్రోగ్రామ్, ఫోటో ఎగ్జిబిషన్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఆమె ప్రారంభించారు. "హక్కుల కోసం పోరాడడం నాణేనికి ఒకవైపు అయితే, పౌరులుగా మన బాధ్యతలను నెరవేర్చడం రెండో వైపు. దేశ అభివృద్ధి, భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల స్మరణ: జాతీయ పతాక ప్రస్థానం, త్యాగాల గొప్పతనాన్ని తెలియజేసే ఫోటో ఎగ్జిబిషన్‌ను CBC ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా వారికి వివరించారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ .. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం, గొప్ప రాజ్యాంగాన్ని పొందడం మన అదృష్టమని కలెక్టర్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు CP, కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు, కళా బృందాలు ప్రదర్శించిన 'యక్షగానం' విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ రజనీ లత, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జ్ సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పింఛన్ల మంజూరుకు ఆగస్టు 31లోగా దరఖాస్తులు సమర్పించాలి: కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి:ఆగస్టు 11 (వుదయం జిల్లా ప్రతినిధి)**

చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరుకుఆగస్టు 31లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ చాంబర్ నందు చేయూత సామాజిక భద్రత పింఛన్లు మంజూరుకు దరఖాస్తులు చేయు అంశంపై డీఆర్డీఓతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకంలో భాగంగా అర్హులైన కొత్త లబ్ధిదారులకు పింఛన్లు మంజూరుకు దరఖాస్తు లు స్వీకరించాలని తెలిపారు.ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు,కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హిమోఫిలియా వంటి రక్త రుగ్మతలతో బాధపడుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల గ్రామసభలు, ప్రజావాణి కార్యక్రమాల్లో ఇప్పటికే అవసరమైన ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.అర్హులైన వారు అవసరమైన ధృవీకరణ పత్రాలతో తమ దరఖాస్తులను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు వద్ద సమర్పించి తప్పనిసరిగా రసీదు పొందాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని జిల్లాకలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఎం రవి, డిపిఆర్ఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివి కలలను నిజం చేసుకోండి

**ఆత్మకూరు(ఎస్) కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ఆగస్టు 11 వుదయం ప్రతినిధి**

విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం ఆయన ఆత్మకూరు(ఎస్) మండలంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, వసతి గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు ముచ్చటించి, వారి విద్యా భ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ గురించి ఆరా తీశారు. "భోజనం నాణ్యతగా ఉంది. ఇదే నాణ్యతను నిరంతరం కొనసాగించాలి" అని అధికారులను ఆదేశించారు. చదువుతో పాటు పౌష్టికాహారం కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు.తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో సరదాగా మాట్లాడారు. "పెద్దయ్యాక మీరు ఏమవుతారు?" అని ప్రశ్నించగా.. పలువురు విద్యార్థులు డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్ అవుతామని ఉత్సాహంగా సమాధానమిచ్చారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని చూసి ఆయన అభినందించారు."సొంత కాళ్లపై నిలబడాలంటే చదువే ఏకైక మార్గం. కష్టపడి చదివి మీ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి" అని విద్యార్థులకు హితబోధ చేశారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. తాగునీటి వసతి, టాయిలెట్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు, వారి ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విశాల్, తహసిల్దార్ అమిన్ సింగ్, ప్రిన్సిపాల్ వై. సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

**పచ్చదనంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు సాధ్యం**

**ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలి:**

**ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీ సత్య**



**భద్రాచలం, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి):**

భద్రాచలం పట్టణాన్ని పచ్చని వనంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో గ్రీన్ భద్రాద్రి—భద్రాచలం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్‌బీఐ చర్ల రోడ్ బ్రాంచ్ ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీ సత్య మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ శ్రీ సత్య మాట్లాడుతూ.. నేటి సమాజంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు నాటిన మొక్కలను సంరక్షించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. కేవలం మొక్కలు నాటడంతో బాధ్యత పూర్తికాదని, అవి వృక్షాలుగా ఎదిగే వరకు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు భవిష్యత్ తరాలకు సవాలుగా మారుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు పచ్చదనం పెంపొందించడం అత్యంత ప్రభావవంతమైన మార్గాల్లో ఒకటని పేర్కొన్నారు. చెట్లు మనకు స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు వాతావరణాన్ని సమతుల్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, కార్యాలయం, దుకాణం, పాఠశాల, కళాశాల, ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట అనువైన ప్రదేశాల్లో మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక వ్యక్తి ఒక మొక్క నాటడం ద్వారా ప్రారంభమైన చిన్న ప్రయత్నం.. సమాజం మొత్తం కలిసి ముందుకు వస్తే పెద్ద ఉద్యమంగా మారుతుందని అన్నారు.పచ్చని భద్రాచలమే లక్ష్యంగ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు ఆర్. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ భద్రాచలం పట్టణాన్ని పచ్చని వనంగా తీర్చిదిద్దడమే గ్రీన్ భద్రాద్రి ప్రధాన లక్ష్యమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్క ప్రభుత్వ శాఖకు లేదా ఒక్క సంస్థకు సంబంధించిన అంశం కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పచ్చదనం పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానికి తమ కుటుంబ సభ్యుడిలా సంరక్షణ అందించాలని కోరారు. మొక్కను నాటి ఫొటో తీసుకోవడం వరకు మాత్రమే కార్యక్రమాన్ని పరిమితం చేయకుండా, దాని పెరుగుదలను పర్యవేక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు.భద్రాచలం ఒక ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇలాంటి ప్రాంతంలో పచ్చదనం మరింత పెంచడం ద్వారా పట్టణ సౌందర్యం కూడా ఇనుమడిస్తుందని అన్నారు. పట్టణంలోకి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించేందుకు చెట్ల పెంపకం ఎంతో అవసరమని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమాలు నిరంతరం కొనసాగించడంతో పాటు గతంలో నాటిన మొక్కల సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గ్రీన్ భద్రాద్రి ప్రతినిధులు తెలిపారు.

## సొంత ఖర్చులతో జిల్లా లైబ్రరీకి 30 వేల పుస్తకాలు వితరణ చేసిన చైర్మన్

**భావితరాల విజ్ఞానం కోసం పుస్తకాన్ని మించిన సాధనం లేదు**

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి**



**మహబూబాబాద్, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి) :**

మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి, జిల్లా గ్రంథాలయ పాఠకులు పోటీ పరీక్షల సంబంధించిన పుస్తకాలు పాఠకుల సౌకర్యార్థం కోసం ప్రతి చదువరికి పుస్తకం ఉండాలని తలంపుతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి తన సొంత ఖర్చులతో 30 వేల రూపాయల కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంబంధించిన గ్రూప్ వన్, గ్రూప్ టు, ఎస్సై,కానిస్టేబుల్స్,బ్యాంకు, జూనియర్ లైన్ మెన్, అట్లాస్ ఇండియన్ పాలిటి, తెలంగాణ చరిత్ర, భారత చరిత్ర, ఇంకా అనేక పుస్తకాలు, జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు తెలియని ప్రపంచాన్ని మనకు చూపించి మన నడవడిక ఆలోచనలు సక్రమార్గంలో పయనించడానికి భావితరల విజ్ఞానం కోసం పుస్తకానికి మించిన సాధనం ఏదిలేదని, కాబట్టి ప్రతి పాఠకుడు ఈ కాంపిటీటివ్ పుస్తకాలను వినియోగించుకొని పోటీ పరీక్షల్లో విజేతలై తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుస్తూ, సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు. అనంతరం గ్రంథాలయ పాఠకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఔదార్యానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు, జి విజేందర్, రుద్రారపు వీరేందర్, నరసింగం శ్రీనివాస్, మందుల రఘు, భూలక్ష్మి యాదమ్మ గ్రంథాలయ పాఠకులు గోపాల్, నవీన్, సురేష్ ప్రవల్లిక, జ్యోతి, శారద తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి 'కాంపా' నిధులు మంజూరు చేయాలి– ఎంపీ డా. కడియం కావ్య



**వరంగల్, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి) :**

హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి 'కాంపా' (CAMPA) నిధులు మంజూరు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లైమెంట్ బెన్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. జూలో సింహాలు, హైనాలు, వైల్డ్ డాగ్స్, సరీసృపాల ఎన్‌క్లోజర్లు మరియు నైట్ షెల్టర్ల నిర్మాణానికి సంబంధించిన సవరించిన డిజైన్లకు త్వరగా సాంకేతిక ఆమోదం తెలపాలి. ఆధునిక పర్యవేక్షణ: జంతువుల ప్రవర్తన, భద్రతను నిరంతరం గమనించేందుకు వీడియో, ఆడియో రికార్డింగ్ సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.ఎకో టూరిజం అభివృద్ధి: సుమారు 50 ఎకరాల్లో విస్తరించిన ఈ పార్కును పర్యావరణ విద్య, ఎకో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దితే స్థానికంగా ఉపాధి అవకాశాలు, పర్యాటకం పెరుగుతాయి.ఎంపీ విజ్ఞప్తులపై స్పందించిన కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లైమెంట్ బెన్.. నిబంధనల ప్రకారం కాకతీయ జూ పార్క్ ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## డీఏఆర్ హెడ్‌క్వార్టర్స్, భువనగిరిలో ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ IPS ఆధ్వర్యంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం



**యాదాద్రి భువనగిరి జిల్లా , 11 ఆగస్టు 2026**

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ IPS గారి ఆధ్వర్యంలో భువనగిరి DAR హెడ్‌క్వార్టర్స్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు మరియు ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.సమావేశంలో జిల్లాలోని వివిధ నేరాలకు సంబంధించిన కేసులపై ఎస్పీ సమగ్రంగా సమీక్ష నిర్వహించి, కేసుల దర్యాప్తు మరియు సత్వర పరిష్కారానికి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ వారీగా POCSO కేసులను సమీక్షించారు. ముఖ్యంగా POCSO Cyber Tip Line కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, సకాలంలో దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో నమోదైన NDPS కేసుల పురోగతిని సమీక్షించి, సమర్థవంతమైన దర్యాప్తుతో కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న SC/ST కేసులను సమీక్షించి, దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.Long Pending Under Investigation కేసులను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు.స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలకు సంబంధించిన డిస్పోజల్ కేసులను సమీక్షించి, నిబంధనల ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే పిటిషనర్లను SHOలు తప్పనిసరిగా వ్యక్తిగతంగా కలుసుకుని, వారి సమస్యలను తెలుసుకుని, ప్రతి పిటిషన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు కఠినంగా ఆదేశించారు. రాబోయే పండుగల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని, జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.పోలీసులు గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో పాట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ, నేరాల నియంత్రణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, కేసుల సత్వర దర్యాప్తు మరియు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ గారు సూచించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ IPS గారు స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో నాణ్యమైన సేవలందించాలి– కలెక్టర్



**జనగామ, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం ఆయన విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడంతో పాటు, రఘునాథపల్లి మండలం కోమల్ల పి హెచ్ సి ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా రంగానికి ప్రాధాన్యం:కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో MEOలు, కాంప్లెక్స్ HMలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా 'సింగిల్ టీచర్' పాఠశాల ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) పకడ్బందీగా చేపట్టాలన్నారు.ప్రతి పాఠశాల వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికలను 'మిషన్ శిఖరం' ద్వారా రూపొందించాలి.డిజిటల్ విద్య, మౌలిక వసతులు పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి. విద్యార్థులకు 'ఫాస్ట్ మ్యాథ్స్' సాధన, అన్‌అకాడమీ తరగతుల వినియోగం పెంచాలి. పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల మరమ్మతులపై తక్షణమే నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పి హెచ్ సి తనిఖీ పారిశుద్ధ్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం కోమల్ల పి హెచ్ సిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రి ప్రాంగణంలో అపరిశుభ్రతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలను తక్షణమే శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.మందుల నిర్వహణ: ఫార్మసీలో మందుల నిల్వలకు తప్పనిసరిగా FIFO (First In – First Out) పద్ధతిని పాటించాలని సూచించారు. పి హెచ్ సిలో ఎదురవుతున్న నీటి ఎద్దడిని పరిష్కరించి, శనివారం నాటికి పూర్తిస్థాయిలో నీటి సరఫరా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.పాఠశాలలు, వైద్య కేంద్రాల్లో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని, ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు సమర్థవంతంగా అందేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాలలో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, GC DO గౌసియా బేగం, స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## 100శాతం పూర్తయిన ఓటర్ల ఎస్ఐఆర్ ప్రక్రియ : కలెక్టర్



**ములుగు, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి) :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ములుగు నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.మొత్తం ఓటర్లు: 2,36,970డిజిటలైజేషన్ పూర్తయిన ఓటర్లు: 2,09,128 (88.25%) అన్‌కలెక్టబుల్ ఓటర్లు: 27,842 (11.75%)మరణించిన వారు: 8,354 డబుల్ ఎంట్రీలు: 4,015శాశ్వతంగా వలస వెళ్లిన వారు: 14,207ఆచూకీ లభించని వారు: 1,219జూన్ 25న ప్రారంభమైన ఈ ప్రక్రియలో బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాల సేకరణ, పరిశీలన మరియు డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా విజయవంతంగా పూర్తి చేశారని కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

## విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

**పాఠశాలలు, అంగన్‌వాడీలు, పల్లె దవాఖానల్లో సేవలపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థులు క్రీడా ప్రతిభతో పాటు విద్యలోనూ ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, గ్రామీణ ప్రాంతాల్లోని పల్లె దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పాల్వంచ మండలం కిన్నెరసాని, యానం బైలు, రాజాపురం ప్రాంతాల్లోని కిన్నెరసాని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాల, యానం బైలు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, పల్లె దవాఖాన, రాజాపురం అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్య, క్రీడా శిక్షణ, వసతి, భోజనం, వైద్య సేవలు, పౌష్టికాహారం, పారిశుద్ధ్య సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**క్రీడా పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి**

కిన్నెరసాని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాలలో తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, గ్రంథాలయం, క్రీడా ప్రదేశాలు, పాఠశాల పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, భవనాల పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి విద్యా ప్రగతి, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, విద్యా సామగ్రి, బోధన తదితర అంశాలపై ఆరా తీశారు. వంటశాలను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, తయారీ విధానం, మెనూ అమలును పరిశీలించారు. విద్యార్థులకు ప్రతి రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు.విద్యార్థులు ఏయే క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు, పోటీల్లో పాల్గొంటున్నారా, క్రీడా సామగ్రి అందుబాటులో ఉందా అనే వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి మెరుగైన శిక్షణ అందించాలని సూచించారు. విద్య, క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని అన్నారు.

**మధ్యాహ్న భోజనంపై అసంతృప్తి**

యానం బైలు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలోమధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. భోజనం నాణ్యత, రుచి, మెనూ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ రోజు నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, భోజన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**పల్లె దవాఖానలో మందుల నిల్వల పరిశీలన**

యానం బైలు పల్లె దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రజలకు అందుతున్న ప్రాథమిక వైద్య సేవలు, రక్త పరీక్షలు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. ఔషధ నిల్వలను తనిఖీ చేసి మందుల లభ్యత, పంపిణీ, గడువు తేదీల వివరాలను పరిశీలించారు.గడువు ముగిసిన మందులు వినియోగంలోకి రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రోగుల వివరాలు, వైద్య సేవలు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, పంపిణీ వివరాలను సంబంధిత రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.

**అంగన్‌వాడీలో పౌష్టికాహారంపై ఆరా**

రాజాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, హాజరు, ఆహార మెనూ, గుడ్ల పంపిణీ, విద్యా కార్యకలాపాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో చిన్నారులు నిద్రిస్తున్న నేపథ్యంలో వారికి అసౌకర్యం కలగకుండా కేంద్రంలోని సదుపాయాలను పరిశీలించారు.చిన్నారులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని పరిశీలించి నాణ్యత, తయారీ విధానం, వంటశాల పరిశుభ్రతపై ఆరా తీశారు. గుడ్లు, ఇతర పౌష్టికాహార పదార్థాల నిల్వలను పరిశీలించారు. అర్హులైన ప్రతి చిన్నారికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## జేవిఆర్ డిగ్రీ కాలేజీలో ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ జన్మదిన వేడుకలు: ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ దివాకర్

**సత్తుపల్లి/ఖమ్మం, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి )**

సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ జన్మదినం సందర్భంగా ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోవిద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం జేవియర్ డిగ్రీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ముఖ్య



అతిథులుగా పాల్గొని విద్యార్థులకు విద్యా సామగ్రిని తమ చేతుల మీదుగా అందజేశారు.విద్యా సామగ్రి పంపిణి కార్యక్రమం లో ప్రభుత్వ 10వ తరగతి విద్యార్థులకు – ప్యాడ్స్ & పుస్తకాలు ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థులకు – బ్యాగులుప్రభుత్వ డిగ్రీ విద్యార్థులకు – పుస్తకాలు & కళాశాల యూనిఫామ్ లు పంపిణి చేశారు.

## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# సంక్షేమ శాఖ లో చిన్నారులు, వృద్ధుల సంరటక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్

**పెద్దపల్లి (సుల్తానాబాద్ ) ఆగస్టు-11(వుదయం ప్రతినిధి)**

సంక్షేమ శాఖ లో వసతి పొందుతున్న చిన్నారులు, వృద్ధులకు మెరుగైన సౌకర్యాలు, భద్రత, అవసరమైన సంరక్షణ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని క్యాడర్ దివ్యాంగుల పాఠశాల, వృద్ధాశ్రమం, బాల సదనం పాఠశాల, మండల విద్యావనరుల కేంద్రాన్ని, అలాగే పెద్దపల్లిలోని రంగంపల్లి బాల రక్షక భవన్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సంస్థల్లోని వసతి సౌకర్యాలు, సిబ్బంది విధుల నిర్వహణ, చిన్నారులు, వృద్ధులకు అందుతున్న సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా వంటశాలలు, డార్మిటరీలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వంటశాలల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, పరిసరాల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గదుల్లో పరిశుభ్రత, తగిన సౌకర్యాలు, చిన్నారులు మరియు వృద్ధుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, అవసరమైన చోట తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.సిబ్బంది విధుల నిర్వహణపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రతి ఉద్యోగి నిర్ణీత సమయానికి విధులకు హాజరై, తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి స్థాయి బాధ్యతతో, సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా సంస్థల నిర్వహణపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.చిన్నారులు, వృద్ధుల

**సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి**

**వంటశాలలు, వసతి గదులు, పరిసరాల పరిశుభ్రతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి**

సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వారి ఆరోగ్యం, భద్రత, ఆహారం, వసతి తదితర అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారి అవసరాలను గుర్తించి తక్షణమే పరిష్కరించే విధంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు.బాల రక్షక భవన్‌లో చిన్నారుల సంరక్షణ, రక్షణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. అక్కడ పనిచేస్తున్న ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సిబ్బంది బాధ్యతలను స్పష్టంగా నిర్వర్తించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.అనంతరం POCSO కేసులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలలపై లైంగిక వేధింపులు, హింస వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు బాధిత చిన్నారులకు సకాలంలో రక్షణ, అవసరమైన సహాయం, కౌన్సెలింగ్ తదితర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల రక్షక



వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. భరోసా కేంద్రాలను కూడా పరిశీలించి బాలల రక్షణ, సంరక్షణకు సంబంధించిన కేసులను సున్నితంగా పరిగణించి, బాధితులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలల సంరక్షణకు సంబంధించిన ప్రభుత్వ సేవలు, రక్షణ వ్యవస్థలపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

బాలలపై జరిగే హింస, వేధింపులు, నిర్లక్ష్యం వంటి ఘటనలను గుర్తించి సంబంధిత వ్యవస్థల దృష్టికి తీసుకువచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, తద్వారా అవసరమైన ప్రతి కేసు అధికారుల దృష్టికి వచ్చి బాధిత చిన్నారులకు సకాలంలో రక్షణ, సహాయం అందించేందుకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీల్లో సంబంధిత శాఖల అధికారులు, సంస్థల నిర్వాహకులు, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయం (చలిగల్) లో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు: కలెక్టర్



**జగిత్యాల ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లా కేంద్రీయ విద్యాలయం చలిగల్ చలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది ఎంపిక ప్యానెల్ తయారీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు బాలవాటిక ఉపాధ్యాయులు ప్రాథమిక ఉపాధ్యాయులు ( పిఆర్టి ఎస్) పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థులు 24 8 2026న వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజ రు కావాలని సూచించారు. అలాగే కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ స్పెషల్ ఎడ్యుకేటర్ సంగీతం/నృత్య శిక్షకులు (మ్యూజిక్ /డాన్స్ కోచ్) పోస్టుల కోసం 25 8 2026న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత విద్యార్హతలు ధ్రువపత్రాలతో నిర్ణీత తేదీల్లో కేంద్రీయ విద్యాలయ చలిగల్ కు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఇంటర్వ్యూలకు సంబంధించిన అర్హత లు ఖాళీలు సమయాలు అవసరమైన ధ్రువపత్రాలు తదితర పూర్తి వివరాల కోసం కేంద్రీయ విద్యాలయ చెలిగల్ ను సంప్రదించడం తో పాటు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అధికారిక వెబ్‌సైట్ ను https://karim-nagar.kvs.ac.in/ సందర్శించాలని ఆయన తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరు పింఛన్లు దరఖాస్తు చేసుకోవాలి

**అధికారులంతా సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పనిచేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి):**

అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొత్తగా పింఛన్లకు అర్హత పొందే వారిని శాచురేషన్ మోడ్‌లో గుర్తించి, వారం రోజుల్లో అర్హులందరినీ గుర్తించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఈ అవకాశాన్ని అర్హులైన పేదలందరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఆగస్టు 31 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుంచి అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. తొలి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీతకార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వనున్న నేపథ్యంలో ఆయా వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు,సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర సిబ్బంది సహకారంతో విస్తృతంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రత్యేక అవసరాలు గల పిల్ల లు, ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర పింఛన్లకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా



ప్రోత్సహించాలన్నారు. ఒక్క అర్హుడి కేసు కూడా మిస్ కాకుండా అధికారులు ఈ ప్రక్రియను ఒక సవాలుగా తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఒంటరి మహిళలు తమ జనన ధ్రువ పత్రం, ఎస్సెస్సీ మెమో, ఓటరు గుర్తింపు కార్డు (EPIC) వంటి అందుబాటులో ఉన్న పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు అవగాహన కల్పించాలనీ, అవసరమైన సందర్భాల్లో స్థానిక విచారణ, సంబంధిత ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. వితంతు మహిళలు తమ భర్త మరణ ధ్రువపత్రాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకుని చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు.కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రక్రియను మరింత సవాలుగా తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కరీంనగర్‌లో కార్పొరేటర్లు, ఇతర మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మున్సిపల్ అధికారులు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హుల గుర్తింపు నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన, తుది జాబితా తయారీ వరకు ఎక్కడా తప్పిదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులందరికీ చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అర్హులను మాత్రం మిస్ చేయవద్దని మరోసారి సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీవో గీత, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో జగదీశ్వర్‌తో పాటు మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల జిల్లా**

ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పథకం, వంటశాల, రిజిస్టర్లు, పారిశుధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే చర్యలలో భాగంగా చేపట్టిన అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ముల్కల్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్య బోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలి: కలెక్టర్

**మంచిర్యాల జిల్లా**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 ప్రక్రియలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బిఎల్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ, మార్పులు-చేర్పులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 1, 2026ను అర్హత తేదీగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ-2026 ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని చెన్నూరు (ఎస్.సి.), బెల్లంపల్లి (ఎస్.సి.), మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల ప్రతిపాదిత మార్పులు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పేర్ల మార్పు తదితర వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులతో వివరించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 747 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 18 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం, 22 పోలింగ్ కేంద్రాలస్థానాలను మార్చడం, ఒక పోలింగ్ కేంద్రం పేరును మార్చడం ప్రతిపాదించగా మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 765 కు చేరనుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 230 నుంచి 235, బెల్లంపల్లి నియోజకవర్గంలో 227 నుంచి 231, మంచిర్యాల నియోజకవర్గంలో 290 నుంచి 299 పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరగనుందని తెలిపారు. ఎన్నికల సంఘం సవరించిన కార్యాచరణ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితా ఈ నెల 17వ తేదీ ప్రచురించబడుతుందని, ఈ నెల 17 నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని, వాటి పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని, తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 19వ తేదీన ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత ఎన్నికలఅధికారులకు సమర్పించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్.-2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు.



## బేలలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌కు నిధులు మంజూరు చేయాలి

**బేలలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌కు నిధులు మంజూరు చేయాలి**



**ఆదిలాబాద్, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి):**

బేల మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.బేల మండల కేంద్రంలో పలు ప్రభుత్వ శాఖలకు సరైన కార్యాలయ భవనాలు, మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలను ఒకే సముదాయంలోకి తీసుకువస్తే ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుతాయని వివరించారు.మండల కేంద్రం అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణం అవసరమని పాయల్ శంకర్ పేర్కొన్నారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.ఎమ్మెల్యే వినతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రతిపాదనను పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి: కలెక్టర్

**ఆసిఫాబాద్,(వుదయం ప్రతినిధి)**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు గమనించామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బోరుబావులు ఉన్న రైతులు సైతం వరి సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉంటుందా అనే విషయాన్ని ఆలోచించుకోవాలని అన్నారు.జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ, వరి సాగుకు సరిపడా నీటి లభ్యత ఉండకపోవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటలు సాగు చేసి రైతులు లాభాలు పొందాలని కోరారు. 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీరాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ లేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె హరిత తెలిపారు మండలం గ్రామస్థాయిలో కార్డుల పంపిణీ ప్రణాళిక బద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు రేషన్ బియ్యం అక్రమ రవాణా పై నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని, అక్రమ రవాణా జరిగినట్లయితే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. రేషన్ బియ్యానికి అక్రమంగా తరలించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్



**నిర్మల్ జిల్లా 11 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. చేశారు. సీసీ కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసిల్దార్ రాజు, అధికారులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపకల్పనకు ఖచ్చితమైన సమాచారం అందించాలి

**అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం**

**నిజామాబాద్, ఆగస్టు 11 :**

జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీ.సీ.హెచ్.బీ) రూపకల్పన కోసం ఖచ్చితత్వంతో కూడిన నాణ్యమైన సమాచారం అందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో, ఆయా రంగాల ప్రముఖులతో జనగణన-2027కు సంబంధించి జిల్లా స్థాయిలో రూపొందించే హ్యాండ్‌బుక్ కు అందించాల్సిన సమాచారం విషయమై చర్చించి సూచనలు చేశారు. విద్యా, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, సమాచార వ్యవస్థ, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, చేతివృత్తులు, కళలు, సాహిత్యం, ప్రముఖ వ్యక్తులు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, అటవీ ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు, పరిశ్రమలు, పురావస్తు సంపద తదితర



అంశాలకు సంబంధించిన జిల్లా సమాచారాన్ని ఖచ్చితత్వంతో అందించేలా చూడాలన్నారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రాబోయే పది సంవత్సరాల పాటు సమాచార సేకరణ, ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ఉపయుక్తమైన గ్రంథంగా నిలుస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సమాచార సేకరణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారం రోజులలో సంబంధిత శాఖలు సమాచారాన్ని సేకరించి అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జి సీ.పీ.ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి: కలెక్టర్

**కామారెడ్డి, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి):**

భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) కామారెడ్డి జిల్లాలో విజయవంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 796 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 6,96,006 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ వెల్లడించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్రంగా నమోదు చేయడం ద్వారా ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.నియోజకవర్గాల వారీగా వివరాలు:-జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గం: 2,06,343 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 90.27 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం: 2,28,503 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. 90.17 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది.కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం: 2,61,160 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. 83.96 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది.జిల్లా స్థాయి గణాంకాలు:-జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,96,006 మంది ఓటర్లు ఉండగా, అందరికీ ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 6,11,568 ఎన్నికల ఫారాలు, అంటే 87.87 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 796 మంది బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించిన శిక్షణను పూర్తిగా పొందారు. 84,438 ధృవీకరణ కాని ఎన్నికల ఫారాలు నమోదుచేసినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, ఇప్పటికే మరోచోట నమోదు అయిన వారు, గైర్హాజరైన ఓటర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వర్గీకరణలను స్పష్టంగా నమోదు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



## బోనాల జాతరలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

**జగిత్యాల ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల పట్టణ ఓల్డ్ బస్టాండ్ సర్కిల్ లో తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతర వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి బోనాన్ని ఎత్తుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## దేశభక్తి చాటేలా సంగారెడ్డిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' యాత్ర


**సంగారెడ్డి,ఉదయం:**

భారతీయ జనతా పార్టీ కేంద్ర, రాష్ట్ర పార్టీల సూచనల మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్రను ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ నుంచి జిల్లా కోర్టు వరకు జాతీయ జెండాలను చేతబూని బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి హాజరయ్యారు. విజయపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రాజేశ్వరరావు దేశ్‌పాండే, వెంకట నరసింహారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మాణిక్ రావు, గొల్ల భాస్కర్, జోష్న, అశోక్, కసిని వాసు, దోమల విజయ్ కుమార్, మందుల నాగరాజ్, శ్రీకాంత్, ప్రవీణ్ యాదవ్, నరేష్ దేశ్‌పాండే, జగన్నాథ్, మీనా గౌడ్, తేజస్విని, తులసి, ప్రకాశ్ రెడ్డి, ద్వారకా రవి, ద్వారకా శివ, సాయిబాబా, నాగరాజ్, పవన్, రవి శంకర్, జగన్, క్రాంతి కులకర్ణి, నరేష్ గౌడ్, సందీప్, రాము, సాయి, అవినాష్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని, జాతీయతా భావాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు చేసిన త్యాగాల ఫలితంగానే మనకు స్వేచ్ఛ లభించిందని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారు అందించిన స్వాతంత్ర్యాన్ని ప్రతి ఒక్కరూ సంతోషంగా అనుభవించాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పట్టణంలో భారీ జాతీయ జెండాతో నిర్వహించిన పాద యాత్ర దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిందని అన్నారు.

## సామాజికవేత్త పాడిశెట్టి నారాయణస్వామి కన్నుమూత



- **మంత్రి సీతక్క పరామర్శ**
- **కుటుంబానికి మనోధైర్యం**



**ములుగు, ఆగస్టు 11:**

ములుగు ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు పాడిశెట్టి నారాయణస్వామి (95) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి 9 గంటలకు తుదిశ్వాస విడిచారు.

**మంత్రి సీతక్క పరామర్శ***

నారాయణస్వామి గారి మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి సీతక్క ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. అంతేకాకుండా చిన్ననాట నుంచే పిల్లలు పొదుపు నేర్చుకోవాలని ఆయన 'సుధాకర్ చిన్నపిల్లల పొదుపు పథకం' పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించారని, తనకు ఆ పథకానికి సహకారం లభించిన గుర్తు చేసుకున్నారు. ఆయన 'అమేజింగ్ తెలంగాణ' ఎడిటర్ రమేష్ కుమార్ గారి తండ్రి కావడం గమనార్హం. ఆయన మృతి వార్త తెలియగానే ములుగు ప్రాంత ప్రజలు, అభిమానులు, సామాజిక సేవా రంగానికి చెందిన పలువురు తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. నారాయణ స్వామి గారు గొప్ప మానవతావాది. సమాజం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయనతో నాకు ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనది. ఆయన మరణం వ్యక్తిగతంగా నాకు కూడా ఎంతో బాధ కలిగించింది" అని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమంలో ములుగు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి నారాయణస్వామి గారి కుమారులు సుధాకర్, ప్రభాకర్, రవీందర్, దిలీప్ కుమార్, రమేష్ కుమార్ తో పాటు బంధుమిత్రులు పాల్గొన్నారు. ములుగు ప్రాంతంలో సామాజిక సేవకే జీవితాన్ని అంకితం చేసిన పాడిశెట్టి నారాయణస్వామి గారి సేవలు, ఆయనతో తమకున్న అనుబంధాన్ని ప్రజలు చిరకాలం గుర్తు చేసుకుంటారని స్థానికులు అన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి కరెంటు కష్టాలపై ఎమ్మెల్యే జీఎంఆర్ సీరియస్



- **విద్యుత్ సమస్యపై అధికారుల తీరుపై ఆగ్రహం..**
- **జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే..**
- **తక్షణమే 4 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి..**

**పటాన్చెరు (ఉదయం):**

పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విద్యుత్ సమస్యల తలెత్తి రోగులు ఇబ్బందులు పడుతున్న ఘటనపై పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్, వైద్యులు, ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం సభ్యులతో విద్యుత్ సమస్యపై ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు జనరేటర్ పనిచేయకపోవడం వల్ల రోగులు, వారి సహాయకులు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆయన అధికారులను ఆరా తీశారు. "ఆసుపత్రిలో విద్యుత్ సమస్య తలెత్తినా, జనరేటర్ పనిచేయకపోయినా ఈ విషయం నా దృష్టికి ఎందుకు తీసుకురాలేదు?" అంటూ అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం, నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- **చిన్నారులు, గర్భిణీల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**
- **అంగన్వాడి, అవంచ పీహెచ్‌సీలను ఆకస్మిక తనిఖీ**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 11 (ఉదయం బ్యూరో):**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, ఆరోగ్య పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. చిన్నారులు, గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వారికి నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.
మంగళవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గం, తిమ్మాజీపేట మండలంలోని అంగన్వాడి కేంద్రం, అవంచ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల హాజరు, బాలామృతం పంపిణీ, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఎత్తు, బరువు వివరాలను పరిశీలించి, వయస్సుకు అనుగుణంగా ఎదుగుదల ఉందా లేదా అని తనిఖీ చేశారు. చిన్నారుల శారీరక ఎదుగుదలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని, పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి అదనపు పోషకాహారం, వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. బాలామృతం సకాలంలో సరఫరా అవుతుందా, అర్హులైన ప్రతి చిన్నారికి నిర్ణీత పరిమాణంలో పంపిణీ జరుగుతుందా అని ఆరా తీశారు. కేంద్రంలో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు.
అనంతరం అవంచ పీహెచ్‌సీలో వైద్య సేవలు, మందుల లభ్యత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఏఎంసి పరీక్షలకు వచ్చిన గర్భిణీలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, నెలవారీ



పరీక్షల వివరాలు, అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. గర్భిణీల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన పరీక్షలు, మందులు, సూచనలు అందించాలని వైద్యులకు సూచించారు. పీహెచ్‌సీలో మందుల నిల్వలు, ఓపీ వివరాలు, రోగుల సంఖ్యను కలెక్టర్ పరిశీలించారు. మందుల కొరత ఏర్పడకుండా ముందస్తుగా అవసరాలను గుర్తించి సంబంధిత అధికారులకు నివేదించాలని ఆదేశించారు. ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సేవలు అందుబాటులో ఉండేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రికార్డులను క్రమ పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాలు గ్రామీణ ప్రజలకు కీలకమైన సేవల కేంద్రాలని, వాటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో డీఆర్ఓ ఇంచార్జ్ సంక్షేమ శాఖ అధికారి పాండు, సర్పంచ్ కవిత, వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అంకితభావానికి నీరాజనం.. నిబద్ధతకు నిలువెత్తు రూపం!

- **ఈఈ ఆంజనేయులుకు విప్లవాత్మక సన్మానం.. ఆత్మీయ వీడ్కోలు**
- **గద్వాల గడ్డపై చెరగని సేవలు.. చరిత్ర పేజీల్లో నిలిచిపోయే శ్రమ: ఏ1 కాంట్రాక్టర్ యు. కృష్ణమూర్తి**

**గద్వాల ఆగస్టు 11 (ఉదయం బ్యూరో)**

స్వీయ క్రమశిక్షణకు నిలువెత్తు రూపమై, కర్తవ్య నిర్వహణలో అకుంఠిత దీక్షను చాటిచెప్పిన బాన్సువాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఆంజనేయులుకు గద్వాల గడ్డ ఘనంగా నీరాజనం పలికింది. సుదీర్ఘకాలం సాంకేతిక రంగానికి, ప్రజానీకానికి వీరోచిత సేవలందించి పదవీ విరమణ పొందిన ఆయనకు ఆత్మీయ వీడ్కోలు లభించింది. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కొత్త హౌసింగ్ బోర్డు ప్రాంగణంలో ఉన్న 'ఘట్టు బ్రదర్స్' నివాసంలో ఈ వీడ్కోలు మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఏ1 కాంట్రాక్టర్ యు. కృష్ణమూర్తి తన కుటుంబ సమేతంగా ఆంజనేయులును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, ఆయన సుదీర్ఘ సేవలకు శిరస్సు వంచి అభినందనలు తెలిపారు. అనంతరం యు. కృష్ణమూర్తి ఆవేశపూరిత ప్రసంగం చేస్తూ.. "పదవులు వస్తుంటాయి, పోతుంటాయి.. కానీ సేవల్లో నేర్పరితనం, గుండెల్లో నిలిచే వ్యక్తిత్వం కొందరికే సాధ్యమవుతాయి. గద్వాల ప్రాంత ప్రగతి పథంలో ఈఈ ఆంజనేయులు వేసిన ముద్ర ఎప్పటికీ చెరగనిది. ఒత్తిళ్లకు లొంగక, ఏ ఒక్కరినీ నొప్పించక, ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేసిన ఆయన నిబద్ధత అరుదైనది" అని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది ఒక వ్యవస్థతో బంధానికి ముగింపు మాత్రమేనని, ఆయన అనుభవం, మార్గదర్శకత్వం సమాజానికి ఎల్లవేళలా అవసరమని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఆంజనేయులు గారి జీవితం సకల శుభాలతో, పరిపూర్ణ ఆయురారోగ్యాలతో దేదీప్యమానంగా వెలగాలని ఆకాంక్షించారు. ఈ మహోత్స వంలో ఘట్టు బ్రదర్స్ కుటుంబ సభ్యులు, పలువురు కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు మరియు ఆత్మీయులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు ఘనమైన వీడ్కోలు పలికారు.



## త్రాగునీటికే ప్రాధాన్యం... రైతులు ఆరుతడి పంటలు వేయాలి





- **జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట, ఆగస్టు 11 (ఉదయం బ్యూరో)**

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలను పండించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'డిస్ట్రిక్ట్ ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ' సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి కొత్తగా నీరు చేరకపోవడం, రాబోయే రోజుల్లో వర్ష సూచనలు తక్కువగా ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, ప్రభుత్వం అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే కేటాయించాలని ఆదేశించిందని తెలిపారు. గత ఏడాది 3.68 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈసారి నీటి కొరతపై అవగాహన కల్పించడం వల్ల ఇప్పటికే 70,000 ఎకరాల్లో కందులు, పెసర్లు, మినుములు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి వంటి ప్రత్యామ్నాయ పంటలు వేశారని చెప్పారు. ఆగస్టు 15 తర్వాత ఆముదము, నూనె గింజల పంటలు వేసుకోవచ్చని సూచించారు. ఒకవేళ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు కురిస్తే సాగునీరు విడుదల చేయడానికి ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. అంతకుముందు గజ్వేల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్ శివధర్మతేజ మాట్లాడుతూ ప్రాజెక్టుల నీటి నిల్వల వివరాలను వెల్లడించారు. అన్నపూర్ణ సాగర్‌లో 1.19 టీఎంసీలు, రంగనాయక సాగర్‌లో 0.82 టీఎంసీలు, మల్లన్న సాగర్‌లో 4.12 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 4.11 టీఎంసీలు, శనిగరం ప్రాజెక్టులో 0.46 టీఎంసీల ఉపయోగపడే నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ గూడవల్లి, హల్దివాగు చెక్ డ్యామ్‌లను నింపితే రైతులకు మేలు జరుగుతుందని సూచించారు. కాగా, గోదావరి నుంచి నీటిని లిఫ్ట్ చేసి ప్రాజెక్టులు నింపడం ద్వారా భూగర్భ జలాలను పెంచి రైతులను ఆదుకోవాలని కోరుతూ సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు పంపిన లేఖను కలెక్టర్ సమావేశంలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సీఈ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఈలు సూర్యకిరణ్, లక్ష్మణ్ పల్లంరాజు, డిస్ట్రిక్ట్ ఇరిగేషన్ ఆఫీసర్ నాగరాజు, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, వ్యవసాయాధికారి మల్లయ్య, ఉద్యానవనాధికారి సువర్ణ పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా అభివృద్ధి, నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్షా సమావేశం

**వనపర్తి ఆగస్టు 11 (ఉదయం ప్రతినిధి)**

వనపర్తి జిల్లాలో మరుగుదొడ్డి లేని పాఠశాల లేకుండా చర్యలు తీసుకోవాలని, నిర్మాణంలో ఉన్న అన్ని పనులు సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ముఖ్య ప్రణాళిక అధికారి, జడ్పీ సి. ఈ. ఓ, విద్యా శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో జిల్లాలో కొనసాగుతున్న నిర్మాణ పనుల పై సమీక్ష నిర్వహించారు.పెబ్బేరు మండలానికి గవర్నర్ నిధుల నుండి మంజూరు చేసిన 15 లక్షల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, 4 బోర్లు వేయించడం వంటి పనులు ఇంకా ప్రారంభించకపోవడానికి కారణాలు ఏంటని ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేసిన వెంకటేశ్వర స్వామి ఆలయ పనుల పురోగతి పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేని పాఠశాలలు ఉండటానికి వీలు లేదని, నిర్మాణంలో ఉన్న వాటిని సెప్టెంబర్ చివరికల్లా పూర్తి చేయాలని, అదేవిధంగా ఎక్కడైనా పాఠశాలలో మరుగుదొడ్లు లేకుంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని తెలియజేశారు.ఇందిరా శక్తి భవనం త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా చూడాలని, అదేవిధంగా జిల్లాలో మంజూరు అయిన 133 గ్రామ పంచాయతీ భవనాల్లో ఇంకా ప్రోగ్రెస్‌లో ఉన్న 53 భవన నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మంజూరు అయిన 33 ఫుడ్ గ్రైన్ స్టోరేజ్ భవనాలు అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేసి ఇచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. సహాయ ఇంజనీర్లు ప్రతిరోజూ క్షేత్ర స్థాయికి వెళ్ళి పనుల పురోగతిని పర్యవేక్షించాలని అందుకు సంబంధించిన ఫోటోలు తనకు పంపించాలని ఆదేశించారు. అంగన్వాడీ భవనాలు, వి. ఓ భవనాలు సైతం త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డి.యం.ఎఫ్.టి నిధుల ద్వారా చేపడుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని, ఎక్కడైనా స్థలం సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వి.బి. జి.రామ్ జి పథకం ద్వారా జిల్లాలో అత్యధిక పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఎన్ ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈవో యాదయ్య, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీరు విజయ్ కుమార్, పి.డి డిఆర్డిఓ ఇంచార్జ్ రామ మహేశ్వర్ రెడ్డి, సిపిఓ హరికృష్ణ, డి. డబ్ల్యూఓ సుధారాణి, పంచాయతీరాజ్ డి. ఈ లు, ఎ.ఈ లు తదితరులు పాల్గొన్నారు.




## జర్నలిస్టు రన్నర్ రాజుకు సన్మానం

- **పుణే–బారామతి 100 కి.మీ అల్ట్రా రన్ పూర్తి చేయడం సంతోషకరం**
- **ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంగాచారి**

**ఉదయం, సిద్దిపేట ప్రతినిధి**

పుణే-బారామతి 100 కిలోమీటర్ల అల్ట్రా రన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సిద్దిపేట రన్నర్ అసోసియేషన్ అధ్యక్షుడు, జర్నలిస్ట్ నూనిగాని రాజును మంగళవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంగాచారి రాజును శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంగాచారి మాట్లాడుతూ..సుదీర్ఘ దూర పరుగు పోటీలో 100 కిలోమీటర్ల అల్ట్రా రన్‌ను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుగా వృత్తి బాధ్యతలను నిర్వహిస్తూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో పరుగు సాధనను కొనసాగిస్తున్నానని తెలిపారు. పుణే-బారామతి 100 కిలోమీటర్ల అల్ట్రా రన్‌ను పూర్తి చేయడం తనకు ఎంతో సంతోషాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నారు.యువత ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించి, రోజువారీ జీవితంలో వ్యాయామం, పరుగు వంటి క్రీడా కార్యకలాపాలను భాగం చేసుకోవాలని రాజు సూచించారు. అంతక ముందు పలువురు జర్నలిస్టులు నూనిగాని రాజును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రఘు, సంజీవ్‌రెడ్డి, మైసారెడ్డి, రాజిరెడ్డి, పాండు, భాస్కర్, యాదగిరి, మల్లారెడ్డి, మజ్జు, పాషా, సత్యనారాయణగౌడ్, భాస్కర్ రెడ్డి, ప్రశాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలి

- **అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**మహబూబ్ నగర్, ఆగస్టు11 (ఉదయం ప్రతినిధి):**

పాఠశాలల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నవాబ్‌పేట మండలంలోని కారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్), నవాబ్‌పేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు.ముందుగా కారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్.పి.హెచ్.ఎస్)ను సందర్శించిన ఆయన పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ, పరిసరాల్లో పిచ్చి మొక్కలు, పొదల తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా, మౌలిక వసతులకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించారు.అనంతరం నవాబ్‌పేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కె .జి.బి.వి) ను సందర్శించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలు, విద్యాభ్యాసం, విద్యాలయంలో అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కొంత సమయం గడిపిన ఆయన, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుని, ప్రభుత్వం అందిస్తున్న విద్య, వసతి, భోజనం తదితర సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన అదనపు కలెక్టర్, భోజనం నాణ్యత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. కారుకొండ పర్యటనలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ), పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు. కేజీబీవీ తనిఖీ సందర్భంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సిఈఓ) వెంకట్ రెడ్డి, ఎంపిడిఓ, ఎంపిఓ, స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) తదితర అధికారులు పాల్గొన్నారు.



## ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి




- **జాజాపూర్ సర్పంచ్ సంగీత**

**నారాయణపేట, ఆగస్టు11 (ఉదయం ప్రతినిధి):**

ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి అని జాజాపూర్ సర్పంచ్ కాట్రే సంగీత అన్నారు.తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత బూట్ల పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ కాట్రే సంగీత చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. జాజాపూర్‌లో తెలంగాణ ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమం కోసం పంపిణీ చేసిన బూట్ల పంపిణీ కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ కాట్రే సంగీత ఆదర్శ కమిటీ చైర్మన్ మణెమ్మ, ఉప సర్పంచ్ లక్ష్మణ్, వార్డ్ మెంబర్ శిరీష హాజరై విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాట్రే సంగీత మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే బూట్లు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.రోజూ బడికి రావాలని బాగా చదివి టీచర్లు, తల్లిదండ్రుల మాట వినాలన్నారు. మన గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వాడుకుని, విద్యార్థులందరూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న ఈ పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బూట్లు ధరించడం వల్ల ఆరోగ్యం, పరిశుభ్రత మెరుగుపడుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విజయ ,మధుసూదన్ ,భాను ప్రకాష్, మంగళ, లక్ష్మణ్, ప్రతాప్, శశిరేఖ ,నిర్మల, శ్రీదేవి, నరసింహ ,నర్సింలు, రఘురాంరెడ్డి , సంగీత పాల్గొన్నారు.

## చింత ప్రభాకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఫైర్



- **జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ ప్రెస్‌మీట్**

**సంగారెడ్డి, ఉదయం:**

బిర్ ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌పై కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.సదాశివపేట మున్సిపల్ చైర్మన్ భర్త సత్యనారాయణ మాట్లాడుతూ.. జగ్గారెడ్డి, ఆయన భార్య నిర్మలా జగ్గారెడ్డిపై ఎమ్మెల్యే ప్రభాకర్ అవాకులు చవాకులు పేలడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రభాకర్ సదాశివపేట అభివృద్ధికి ఏం చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.
2007 జూలై 18న జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. ఎమ్మెల్యే ప్రభాకర్ కారణంగా ఒక కుటుంబం నాశనమైందని సత్యనారాయణ ఆరోపించారు. ఇప్పటికైనా ఆ కుటుంబానికి నష్టపరిహారం అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

**అభివృద్ధిపై ప్రభాకర్ చర్చకు రావాలి: కూన సంతోష్**

సంగారెడ్డికి మంజూరైన మెడికల్ కళాశాలను సిద్ధిపేటకు తరలిస్తుంటే అడ్డుకోలేకపోయారని విమర్శించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రభాకర్ నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.సంగారెడ్డి అభివృద్ధిలో జగ్గారెడ్డి హయాంలో IIT, ఇంటింటికీ మంజీర నీరు, స్విమ్మింగ్ పూల్, కలెక్టరేట్, రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, నాలుగు లైన్ల రోడ్లు, మహబూబ్‌సాగర్, శిల్పారామం, పాలిటెక్నిక్ కళాశాల వంటి అనేక అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు.

**వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి: అనంత కిషన్**

కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అనంత కిషన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రభాకర్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కులం పేరుతో దూషణలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై సంబంధిత వర్గాలతో ఫిర్యాదు చేయిస్తామని తెలిపారు.
ప్రభాకర్ కారణంగా ఒక కుటుంబం నష్టపోయిందని, ఒక మహిళ ప్రాణాలు కోల్పోయిన ఘటనపై కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగ్గారెడ్డి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తుంటే అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం తగదన్నారు. రాజీవ్ గాంధీ సభ నిర్వహించినందుకే కుట్రపూరితంగా జగ్గారెడ్డిని అరెస్ట్ చేశారని, అదే కేసులో ఉన్న కొందరిని వదిలేశారని అనంత కిషన్ ఆరోపించారు.సంగారెడ్డి జాతర, దసరా ఉత్సవాలను ప్రజలతో మమేకమై నిర్వహించడం జగ్గారెడ్డి హక్కు, బాధ్యత అని అన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన కుటుంబ సభ్యుల్లా అండగా నిలిచే వ్యక్తి జగ్గారెడ్డి అని పేర్కొన్నారు.ఎమ్మెల్యే ప్రభాకర్ కుటుంబానికి సంబంధించిన అక్రమాలపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే వాటిని ప్రజల ముందుంచుతామని అనంత కిషన్ తెలిపారు. జగ్గారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని, అభివృద్ధి అంశాలపై బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే ప్రభాకర్‌కు సవాల్ విసిరారు.

## పలు బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ





పర్వతగిరి , ఆగష్టు 11 ( వుదయం ప్రతినిధి ):
పర్వతగిరి మండలం కేంద్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతు మృతిచెందిన సమీప బంధువు విశ్వజెనీత్ కరస్పాండెంట్ కీ. శే.ఎర్రబెల్లి హరీకుమార్ చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం
2.అదే గ్రామానికి చెందిన నాయకులు చిన్నపెల్లి దేవేందర్ గారి మాతృమూర్తి చిన్నపెల్లి కములమ్మ సోమవారం మరణించగా వారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి, ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన 3.నీరటి కొమురమ్మ 4. చీదురు ఏకంబ్రం 5.గాడిదాసు వీరాస్వామి కుటుంబాలను పరామర్శించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపినారు.
ఈ పరామర్శలో మాజీ మంత్రి గారితో సొసైటీ చైర్మన్ యం.మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మట్టపెల్లి చిన్న మాధవరావు , కరిమిళ్ల దుర్గారావు , మాజీ మండల అధ్యక్షులు రంగు కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ లు బొట్ల కిష్టయ్య, గొనె సంపత్,మండల మాజీ కోప్షన్ ఎంపీటీసీ ఎస్కే షబ్బీర్ పాషా,మండల నాయకులు బొట్ల మధు,మెరుగు వెంకటేశ్వర్లు రంగు కుమార్ (ఫెర్టిలైజర్) కొప్పు రాజు, తుంగ రాజు,చిరుత విజయ్, దొమ్మటి రాజు,రాపోలు యాకయ్య,ముంజ శ్రావణ్ గౌడ్,బొట్ల భాస్కర్,జంగా వీరమల్లు, అంబటి కుమార్,చింతపట్ల సునీల్,బంధారపు రంజిత్,బొట్ల శ్రీకాంత్ సోషల్ మీడియా చిన్నపెల్లి అజయ్ తదితరులు ఉన్నారు.

## పెద్దంపేట ఎస్సీ కాలనీలో కొత్త పైపులైన్ పనులు ప్రారంభం

### గ్రామస్థుల ఫిర్యాదుతో సర్పంచ్ చొరవ తక్షణ చర్యలు

మహాదేవపూర్: ఆగస్టు 11(వుదయం ప్రతినిధి):మహాదేవపూర్ మండలంలోని పెద్దంపేట గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీ లో గత కొన్ని సంవత్సరాలుగా లేని తాగునీటి పైపులైన్ సమస్యకు పరిష్కారం లభించింది.గ్రామస్థులు చేసిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ బీసుల లావణ్య రాజేష్ తక్షణమే స్పందించి మంగళవారం జేసీబీ ద్వారా కొత్త పైపులను వేయించడం జరిగింది.సంవత్సరాలుగా తాగునీటి



కోసం ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు సర్పంచ్ దంపతులు వెంటనే చర్యలు తీసుకోవడంతో సమస్య తీరిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బీసుల లావణ్య రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని అన్నారు దానిలో భాగంగానే త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు కొత్త పైపులైన్ వేసి 10 కుటుంబాలతోపా గ్రామంలో ఉన్న దేవాలయానికి నల్లాల ద్వారా నీరందించే కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఏ. సమ్మయ్య, ఉప సర్పంచ్ గడ్డం రాజు గౌడ్, పాలవర్గం సభ్యులతోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన సేవలందించాలి

### - డిఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి

వరంగల్, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి) :
జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. ఐ. ప్రకాష్‌తో కలిసి దుగ్గొండి, నల్లబెల్లి, బానోజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా ఆసుపత్రుల్లోని రికార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్ష జరిపారు.



వైద్యాధికారులు, సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలి. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలి.
పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ క్రమం తప్పకుండా 'డ్రై డే' కార్యక్రమాలు నిర్వహించాలి. అత్యవసర మందులు: అన్ని కేంద్రాల్లో అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను డిఎంహెచ్ఓ ఆదేశించారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### : సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్


వర్ధన్నపేట, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి): మండలం నల్లబెల్లి గ్రామంలో సోమవారం బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో లుమినస్ హాస్పటల్ సారథ్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని అన్నారు. ప్రజలందరూ వ్యాధుల పట్ల అవగాహన




కల్పించుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఎంతో అవసరమని, మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్లు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఈ ఉచిత మెగా వైద్య శిబిరం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, మాజీ ఉపసర్పంచ్ బిర్రు చంద్రయ్య, బాలవికాస ప్రతినిధులు పసునూరి స్వాతి, కొండేటి అశ్విత, అపర్ణ, లుమినస్ హాస్పిటల్ వైద్యులు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ల మంజూరుకు ఆగస్టు 31లోగా దరఖాస్తులు సమర్పించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి:ఆగస్టు 11(వుదయం జిల్లా ప్రతినిధి)చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరుకుఆగస్టు 31లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ చాంబర్ నందు చేయూత సామాజిక భద్రత పింఛన్లు మంజూరుకు దరఖాస్తులు చేయు అంశంపై డీఆర్డీఓతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకంలో భాగంగా అర్హులైన కొత్త లబ్ధిదారులకు పింఛన్లు మంజూరుకు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు.ఒంటరి మహిళలు, వితంతువులు,దివ్యాంగులు,కల్లు గీత కార్మికులు,చేనేత కార్మికులు,బోదకాలు,తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హిమోఫిలియా వంటి రక్త రుగ్మతలతో బాధపడుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల గ్రామసభలు, ప్రజావాణి కార్యక్రమాల్లో ఇప్పటికే అవసరమైన ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.అర్హులైన వారు అవసరమైన ధృవీకరణ పత్రాలతో తమ దరఖాస్తులను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు వద్ద సమర్పించి తప్పనిసరిగా రసీదు పొందాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఎం రవి, డిపిఆర్ఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్‌కు నల్లా పైప్‌లైన్ ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్ జున్ను కనకయ్య యాదవ్

పర్వతగిరి , ఆగష్టు 11 ( వుదయం ప్రతినిధి ):పర్వతగిరి మండలం జవాల్‌పురం గ్రామంలో చిన్నారుల ఆరోగ్యం, స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తూ జవాల్‌పురం అంగన్వాడీ సెంటర్‌కు నల్లా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "అంగన్వాడీకి వచ్చే చిన్నారులకు తాగునీరు, శుభ్రత





కోసం నీటి సౌకర్యం ఎంతో అవసరం. అందుకే పంచాయతీ నిధులతో నల్లా పైప్‌లైన్ వేయిస్తున్నాం. ఇకపై పిల్లలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు" అని అన్నారు.

## వర్షాలతో తెగిపోయిన రహదారి మరమ్మతులు పనులు

పలిమెల: ఆగస్టు 11(వుదయం ప్రతినిధి):వర్షాలతో తెగిపోయిన రహదారి మరమ్మతులు పనులు చేపట్టినట్లు పలిమెల గ్రామపంచాయతీ కార్యదర్శి బల్ల సృజన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పలిమెల నుండి ముకునూర్ వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు మార్గం



ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పలుచోట్ల తెగిపోయి ప్రయాణానికి ఇబ్బందిగా మారిందని దానితో ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రోడ్డుకు తక్షణ మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు దీంతో ప్రస్తుతం వాహనాలు, ప్రయాణికులు ఎటువంటి ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగిస్తున్నారు అని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పలిమెల సర్పంచ్ జవ్వాజి పుష్పలత, అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, వార్డ్ సభ్యులు పెద్ది శేఖర్ తోపాటు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## గుండెపోటు ముప్పు తప్పించేది సకాలంలో చేసే యాంజియోగ్రఫీ పరీక్షే

### మెడికవర్ వైద్య నిపుణులు డా. సంతోష్, డా. శ్రవణ్, డా. షఫీ

వరంగల్, ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి) : గుండె రక్తనాళాల్లోని బ్లాకేజీలను ప్రారంభ దశలోనే గుర్తించి, ప్రాణాపాయం నుంచి కాపాడటంలో యాంజియోగ్రఫీ పరీక్ష ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని మెడికవర్ హాస్పిటల్స్ కార్డియాలజీ నిపుణులు పేర్కొన్నారు. వరంగల్‌లోని మెడికవర్ హాస్పిటల్స్‌లో యాంజియోగ్రఫీ ప్రాముఖ్యత, గుండె ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా. సంతోష్, డా. శ్రవణ్, డా. షఫీ పాల్గొని మాట్లాడారు.?లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ?ప్రధాన లక్షణాలు, ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధికంగా చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే కార్డియాలజిస్టును సంప్రదించాలి.?నిర్ధారణ పద్ధతి, రోగి ఆరోగ్య పరిస్థితి, లక్షణాలు, వైద్య చరిత్ర, ప్రాథమిక పరీక్షల ఆధారంగా యాంజియోగ్రఫీ అవసరమా లేదా అనేది వైద్యులు నిర్ణయిస్తారు.?లక్షణాలు లేకపోయినా ప్రమాదం ఉండవచ్చు!?కొన్నిసార్లు తీవ్రమైన బ్లాకేజీలు ఉన్నప్పటికీ బయటకు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చని వైద్యులు హెచ్చరించారు.



?ప్రమాద కారకాలు, మధుమేహం, అధిక రక్తపోటు (బీపీ), అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం, ధూమపానం మరియు కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
?ముందస్తు జాగ్రత్తలు, క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకోవడం ద్వారా దాగి ఉన్న సమగ్ర సమస్యలను ముందే గుర్తించి సురక్షితమైన చికిత్స పొందవచ్చును.
?అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితమైన నిర్ధారణ, సమయానుకూల చికిత్సలు మెడికవర్ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్నాయని నిపుణులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ నమ్రత, ఆసుపత్రి సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన హరీష్ పరామర్శించిన శ్రీనివాస్ రెడ్డి

రాయపర్తి ఆగస్టు 11 (వుదయం ప్రతినిధి): మండలం గన్నారం గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గన్నారం గ్రామ సర్పంచ్ గడ్డం విజయ సమ్మయ్య కుమారుడు గడ్డం హరీష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి గారు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరపున



రూ. 4000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, మచ్చ శ్రవణ్, పెందోట శివ, జంపి, గారే నరేష్, రాజు, స్థానిక సర్పంచ్ గడ్డం విజయ సమ్మయ్య, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు ఊళ్లేంగాల సుధాకర్, పార్టీ ముఖ్య నాయకులు గజేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ బొంధ్యలు తదితరులు పాల్గొన్నారు.

## చల్లూరి సదానంద చారికి ఘన సన్మానం



మహాదేవపూర్: ఆగస్టు 11(వుదయం ప్రతినిధి)
మహాదేవపూర్ పలిమెల మండలాల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన చల్లూరి సదానంద చారి కి మంగళవారం పలువురు నాయకులు శాలువాలు కప్పి,పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్ గుడాల శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కం అశోక్, బుర్రి శివరాజు, మోతే సాంబయ్య, లేల ముక్తీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మైలారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఉళ్లేంగుల నర్సయ్యను పరామర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



రాయపర్తి ఆగస్టు 11(వుదయం ప్రతినిధి): మండలం మైలారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉళ్లేంగుల నర్సయ్య ని పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా పరామర్శించారు.ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకుని మైలారం గ్రామంలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న నర్సయ్య ని ఎమ్మెల్యే స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి, జరుగుతున్న చికిత్స వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.పార్టీ కోసం నిత్యం కష్టపడే కార్యకర్త, గ్రామ పార్టీ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న నర్సయ్య త్వరగా సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని, తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆకాంక్షించారు. అవసరమైన అన్ని విధాలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు జాటోత్ హామ్యా నాయక్ , మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బీరం వెంకట్ రెడ్డి, చెవ్వు కాసినారం, రెంటాల గోవర్ధన్ రెడ్డి, మండల నాయకులు, మైలారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపేల్లి దేవేందర్ మాతృమూర్తి భౌతికకాయానికి నివాళులు

### మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు



దేవేందర్ మాతృమూర్తి చినపెల్లి కమలమ్మ నిన్న మరణించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు మంగళవారం కమలమ్మ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా తల్లిని కోల్పోయి కన్నీటిపర్యంతమవుతున్న దేవేందర్‌ను రాములు ఓదార్చి, ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. కమలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ రావు, మాజీ జిల్లా పరిషత్ సభ్యులు మహమ్మద్ సర్వర్, కాంటెస్టెడ్ జడ్పీటీసీ జాటోత్ శ్రీనివాస్, కాంటెస్టెడ్ సర్పంచ్ సింగారం రమేష్, మాజీ సర్పంచ్‌లు బొట్ల కిష్టయ్య, గోనె సంపత్, మాజీ ఉప సర్పంచ్‌లు రంగు జనార్ధన్, ఆదొండ బిక్షపతి పాల్గొన్నారు.
వీరితో పాటు పార్టీ నాయకులు జిల్లా ధర్మయ్య, డాక్టర్ శ్రీనివాస్, కొండం వెంకన్న, సోషల్ మీడియా ప్రతినిధి బొట్ల భాస్కర్, డీలర్ దర్గస్వామి, మైనార్టీ నాయకురాలు సుల్తానా, జూలపల్లి సురేందర్ రావు, కంటెం ఏకాంతం, సుధాకర్, బొట్ల కుమార్, చినపాక శ్రీకాంత్, కనకరాజు, మొగిలి యాకయ్య, వీరాస్వామి తదితరులు పాల్గొని కమలమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

# చక్కని ఆరోగ్యం

## ఐరన్ ట్యాబ్లెట్లను రోజూ వేసుకుంటున్నారా..



శరీర ఆరోగ్యానికి ఐరన్ ఎంతో అవసరం. ఐరన్ లోపం వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. లోపం ఉన్నప్పుడు వైద్యులు ఐరన్ సప్లిమెంట్లను సూచిస్తారు. అయితే అవసరానికి మించి ఐరన్ సప్లిమెంట్లను తీసుకోవడం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే వైద్యుల సూచన మేరకు సరైన మోతాదులోనే వీటిని తీసుకోవడం ముఖ్యం. ఐరన్ సప్లిమెంట్లను అధికంగా తీసుకున్నప్పుడు కొన్ని సాధారణ దుష్ప్రభావాలు కనిపిస్తాయి. ముఖ్యంగా దంతాలపై మరకలు పడడం, జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు, వికారం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. లిక్విడ్ రూపంలో ఉండే ఐరన్ సప్లిమెంట్లను నేరుగా తీసుకోవడం వల్ల దంతాలపై మరకలు పడే అవకాశం ఉంటుంది. అందువల్ల వాటిని నీరు లేదా పండ్ల రసంలో కలిపి, స్ట్రా ద్వారా తీసుకోవడం వల్ల దంతాలతో నేరుగా సంబంధం ఉండడాన్ని తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఐరన్ సప్లిమెంట్లు కొందరిలో పొట్టలో అసౌకర్యం, మలబద్ధకం, విరేచనాలు లేదా కడుపు నొప్పి వంటి జీర్ణ సంబంధిత సమస్యలకు కారణమవుతాయి. ఇలాంటి సమస్యలు ఎదురైతే ఆహారంతోపాటు లేదా భోజనానికి ముందు, తర్వాత సప్లిమెంట్లను తీసుకోవడం వల్ల కొంత ఉపశమనం లభిస్తుంది. ఐరన్ ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల వికారం, వాంతులు, నోటిలో లోహం రుచి వంటి సమస్యలు వస్తాయి. మోతాదును తగ్గించడం వల్ల ఈ సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. అయితే సప్లిమెంట్ మోతాదును స్వయంగా మార్చకుండా వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. శరీరంలో ఐరన్ అధికంగా చేరితే రక్త ప్రసరణ వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఫలితంగా రక్తపోటు తగ్గడం, నాడి బలహీనంగా లేదా వేగంగా కొట్టుకోవడం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు కనిపిస్తాయి.

ఐరన్ ను అధిక మోతాదులో తీసుకోవడం వల్ల చర్మం, పెదవులు లేదా వేళ్ల చివర్ల రంగులో మార్పులు కనిపిస్తాయి. చర్మం రంగు కోల్పోవడం లేదా వేళ్ల చివర్లలో నీలిరంగు ఛాయ కనిపించడం ఐరన్ అధిక మోతాదుకు సంకేతంగా ఉంటుంది. పిల్లల విషయంలో ఐరన్ అధిక మోతాదు మరింత ప్రమాదకరంగా ఉంటుంది. అధికంగా ఐరన్ ను తీసుకోవడం వల్ల శరీరంలో జింక్ శోషణకు ఆటంకం కలుగుతుంది. జింక్ లోపం పిల్లల్లో ఎదుగుదల సమస్యలు, జుట్టు రాలడం, ఆకలి తగ్గడం, చర్మ సంబంధిత సమస్యలు, విరేచనాలు వంటి ఇబ్బందులకు దారితీస్తుంది. అందువల్ల ఐరన్ సప్లిమెంట్లు తీసుకునేవారు జింక్ సమృద్ధిగా ఉండే ఆహారాన్ని కూడా తీసుకోవాలి. ఐరన్ సప్లిమెంట్లు తీసుకున్నప్పుడు మలం నలుపు లేదా బూడిద రంగులోకి మారడం కొంతవరకు సాధారణమే. అయితే మలం తారు మాదిరిగా నల్లగా కనిపించడం, అందులో రక్తపు చారలు కనిపించడం, కడుపులో తీవ్రమైన నొప్పి లేదా పుండ్ల వంటి లక్షణాలు ఉంటే అంతర్గత రక్తస్రావానికి సంకేతం అవుతుంది. అలాంటి పరిస్థితుల్లో వైద్యులను సంప్రదించడం అవసరం. ఐరన్ అధికంగా తీసుకోవడం వల్ల ఊపిరితిత్తుల్లో ద్రవం పేరుకుపోయే అవకాశం కూడా ఉంటుంది. దీనివల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చర్మం పాలిపోయినట్లు కనిపించడం, అధికంగా చెమటలు పట్టడం, గురక వంటి లక్షణాలు కనిపిస్తాయి. పడుకున్నప్పుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా ఆందోళన కూడా ఎదురయ్యే అవకాశం ఉంటుంది. శరీరానికి ఐరన్ అవసరమైనప్పటికీ, అవసరానికి మించి సప్లిమెంట్ల రూపంలో తీసుకోవడం ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. వయోజన పురుషులకు రోజుకు 8 మిల్లీగ్రాములు, వయోజన మహిళలకు 18 మిల్లీగ్రాములు, గర్భిణులకు 27 మిల్లీగ్రాములు, పిల్లలకు సుమారు 11 మిల్లీగ్రాముల ఐరన్ అవసరం ఉంటుంది. అయితే వ్యక్తిగత అవసరాలు భిన్నంగా ఉంటాయి కాబట్టి ఐరన్ సప్లిమెంట్లను తీసుకునే ముందు, మోతాదును నిర్ణయించే ముందు వైద్యుల సలహా తీసుకోవడం ముఖ్యం.

## కొత్తగా ప్రచారం అవుతున్న వాల్యూమెట్రిక్స్ డైట్.. ఏంటిది..

బరువు తగ్గాలని చాలామంది డైట్ పేరుతో ఆహారాన్ని పూర్తిగా తగ్గించుకోవడం లేదా వింతైన డైట్లను అనుసరించడం చేస్తున్నారు. స్లీపింగ్ బ్యూటీ డైట్, బేబీ ఫుడ్ డైట్, ఐస్ డైట్, సిర్ట్‌ఫుడ్ డైట్, హోల్ 30 డైట్ వంటి వాటి తర్వాత ఇప్పుడు వాల్యూమెట్రిక్స్ డైట్ కూడా బరువు తగ్గించే విధానంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే మిగతా కొన్ని డైట్లతో పోలిస్తే ఇది తక్కువ కేలరీలు, ఎక్కువ పరిమాణంలో ఉండే ఆహారాలను ఎంచుకోవడంపై దృష్టి పెడుతుంది. వాల్యూమెట్రిక్స్ డైట్‌లో తక్కువ కేలరీలు, ఎక్కువ నీరు లేదా పీచు పదార్థాలు ఉండే ఆహారాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఇలాంటి ఆహారాలు ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తాయని ఈ విధానం చెబుతోంది. పండ్లు, కూరగాయలు, సూప్‌లు వంటి సహజంగా తక్కువ కేలరీలు ఉండే ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం ఇందులో ముఖ్యమైన అంశం. ఈ డైట్ విధానాన్ని పోషకాహార నిపుణురాలు బార్బరా రోల్స్ అభివృద్ధి చేశారు. ఇందులో ఏ ఆహారాన్నీ పూర్తిగా నిషేధించరు. అయితే రోజుకు తీసుకోవాల్సిన కేలరీల పరిమితిని దృష్టిలో ఉంచుకుని ఆహారాన్ని ఎంచుకోవాలని సూచిస్తారు. అంటే నచ్చిన ఆహారాన్ని పూర్తిగా మానేయడం కంటే, తక్కువ కేలరీలు ఉండే ఆహారాలతో కడుపు నిండేలా చూసుకోవడం ఈ విధానం ప్రధాన ఉద్దేశం. వాల్యూమెట్రిక్స్ డైట్‌లో ఆహారాలను నాలుగు గ్రూపులుగా విభజించారు. మొదటి గ్రూపులో పిండి పదార్థాలు తక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు, కొవ్వు లేని పాలు, బ్రోత్ ఆధారిత సూప్‌లు ఉంటాయి. రెండో గ్రూపులో పిండి పదార్థాలు ఉండే పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, బ్రేక్‌ఫాస్ట్ సీరియల్స్, తక్కువ కొవ్వు మాంసం, పప్పుధాన్యాలు వంటి ఆహారాలు ఉంటాయి. మూడో గ్రూపులో మాంసం, చీజ్, ఫ్రెంచ్ ఫ్రైస్, సలాడ్ డ్రెస్సింగ్, బ్రెడ్, ఐస్‌క్రీమ్, కేక్ వంటి వాటిని చేర్చారు. నాలుగో గ్రూపులో చిప్స్, చాక్లెట్ క్యాండీలు, కుకీలు, నట్స్, వెన్న, నూనె వంటి అధిక కేలరీలు ఉండే ఆహారాలు ఉంటాయి. ఇందులో మొదటి, రెండో గ్రూపులకు చెందిన ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. మూడో గ్రూపులోని ఆహారాలను పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. నాలుగో గ్రూపులోని ఆహారాలను వీలైనంత వరకు తగ్గించాలి. ఈ విధానంలో ప్రధానంగా తక్కువ కేలరీలున్న ఆహారాలను ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల ఆకలి నియంత్రణలో ఉండి బరువు తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఒక అధ్యయనంలో 97 మంది ఊబకాయం ఉన్న మహిళలను రెండు గ్రూపులుగా విభజించి పరిశీలించారు. ఒక గ్రూపుకు తక్కువ కొవ్వు ఆహారం, మరో గ్రూపుకు పండ్లు, కూరగాయలకు ప్రాధాన్యం ఇచ్చే తక్కువ కేలరీల సాంద్రత కలిగిన ఆహారం అందించారు. ఏడాది తర్వాత రెండు గ్రూపుల్లోనూ బరువు తగ్గినప్పటికీ, పండ్లు, కూరగాయలకు ప్రాధాన్యం ఇచ్చిన గ్రూపులో సుమారు 14 పౌండ్ల బరువు తగ్గగా, మరో గ్రూపులో సుమారు 10 పౌండ్ల బరువు తగ్గినట్లు అధ్యయనం తెలిపింది. వాల్యూమెట్రిక్స్ డైట్‌లో ఆహారంతోపాటు వ్యాయామానికీ ప్రాధాన్యం ఉంటుంది. ఆరోగ్యకరమైన రీతిలో బరువు తగ్గేందుకు రోజుకు సుమారు 30 నుంచి 60 నిమిషాల వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. అయితే ఏదైనా డైట్ విధానాన్ని ప్రారంభించే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, పోషక అవసరాలను పరిగణనలోకి తీసుకుని నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.



## రాత్రి పడుకునే ముందు ఇవి తింటే ఆరోగ్యానికి హానికరం..!

మంచి ఆరోగ్యానికి నిద్ర చాలా అవసరం. కానీ నేటి జీవితంలో చాలామంది నిద్రలేమి (Sleeplessness) తో బాధపడుతున్నారు. మనం తినే ఆహారం (Food) కూడా నిద్రపై ప్రభావం చూపుతుంది. నిద్రలేమీతో క్రమక్రమంగా అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడుతాయి. అందుకే రాత్రిపూట కొన్ని ఆహారాలను తీసుకోవడం మానుకుంటే కంటినిండా నిద్రపోవచ్చు. మరి రాత్రి పడుకునే ముందు తినకూడని ఆ ఆహారపదార్థాలేవో ఇప్పుడు తెలుసుకుందాం.. కాఫీ, టీ, ఎనర్జీ డ్రింక్స్, చాక్లెట్లు వంటి వాటిలో కెఫీన్ ఉంటుంది. ఇవి మెదడును చురుకుగా ఉంచి నిద్ర పట్టకుండా చేస్తాయి. కాబట్టి రాత్రి పడుకునే ముందు వీటికి దూరంగా ఉండటం మంచిది. మసాలాలు, వేయించిన ఆహారం తింటే కడుపులో మంట, ఎసిడిటీ కలుగుతుంది. దాంతో నిద్రకు ఇబ్బంది కలుగుతుంది. పిజ్జా, బర్గర్, మటన్ వంటి ఆహారాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి ఇవి కూడా నిద్రకు అంతరాయం కలిగిస్తాయి. అందుకే వాటికి దూరంగా ఉండాలి. అదేవిధంగా కేకులు, స్వీట్లు తింటే రక్తంలో చక్కెర పెరిగి నిద్రకు భంగం కలుగుతుంది. కాబట్టి వాటిని కూడా రాత్రి పడుకునే ముందు అస్సలు తినకూడదు. నిమ్మకాయ, నారింజ, టమోటా వంటి వాటిని రాత్రిపూట తింటే గుండెల్లో మంట కలుగుతుంది. ఎందుకంటే వాటిలో ఆమ్లాలు ఉంటాయి. అందుకే మంటగా అనిపిస్తుంది. అదేవిధంగా బ్రకోలీ, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటివి తింటే కడుపులో గ్యాస్ ఏర్పడి నిద్రకు ఇబ్బంది కలుగుతుంది. మద్యం తాగితే మొదట నిద్ర వచ్చినట్టు అనిపించినా తర్వాత నిద్ర సరిగా ఉండదు. కాబట్టి రాత్రి పడుకునే ముందు మద్యానికి దూరంగా ఉండటం మంచిది.



## పాదాల పగుళ్లు... తగ్గుతాయి!



ఆముదం పేరు చెబితే ఘాటైన వాసన, చేదు... గుర్తొస్తాయి. కానీ, దీనివల్ల కలిగే ప్రయోజనాలెన్నో! రాత్రి పడుకునే ముందు పాదాలను శుభ్రం చేసుకుని ఆముదం రాసి సాక్స్ వేసుకోండి. కొన్ని రోజుల్లోనే పగుళ్లు తగ్గి చర్మం మృదువుగా మారుతుంది. ఇంట్లో తలుపులు తీసేటప్పుడు, వేసేటప్పుడు కిర్రుమని శబ్దాలు వస్తున్నాయా... అయితే, గొళ్లాలు, (హింజెస్)కీలు... వంటిచోట్ల కొన్ని చుక్కల ఆముదం వేస్తే సాఫీగా పనిచేస్తాయి.

తోటపని పరికరాలు, కత్తెర్లు, చాకులకు తుప్పు పట్టకుండా ఉండటానికి ఆముదం పూసి ఉంచితే సరి. లెదర్ షూస్, బెల్టులు వంటివి పాడవకుండానే కాదు అవి కొత్త వాటిలా మెరవాలన్నా ఆముదం రాయొచ్చు. దూదితో రుద్దితే సరి. ఆముదాన్ని నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయడం వల్ల హానికరమైన పురుగులు, క్రిములు రాకుండా ఉంటాయి. మొక్కలు కూడా ఆరోగ్యంగా పెరుగుతాయి.

## వర్షా కాలంలో.. పిల్లలు జబ్బు పడకుండా!

వర్షాకాలం బోలెడు వ్యాధులను వెంట పెట్టుకొస్తుంది. వీటికి తోడు దోమలు, కలుషిత నీరు, ఆహారం పిల్లల ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలోకి నెడతాయి. అందుకే ఈ కాలంలో తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం విషయంలో మరింత శ్రద్ధ వహించాలంటున్నారు వైద్య నిపుణులు. పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగేలా వివిధ పోషకాలతో కూడిన ఆహారం అందించాలి. కూరగాయలు, పండ్లను ఉప్పు నీటితో శుభ్రం చేసిన తర్వాతే పిల్లలకు అందించాలి. మసాలాలు, ప్రాసెస్డ్, ఫాస్ట్ ఫుడ్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి. వీలైనంత వరకు ఇంట్లో తయారుచేసిన ఆహారానికే ప్రాధాన్యమివ్వాలి. భోజనానికి ముందు, వాష్‌రూంకు వెళ్లొచ్చిన తర్వాత పిల్లలు తమ చేతులు శుభ్రంగా కడుక్కునేలా జాగ్రత్త వహించాలి. ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉండేందుకు పిల్లలు తడి దుస్తులు, చెప్పులు, సాక్స్‌లు ధరించకుండా చూడాలి. దోమ కాటు నుంచి రక్షణ పొందేందుకు వీలుగా ఫుల్ స్లీవ్స్ ఉన్న దుస్తులనే పిల్లలకు తొడగాలి. తులసి, లావెండర్.. వంటి మొక్కలను ఇంటి ఆవరణలో పెంచుకుంటే దోమల బెడద నుంచి తప్పించుకోవచ్చు. పూలకుండీలు, ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఇంట్లోని చెత్తను ఏరోజుకా రోజు బయట పడేయాలి. వర్షాకాలంలో సీజనల్ అలర్జీలు సాధారణమే అయినప్పటికీ నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.



## రోజూ వ్యాయామం చేస్తే వృద్ధాప్యంలో వ్యాధులు రావు..

వ్యాయామం వల్ల కండరాలు, శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదించే ప్రయోజనాలు కూడా ఉన్నాయని ఓ అధ్యయనం వెల్లడించింది. క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వారిలో రోగనిరోధక వ్యవస్థ కూడా వయసుతోపాటు అంతగా క్షీణించే అవకాశాలు ఉండవని పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ శారీరక చురుకుదనం కొనసాగించడం ఆరోగ్యానికి అనేక విధాలుగా ఉపయోగపడుతుందని ఈ అధ్యయనం సూచిస్తోంది. ఈ అధ్యయనం కోసం 55 నుంచి 79 ఏళ్ల మధ్య వయసున్న 125 మంది ఔత్సాహిక సైక్లిస్టులను పరిశోధకులు ఎంపిక చేశారు. వీరిలో 84 మంది పురుషులు, 41 మంది మహిళలు ఉన్నారు. పురుషులు 6.5 గంటల్లో 100 కిలోమీటర్లు, మహిళలు 5.5 గంటల్లో 60 కిలోమీటర్లు సైకిల్ తొక్కగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. ధూమపానం చేసేవారు, అధికంగా మద్యం సేవించేవారు, రక్తపోటు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని అధ్యయనం నుంచి మినహాయించారు. పాల్గొన్నవారికి పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయని పెద్దలతో వారి ఫలితాలను పోల్చారు. వ్యాయామం చేయని గ్రూపులో 57 నుంచి 80 ఏళ్ల మధ్య వయసున్న 75 మంది ఆరోగ్యవంతులు ఉన్నారు. వీరితోపాటు 20 నుంచి 36 ఏళ్ల మధ్య వయసున్న 55 మంది ఆరోగ్యవంతులను కూడా పోలిక కోసం పరిశీలించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేసే సైక్లిస్టుల్లో వయసు పెరిగినా కండరాల పరిమాణం, కండరాల బలం తగ్గడం కనిపించలేదని అధ్యయనం వెల్లడించింది. అలాగే వయసు పెరుగుతున్న కొద్దీ శరీర కొవ్వు లేదా కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం కూడా కనిపించలేదని పరిశోధకులు గుర్తించారు. వ్యాయామం వృద్ధాప్యంతో వచ్చే కొన్ని శారీరక మార్పులను తగ్గించడంలో సహాయపడుతుందని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. ఈ సైక్లిస్టులు భవిష్యత్తులోనూ సైక్లింగ్‌ను కొనసాగిస్తూ తమ శారీరక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకుంటారో పరిశీలించేందుకు పరిశోధకులు తదుపరి అధ్యయనాలను కొనసాగించాలని భావిస్తున్నారు. వ్యాయామంతోపాటు ఆహారం కూడా ఆరోగ్యకరమైన వృద్ధాప్యంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కొన్ని పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వృద్ధాప్య ప్రక్రియను ఆలస్యం చేయడంలో సహాయపడతాయి. ఆలివ్ ఆయిల్ ఆరోగ్యకరమైన కొవ్వులైన మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు (MUFA), ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లకు మంచి మూలం. శరీరానికి అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులను అందించడంలో ఇది సహాయపడుతుంది. అధిక కోకో శాతం ఉన్న డార్క్ చాక్లెట్‌లో ఐరన్, కాపర్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉండటంతో ఫ్రీ ర్యాడికల్స్ వల్ల శరీరంలో జరిగే నష్టాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. పెరుగు కాల్షియం, ప్రోటీన్‌కు మంచి మూలం. ఇది కండరాలు, ఎముకల నష్టాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అలాగే పెరుగులో ఉండే మేలు చేసే బ్యాక్టీరియా ఆహారాన్ని జీర్ణం చేయడంలో, శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. బ్రోకలీలో విటమిన్ సి, ఆహారపు పీచు సమృద్ధిగా ఉంటాయి. ఇందులో బీటా కెరోటిన్, సెలీనియం కూడా ఉండటంతో ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా దీనిని చేర్చుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.



## జుట్టూడిపోకుండా.. ఈ జాగ్రత్తలు!

చిన్న వయసులోనే జుట్టూడిపోవడం ఈమధ్య కామనైపోయింది.. ఇందుకు కారణాలెన్నో. అయితే ఎవరికి వారు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లయితే జుట్టూడిపోకుండా కొంతవరకు కాపాడుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో – జుట్టు ఆరోగ్యానికి పాటించాల్సిన కొన్ని చిట్కాల గురించి తెలుసుకుందాం రండి.. శరీరానికి ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంత అవసరమో.. శిరోజాల సంరక్షణకు కూడా అంతే అవసరం. ఇందులో భాగంగా సరిపడినన్ని మంచినీళ్లు తీసుకోవాలి. దీనివల్ల శరీరంలో నీటి స్థాయులు పెరగడమే కాకుండా మలినాలు, వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా జుట్టు కూడా ఆరోగ్యాన్ని సంతరించుకుంటుంది. అవసరమైతే వైద్యులను సంప్రదించి విటమిన్ సప్లిమెంట్స్ తీసుకోవాలి. ఇందులోని పోషకాలు జుట్టు ఆరోగ్యంగా ఉండడానికి సహకరిస్తాయంటున్నారు నిపుణులు. జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే క్రమం తప్పకుండా హెయిర్‌ను ట్రిమ్ చేసుకోవాలి. తలస్నానానికి బాగా వేడిగా ఉండే నీళ్లు ఉపయోగించడం వల్ల జుట్టు కుదుళ్లకు నష్టం కలుగుతుందట. కాబట్టి గోరువెచ్చని నీటినే తలస్నానానికి ఉపయోగించాలి. వెంట్రుకలు దృఢత్వాన్ని సంతరించుకోవాలంటే స్నానం తర్వాత కండిషనర్‌ను రాసుకోవడం తప్పనిసరని చెబుతున్నారు నిపుణులు. స్నానం చేసిన తర్వాత సాధ్యమైనంతవరకు జుట్టును సహజంగానే ఆరనివ్వాలి. వేడి కలిగించే హెయిర్ డ్రయర్స్‌ను అధికంగా వాడడం వల్ల కుదుళ్లలో దురద, అలర్జీలు, జుట్టు చివర్లు చిట్లడం... వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాగే తలస్నానం చేశాక జుట్టును తుడుచుకునేందుకు రెగ్యులర్ టవల్స్ బదులు మైక్రోఫైబర్ ర్యాపర్స్‌ను వినియోగిస్తే మేలంటున్నారు. తలస్నానం చేసిన వెంటనే జుట్టును దువ్వకూడదు. అలా చేస్తే వెంట్రుకలు తెగిపోవడం, ఎక్కువ జుట్టు రాలిపోవడం... వంటి సమస్యలొస్తాయట. అలాగే జుట్టు దువ్వుకోవడానికి కూడా మెత్తటి బ్రిజిల్స్ ఉండే దువ్వెనను ఉపయోగించడం ఉత్తమం. జుట్టు ఆరోగ్యానికి మసాజ్‌కు మించిన సాధనం లేదంటున్నారు నిపుణులు. ఈక్రమంలోనే కనీసం వారానికోసారైనా హెయిర్ మసాజ్ చేసుకోవాలని సూచిస్తున్నారు.



## గౌతమ్ అదానీపై క్రిమినల్ అభియోగాల కొట్టివేత



అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ పై ఉన్న క్రిమినల్ అభియోగాలను అమెరికా కోర్టు కొట్టి వేసింది. దీంతో మోసం, లంచం ఆరోపణలకు సంబంధించిన కేసులో దాదాపు రెండేళ్లుగా సాగుతున్న విచారణ ముగిసింది. కానీ మోసం, లంచం కేసును ఉపసంహరించుకోవాలనే న్యాయ శాఖ నిర్ణయంపై న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది.




# డెట్ పథకాల్లోకి నిధుల వరద



ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ స్కీముల్లోకి జులైలో నిధుల ప్రవాహం తగ్గుముఖం పట్టింది. రూ.24,697 కోట్లు మాత్రమే ఈ విభాగంలోకి పెట్టుబడుల రూపంలో వెళ్లాయి. జూన్ మాసంలో ఈ మొత్తం రూ.28,973 కోట్లుగా ఉంది. అలా పోల్చినప్పుడు 15 శాతం క్షీణత నమోదు కావడం గమనార్హం. ఈ మేరకు జులై నెలకు సంబంధించి మ్యూచువల్ ఫండ్ సంస్థల సమాఖ్య యాంఫీ సంబంధిత డేటాను వెలువరించింది. ఈక్విటీ కేటగిరీలో స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.7,768 కోట్లు పెట్టుబడుల రూపంలో వెళ్లాయి. మిడ్‌క్యాప్‌ల్లోకి రూ.6,192 కోట్లు, ఫ్లెక్సీక్యాప్‌లోకి రూ.4,710 కోట్లు, లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.1,322 కోట్లు పెట్టుబడులు వెళ్లాయి. జులై నెలలో మ్యూచువల్ ఫండ్ స్కీముల్లోకి మొత్తంగా నికరంగా రూ.2.36 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. జూన్ నెలలో నికరంగా రూ.52,949 కోట్లు పెట్టుబడులు తరలిపోవడం గమనార్హం. ముఖ్యంగా డెట్ ఆధారిత పథకాల్లోకి పెద్దమొత్తంలో పెట్టుబడులు రావ డం కలిసొచ్చింది. ఈ విభాగంలో జులై నెలలో రూ.1.88 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. జూన్ నెలలో రూ.1.09 లక్షల కోట్లు తరలిపోయాయి. జులై నాటికి మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.82.22 లక్షల కోట్ల నుంచి రూ.85.76 లక్షల కోట్లకు పెరిగింది. జులై నెలలోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నిధుల ప్రవాహం కొనసాగింది. మొత్తం రూ.1559 కోట్లు పెట్టుబడుల రూపంలో వచ్చాయి. జూన్‌తో నమోదైన రూ.3442 కోట్ల పెట్టుబడులతో పోల్చినప్పుడు మాత్రం ఈ మొత్తం తగ్గుముఖం పట్టింది.

# 17 నుంచి లలితా జువెలరీ ₹1700 కోట్ల ఐపీఓ..




ప్రముఖ జువెలరీ సంస్థ లలితా జువెలరీ మార్ట్ తొలి పబ్లిక్ ఇష్యూకి సిద్ధమైంది. మార్కెట్ నుంచి రూ.1700 కోట్ల నిధులను ఐపీఓ ద్వారా సమీకరించనుంది. ఆగస్టు 17న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఆగస్టు 19న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణి రూ.190-201గా కంపెనీ నిర్ణయించింది. రూ.11,250 కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వస్తోంది. ఆగస్టు 14న యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ తెరుచుకుంటుంది. పబ్లిక్ ఇష్యూలో రూ.1,200 కోట్ల విలువైన తాజా షేర్లు, రూ.500 కోట్ల విలువైన షేర్లు ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయిస్తున్నారు. 50 శాతం క్వాలిటీ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు, 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు, 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. షేర్లు ఆగస్టు 24న స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ కానున్నాయి. ఐపీఓ నిధులను జువెలరీ రిటైల్ నెట్‌వర్క్‌ను, స్టోర్లను విస్తరించడానికి లలితా జువెలర్స్ వినియోగించనుంది.

ఫిల్మ్, టెలివిజన్ ప్రొడ్యూసర్, డైరెక్టర్ విపుల్ షాకు చెందిన సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్లను సమీకరించే లక్ష్యంతో ఐపీఓకు రానుంది. ఆగస్టు 18న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. ఆగస్టు 20న ముగియనుంది. ధరల శ్రేణి రూ 342-360గా కంపెనీ నిర్ణయించింది. ఆగస్టు 17న యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ తెరుచుకుంటుంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఈ ఐపీఓ జరగనుంది. ప్రమోటర్లుగా విపుల్ అమృత్‌లాల్ షా, షెఫాలి విపుల్ షా తమ వాటాను తగ్గించుకున్నారు. 50 శాతం క్వాలిటీ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లు, 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లు, 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించనున్నారు. కంపెనీ షేర్లు ఆగస్టు 25న స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ కానున్నాయి.

# నష్టాల్లో ముగిసిన మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న అనిశ్చితి వల్ల చమురు ధరలు పెరగడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రియాల్టీ, ఎఫ్ఎంసీజీ, సిమెంట్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో మార్కెట్ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం సెన్సెక్స్ 78,509.77 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,542.44) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో సూచీ 78,048.26 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి సెన్సెక్స్ 388.19 పాయింట్లు క్షీణించి 78,154.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 112.10 పాయింట్లు కోల్పోయి 24,471.70 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.43 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో ఎటర్నల్, ఇన్ఫోసిస్, టైటాన్, హెచ్‌సీఎల్, టీసీఎస్ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.53 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,373.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఈవీ కొనుగోలు దారులకు గుడ్‌న్యూస్..

ఎలక్ట్రిక్ వాహన కొనుగోలుదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం ఇ-డ్రైవ్ పథకం కింద ఇచ్చే సబ్సిడీ గడువును 2028 మార్చి 31 వరకు పొడిగించింది. ఈ పథకం అమలుకు మరో రూ.1000 కోట్లు అదనంగా కేటాయించింది. ఈ



మేరకు సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ స్కీమ్ కింద ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు కిలోవాట్ అవర్కు రూ.2,500 చొప్పున సబ్సిడీ చెల్లిస్తారు. ఒక వాహనానికి గరిష్ఠంగా రూ.5వేలు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. 2024-25లో కిలోవాట్ అవర్‌కు రూ.5వేలు, ఒక వాహనానికి గరిష్ఠంగా రూ.10వేలు సబ్సిడీ ఉండేది. ఎలక్ట్రిక్ టూవీలర్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.1.5 లక్షలు దాటని వాహనాలకే ఈ సబ్సిడీ వర్తిస్తుంది.

# తప్పుడు నిర్ణయాలకు ఏఐని నిందించొద్దు: బ్యాంకులకు ఆర్‌బీఐ సూచన



ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మంగళవారం బ్యాంకులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. బ్యాంకు కార్యకలాపాల్లో ఏఐ మోడళ్లు ఉపయోగించాలి గానీ, మానవ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. తప్పుడు నిర్ణయాలకు సాంకేతికతను సాకుగా చెప్పి తప్పించుకోరాదని స్పష్టం చేశారు. ఏఐ మోడళ్లు తీసుకునే నిర్ణయాలకు పూర్తి బాధ్యత బ్యాంకులే వహించాలన్నారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

'వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఏఐ టూల్స్ వినియోగించాలి. కానీ మనుషుల నిర్ణయాలను పూర్తిగా రీప్లేస్ చేసేలా ఉండకూడదు. ఏదైనా నిర్ణయానికి సంబంధించి.. ఏఐ మోడల్ లేదా ఆల్గారిథం నిర్ణయం తీసుకుందని చెప్పి బ్యాంకులు తప్పించుకోలేవు. ఏఐ మోడల్ తప్పు చేసిందని చెప్పే సమాధానాన్ని ఆర్‌బీఐ గానీ, వినియోగదారులు గానీ అంగీకరించరు. ఏఐ వినియోగంలో సైబర్ సెక్యూరిటీ రిస్క్‌లు ఉంటాయి. జాగ్రత్తలు పాటించాలి. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన ఏఐ గవర్నెన్స్ పాలసీని పాటించాలి. ఏఐ నిర్ణయాలను అంతిమంగా భావిస్తే.. ఆ నిర్ణయాన్ని ఎందుకు సిఫార్సు చేశామో వివరించేలా ఉండాలి'' అని మల్హోత్రా తెలిపారు.




## చంపేస్తామంటూ గంగూలీ దంపతులకు బెదిరింపులు



భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ, ఆయన సతీమణి డోనా గంగూలీని చంపేస్తామంటూ బెదిరింపు లేఖలు రావడం కలకలం రేపింది. ఆరు నెలలుగా ఇలాంటి లేఖలు వస్తున్నాయని గంగూలీ కుటుంబసభ్యులు తెలిపారు. ఎవరో ఆకతాయిలు ఇలా చేస్తున్నారని వారు మొదట్లో పెద్దగా పట్టించుకోలేదు. కానీ బెదిరింపు లేఖలు పదే పదే వస్తుండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఇటీవల వచ్చిన లేఖలో గంగూలీ, ఆయన భార్యతోపాటు వారి సన్నిహితులకు హాని చేస్తామని బెదిరించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ బెదిరింపులపై వెంటనే చర్యలు తీసుకోవాలని.. తమకు భద్రత కల్పించాలని గంగూలీ కుటుంబసభ్యులు కోరారు. ఆ బెదిరింపు లేఖలను కొరియర్ ద్వారా పంపినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. లేఖలో లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గంగూలీ, ఆయన కుటుంబ సభ్యులకు భద్రత కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

# కోహ్లీ ఆ విషయంలో రాజీపడడు.. నా బెస్ట్ మూమెంట్ అదే: మాజీ ఫీల్డింగ్ కోచ్

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ ప్రశంసలు కురిపించాడు. అతడు ఫీల్డింగ్‌లో చూపించే ఎనర్జీ అద్భుతమని.. ప్రాక్టీస్‌లో చూపించే ఉత్సాహాన్ని మ్యాచ్‌లోనూ ప్రదర్శిస్తాడని పేర్కొన్నాడు. విరాట్ ప్రభావం జట్టులోని మిగతా ఆటగాళ్లపై ఉంటుందని మాజీ ఫీల్డింగ్ కోచ్ తెలిపాడు. ''కోహ్లీ ఫీల్డింగ్‌లో రాజీపడడు. పవర్ ప్లేలో కవర్స్, షార్ట్ మిడ్ వికెట్‌లో డైవ్‌లు చేస్తూ బంతిని ఆపే విధానం అద్భుతంగా ఉంటుంది. బంతి తనవైపు రానప్పుడు కూడా అతడి ఫీల్డింగ్ ప్రయత్నాలు ఆగవు. ఇది నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన కోహ్లీ.. ఈ దశలోనూ చివరి ఓవర్లలో లాంగాన్‌లో ఫీల్డింగ్ చేస్తాడు. అక్కడి నుంచి పరుగెత్తుకొస్తాడు. కోహ్లీతో కలిసి ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు.. అతడిని స్ఫూర్తిగా తీసుకుని తమ సామర్థ్యాలకు మించి రాణించిన ఆటగాళ్లు కూడా ఉన్నారు. అది విరాట్ లెవల్'' అని దిలీప్ వివరించాడు.

''నా కెరీర్‌లో అత్యుత్తమ క్షణం గురించి ఆలోచిస్తే 2024 టీ20 ప్రపంచ కప్ గుర్తుకొస్తుంది. కేవలం ఆ ట్రోఫీ మాత్రమే కాదు, ఆ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో నెలకొన్న వాతావరణం. గత నాలుగేళ్లుగా ఆ కుర్రాళ్లు పడ్డ కఠిన శ్రమను నేను గ్రహించగలిగాను. ఆ అనుభూతిని ఎప్పటికీ నా మనసులో భద్రపరుచుకుంటాను'' అని దిలీప్ తెలిపాడు. నవంబర్ 2021లో భారత జట్టులో చేరిన దిలీప్ ఇటీవల కోచ్ పదవికి రాజీనామా చేశాడు. అతను ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్నప్పుడు టీమ్ఇండియా రెండు టీ20 ప్రపంచ కప్‌లు (2024, 2026), ఛాంపియన్స్ ట్రోఫీ (2025), రెండు ఆసియా కప్‌లు (2023, 2025) సాధించింది. 2023 వన్డే ప్రపంచ కప్, డబ్ల్యూటీసీలో రన్నరప్‌గా నిలిచింది.



# సిరాజ్ కాదు.. టీమ్ఇండియాకు అతనే ఎక్స్-ఫ్యాక్టర్: శ్రీలంక మాజీ ఆల్‌రౌండర్



శ్రీలంక, భారత్ మధ్య ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. గాయం కారణంగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడం టీమ్ఇండియాకు ఇబ్బందికరంగా మారింది. అయితే, గుర్నూర్ బ్రార్ భారత జట్టుకు ఎక్స్-ఫ్యాక్టర్ కాగలడని శ్రీలంక మాజీ ఆల్‌రౌండర్ ఫర్వేజ్ మహరూఫ్ అభిప్రాయపడ్డాడు. ప్రసిద్ధ్ కృష్ణ, అకిబ్ నబీ, గుర్నూర్‌లతో కూడిన పేస్ దళానికి సిరాజ్ నాయకత్వం వహిస్తాడు. తుది జట్టులో గుర్నూర్‌కు చోటు దక్కుతుందా? లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ''బుమ్రాకు రివర్స్ స్వింగ్ చేయగల సామర్థ్యం ఉంది. ముఖ్యంగా పాత బంతితో అద్భుతంగా రివర్స్ స్వింగ్ రాబడతాడు. అతను లేకపోవడం భారత్‌కు పెద్దలోటు కానుంది. సిరాజ్ మంచి బౌలరే. కానీ బుమ్రాతో పోల్చి చూసినప్పుడు మాత్రం కొంత తేడా కనిపిస్తుంది. వార్మప్ మ్యాచ్‌లో గుర్నూర్ బ్రార్ బౌలింగ్ చేసిన తీరు ఆకట్టుకుంది. అతను టీమ్ఇండియాకు ఎక్స్-ఫ్యాక్టర్ అవుతాడని అనుకుంటున్నా. అతని బౌలింగ్‌లో మంచి వేగం, బౌన్స్ ఉన్నాయి. గుర్నూర్‌లో పోరాట పటిమ ఉంది. అవసరమైతే దూకుడును ప్రదర్శించగలడు.నేను గనుక భారత జట్టు వ్యూహకర్తల బృందంలో ఉండి ఉంటే గుర్నూర్‌కు కచ్చితంగా ఒక అవకాశం ఇవ్వాలనుకునేవాడిని. అతను భారత్ తరఫున కేవలం వైట్‌బాల్ క్రికెట్ మాత్రమే ఆడాడని నాకు తెలుసు. కానీ, అతని బౌలింగ్‌లో ప్రత్యేకత ఉంది. బ్యాటర్లయను దెబ్బతీయాల్సిన సందర్భాల్లో అతను వేసే చిన్నపాటి స్పెల్స్ అత్యంత ప్రమాదకరమైన ఆయుధంగా మారగలవు. రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌లకుతోడుగా మూడో స్పిన్నర్‌గా మానవ్ సుతార్‌ను తీసుకునే అవకాశముంది.

# అత్యాచారం కేసులో ఐపీఎల్ క్రికెటర్ అరెస్టు



ఐపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బెంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఓ వైద్య విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన అత్యాచారం, బెదిరింపుల కేసులో అభిషేక్‌ను కోల్‌కతా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని జూన్‌లో హుగ్లీలోని మోగ్రా పోలీస్ స్టేషన్‌లో అభిషేక్‌పై ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని, ఇద్దరం కలిసి విదేశాలకు కూడా వెళ్లామని ఆమె తెలిపింది. గత ఏడాది నుంచి తమ మధ్య విభేదాలు తలెత్తాయని, తనపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొంది. ఈ ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అభిషేక్‌ను అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో ఆ యువతి కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రికెటర్‌ను అరెస్టు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో మంగళవారం అభిషేక్ పోరెల్‌ను కోల్‌కతా పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

# ప్రశ్నించినందుకు బయటకు పంపించేశారు: హర్భజన్ సింగ్

భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్ తొలినాళ్లలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్నాడు. 2000లో తనను బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ నుంచి బయటకు పంపడానికి గల కారణాన్ని వెల్లడించాడు. సరైన ఆహారం అందించకపోవడంతో తాను ప్రశ్నించానని, అందుకే తనను ఎన్‌సీఏ నుంచి పంపించారని పేర్కొన్నాడు. ఎన్‌సీఏలో శిక్షణ పొందిన తొలి బ్యాచ్ ఆటగాళ్లలో హర్భజన్ కూడా ఉన్నాడు.



''నన్ను ఎన్‌సీఏ నుంచి బయటకు పంపించారు. అది నా తప్పు కాదు. ఈ విషయాన్ని నేను ఇప్పటికీ బహిరంగంగానే చెబుతాను. ఆటగాళ్ల కోసం ప్రత్యేకంగా డైట్ ఏర్పాటు చేశారు. కానీ, దానికి అనుగుణంగా ఆహారం అందించేవారు కాదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి మార్పు రాలేదు. అందుకే ఒక రోజు నేను ఆ చార్ట్‌ను చించేశాను. నేను చేసిన ఏకైక తప్పు అదే. దీంతో నన్ను ఎన్‌సీఏ నుంచి బయటికి పంపించేశారు. నేను నా హక్కుల కోసం పోరాడాను. నేను ప్రశ్నించకపోతే ఇప్పటికీ అదే డైట్ ప్లాన్ ఉండేది. అప్పట్లో బీసీసీఐలో తమ మాటకు ఎదురుచెప్పే వారిని సహించలేని వారు కొందరు ఉండేవారు'' అని భజ్జీ పేర్కొన్నాడు.

# 'కొరియన్ కనకరాజు' మెగా బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్‌లో మెగాస్టార్ చిరంజీవి




**వుదయం సినిమా:** మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'కొరియన్ కనకరాజు'. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించాయి. ఆగస్టు 6న జరిగిన ఈ సినిమా ప్రీమియర్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆగస్టు 7న వరల్డ్ వైడ్ థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ మెగా బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది.మెగా బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. ఒక సినిమా విజయం సాధిస్తే ఎంతోమందిలో ఆనందాన్ని నింపుతుంది. ఎన్నో ఏళ్లుగా నేను ఈ విషయాన్ని చూస్తున్నాను. అది మరోసారి ఇక్కడ పునరావృతం అయింది. ఈ సంతోషంలో పాలుపంచుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. సినిమా చూసిన తర్వాత ఫంక్షన్ ఎప్పుడు పెడతారు, దాని గురించి నాలుగు మాటలు మాట్లాడాలని ఉంది అని అనుకున్నాను. వరుణ్ ఈ వేడుకకు రమ్మని అన్నపుడు కచ్చితంగా వస్తానని చెప్పాను. ఇలాంటి విజయాలను సెలబ్రేట్ చేసుకోవాలి. ఇంత గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులకు తలవంచి ధన్యవాదాలు తెలియజేయడం మనందరి బాధ్యత. ఒక సినిమా విజయం సాధిస్తే నటీనటులు, టెక్నీషియన్లు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు ఇలా ఎంతోమందిలో సంతోషం నింపుతుంది. ప్రతి ఒక్కరూ గుండెల నిండా ఆనందంతో 'కొరియన్ కనకరాజు' విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ సినిమా విజయానికి ప్రధాన కారణం దర్శకుడు మేర్లపాక గాంధీ. జనాలకు నచ్చే అద్భుతమైన కంటెంట్‌ను అందించారు. ఒక సినిమా విజయంలో దర్శకుడి బాధ్యత ఎంతో ఉంటుంది. గాంధీ అద్భుతమైన దర్శకుడు. తను ఇలాంటి మరెన్నో మంచి సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను. హారర్ కామెడీ సినిమాలు ఇదివరకు చాలా వచ్చాయి. కానీ 'కొరియన్ కనకరాజు'లో కొరియన్ ఫ్లేవర్‌ను, ఆ కల్చర్‌ను తీసుకురావడం చాలా గొప్ప ఆలోచన. ఈ విజయంలో ఆ ఆలోచన ప్రధాన కారణం. అందుకు దర్శకుడిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఈ సినిమా ఇంత కమర్షియల్‌గా అందరినీ అలరించిందంటే దానికి మరో ప్రధాన కారణం నా బిడ్డ వరుణ్ తేజ్. వరుణ్ మొదటి నుంచి వైవిధ్యమైన సినిమాలు, కథలు, పాత్రలు చేస్తున్నాడు.

# "ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ అనౌన్స్ మెంట్



**వుదయం సినిమా:** "క", "కె ర్యాంప్", "చెన్నై లవ్ స్టోరీ" సినిమాలతో హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ అందుకున్న హీరో కిరణ్ అబ్బవరం మరో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టారు. "క" చిత్రంతో థ్రిల్లర్, "కె ర్యాంప్" తో మాస్ ఎంటర్ టైనర్, "చెన్నైలవ్ స్టోరీ"తో ఎమోషనల్ లవ్ స్టోరీ చేసిన కిరణ్ అబ్బవరం వైవిధ్యమైన జానర్స్ ను ఎంచుకుంటూ హీరోగా తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు. ఈ క్రమంలో జాయ్ ఫిలింస్ లో ఓ సినిమా, "కెఎ 13" అనే మరో సినిమాతో పాటు సుకుమార్ రైటింగ్స్ లో "కెఎ 14" సినిమా చేస్తున్న కిరణ్ అబ్బవరం ఇప్పుడు "కెఎ15" గా భారీ మైథాలజీ మూవీని ప్రకటించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ శ్రీకాంత్ పుప్పాల కాంబినేషన్ లో కిరణ్ అబ్బవరం హీరోగా ఎపిక్ మైథాలజీ మూవీ "ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ ఈ రోజు అనౌన్స్ చేశారు. మన పురాణ ఇతిహాసాల్లోని ధర్మానికి అధర్మానికి మధ్య జరిగే పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాను రూపొందిస్తున్నారు కొత్త దర్శకుడు శ్రీకాంత్ పుప్పాల.


# రాజు బొనగాని దర్శకత్వంలో ఆఫ్టర్ ఇంజనీరింగ్ నూతన చిత్రం

**వుదయం సినిమా:** రాస్రా ఎంటర్ టైన్మెంట్ బ్యానర్ పై రాజు బొనగాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం ఆఫ్టర్ ఇంజనీరింగ్. ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించిన రాస్రా ఎంటర్ టైన్మెంట్ బ్యానర్ పై నూతన నటీనటులను పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న రాజు బొనగాని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.ఆఫ్టర్ ఇంజనీరింగ్ అనే యూత్ ఫుల్ ఎంటర్టైన్మెంట్ కథాంశంతో తెలుగు చిత్ర పరిశ్రమలో రాజు బొనగాని తనదైన ముద్ర వేయనున్నారు. వినూత్న కథలను, ఎమోషనల్ లవ్ స్టోరీ లను ఎప్పుడు ఆదరించే తెలుగు ప్రేక్షకులకు ఆఫ్టర్ ఇంజనీరింగ్ చాలా కాలం పాటు గుర్తుండిపోయే సినిమా అవుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. ప్రస్తుతం సినిమా పాటలు రికార్డింగ్ జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. త్వరలోనే చిత్రానికి సంబంధించిన పూర్తి అప్డేట్ వెల్లడిస్తామని తెలిపారు. ఆఫ్టర్ ఇంజనీరింగ్ ( థిస్ ఈజింట్ జస్ట్ మై స్టోరీ, ఇట్స్ అవర్ స్టోరీ ) ఇది నా స్టోరీ మాత్రమే కాదు మన అందరి స్టోరీ అనే శీర్షికతో వస్తున్న ఈ చిత్రం యూత్ ని ఆకట్టుకుంటుందని డైరెక్టర్ రాజు బొనగాని తెలిపారు. రాస్రా ఎంటర్ టైన్మెంట్ బ్యానర్ లో ఈ చిత్రం రూపొందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అన్ని వివరాలను త్వరలోనే ఒక ప్రత్యేక ఈవెంట్ ను ఏర్పాటు చేసి తెలియజేస్తామని డైరెక్టర్ రాజు బోనగాని పేర్కొన్నారు.



# "సర్దార్ సర్వాయి పాపన్న" సినిమా ట్రైలర్ లాంచ్

**వుదయం సినిమా:** బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన యానిమేషన్ మూవీ "సర్దార్ సర్వాయి పాపన్న". ఈ సినిమాను వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. ఈ యానిమేషన్ మూవీ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు తెలంగాణ ట్రాన్స్ పోర్ట్, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఈ చిత్ర పోస్టర్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలోతెలంగాణ ట్రాన్స్ పోర్ట్, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ – బహుజనుల రాజ్యం నెలకొల్పాలి, మన రాజ్యం మనమే పరిపాలించుకోవాలని పోరాటం సాగించిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న. ఆయన కోటలను జయిస్తూ గోల్కొండ కోటదాకా వెళ్లిన ఆయన పోరాటం ఈ తరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. అలాంటి ధీరుడి చరిత్రతో వెంకటేష్ గౌడ్ సినిమా రూపొందించడం, ఆ సినిమాను రామకృష్ణ గౌడ్ గారు రిలీజ్ చేస్తుండటం సంతోషకరం. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను పుస్తక రూపంలోనూ వెంకటేష్ గౌడ్ తీసుకొస్తుండటం అభినందనీయం. ఈ విధంగా చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. సర్వాయి పాపన్న చరిత్ర భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలి. బహుజనులను ఏకం చేయడానికి సాధనంగా నిలవాలని కోరుకుంటున్నా. ఈ నెల 18న ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఆవిష్కరిస్తున్నాం అన్నారు.



# 'రంభ ఊర్వశి మేనక' టీజర్ లాంచ్

**వుదయంసినిమా:** కామెడీ సినిమాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్ మరోసారి తనకు బాగా కలిసొచ్చిన జానర్‌లో సందడి చేయబోతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక'. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, చార్ట్‌బస్టర్‌గా నిలిచిన 'నా కంటి మీద కనులే' పాట సినిమాపై ఆసక్తిని పెంచాయి. తాజాగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు.టీజర్ ఓ తండ్రి తన కుమారుడికి ఒక మిస్టరీ ఫ్యామిలీ మ్యాజిక్ బుక్‌ను పరిచయం చేయడంతో మొదలవుతుంది. ఆ పుస్తకంపై సరైన ముగ్గు వేస్తే ఇంద్రలోకం నుంచి రంభ, ఊర్వశి, మేనకలను భూలోకానికి రప్పించవచ్చని చెబుతాడు. 25 ఏళ్లుగా ప్రయత్నించిన తర్వాత చివరకు ఆ ముగ్గురూ భూలోకంలోకి వస్తారు. అయితే ఇంతకాలం ఎదురు చూసిన కల నిజమైన ఆనందం ఎంతోసేపు ఉండదు. ఆ ముగ్గురు అప్సరసలను హ్యాండిల్ చేయడం అనుకున్నంత సులభం కాదని హీరోకు అర్థమవుతుంది.టీజర్‌లో అల్లరి నరేష్ మరోసారి తన కామెడీ టైమింగ్‌తో అదరగొట్టారు. ముఖ్యంగా పల్లెటూరి నేపథ్యంలోని కామెడీ ఆయనకు బాగా సెట్ అవుతుందని మరోసారి నిరూపించేలా ఉంది. సురభి హీరోయిన్‌గా నటించగా, వెన్నెల కిశోర్ ఇంద్రుడి పాత్రలో నవ్వులు పంచబోతున్నారు. చివర్లో కృష్ణంరాజుకు సంబంధించిన 'కత్తి అందుకో జానకి' డైలాగ్‌ను వెన్నెల కిశోర్ తనదైన శైలిలో చెప్పడం టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అల్లరి నరేష్ తండ్రిగా నరేష్ వీకే నటించగా, రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ రంభ, ఊర్వశి, మేనక పాత్రల్లో కనిపించారు. శ్రీనివాస్ రెడ్డి, రచ్చ రవి, మురళీధర్ గౌడ్ తదితరులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరి కాంబినేషన్ సినిమాకు మరింత కామెడీని యాడ్ చేస్తోంది, దర్శకుడు చంద్ర మోహన్ చింతాడ ఫాంటసీ, కామెడీ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ సినిమాను పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా రూపొందించినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. సినిమాటోగ్రాఫర్ రామ్ రెడ్డి పల్లెటూరి వాతావరణంతో పాటు ఇంద్రలోకంలోని గ్రాండ్ విజువల్స్‌ను అందంగా చూపించారు. ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి వర్క్ ఫాంటసీ ప్రపంచానికి మరింత గ్రాండియర్‌ను తీసుకొచ్చింది. చైతన్ భరద్వాజ్ అందించిన సంగీతం కామెడీ సన్నివేశాలకు మరింత ఎనర్జీని అందిస్తోంది. ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్. ఫాంటసీ, కామెడీ, గ్రామీణ నేపథ్యాన్ని కలిపి ప్రేక్షకులకు ఫుల్ ఫన్ అందించే సినిమాగా టీజర్ మంచి అంచనాలను క్రియేట్ చేస్తోంది. 'రంభ ఊర్వశి మేనక' సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.




# 'స్లమ్ డాగ్' నుంచి హెగ్డేగా టబు గ్లింప్స్

**వుదయం సినిమా:** డైనమిక్ ఫిల్మ్‌మేకర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి మొదటిసారిగా కలసి చేస్తున్న పాన్–ఇండియా యాక్షన్ డ్రామా 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్'. రా ఎమోషన్స్, పవర్‌ఫుల్ యాక్షన్, మిస్టరీ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఇప్పటికే టబు ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన మేకర్స్.. తాజాగా ఆమె పాత్రకు సంబంధించిన పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.నగరంలోని స్లమ్ ఏరియా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ గ్లింప్స్.. అక్కడి రఫ్ అండ్ గ్రిటీ వాతావరణాన్ని పరిచయం చేస్తూ మొదలవుతుంది.



# 'సెయాన్' రెండవ షెడ్యూల్ ప్రారంభం

**వుదయం సినిమా:** వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్'' ప్రాజెక్ట్ కోసం దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌తో చేతులు కలిపారు. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న 'అమరన్' తర్వాత రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో శివకార్తికేయన్ చేస్తున్న చిత్రమిది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ రోజు రెండవ షెడ్యూల్ ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియోలో శివకార్తికేయన్ లుక్ అందరినీ ఆకట్టుకుంటుంది.ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని భారీ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు.ఎమోషన్స్, మాస్ అప్పీల్, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఎంటర్టైనర్ గా సినిమా రూపొందనుంది.ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. వివేక్ విజయ కుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, షాన్ లోకేష్ ఎడిటింగ్ చేస్తున్నారు.



# TFTDDA నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

**వుదయం సినిమా:** తెలుగు ఫిలిం & టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (TFTDDA) 2025–2027 సంవత్సరానికి సంబంధించి ఉప ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలతా దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు, డ్యాన్సర్లు, డ్యాన్స్ డైరెక్టర్లు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఉప ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా తమ బాధ్యతలను స్వీకరించి ప్రమాణం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యవర్గ సభ్యులకు అధ్యక్షురాలు సుమలతా దేవితో పాటు యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.